www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 129
మంగళవారం | 6-8-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 7.53 తదుపరి తదియ; నక్షత్రం మఖ సా. 5.44 తదుపరి పుబ్బ; వర్జ్యం: శేషం ఉ.6.18, రా.2.32-4.26; దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, రా.10.23-11.07; అమృతఘడియలు: మ.3.05-4.51; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.42
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


హసీనా తండ్రి ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న యువకుడు

కల్లోల బంగ్లా

ప్రధాని నివాసం, సీజే నివాసం, పార్లమెంటుల్లో విధ్వంసం

ప్రధాని షేక్ హసీనా రాజీనామా.. పార్లమెంటు రద్దు.. ఖలీదా జియా విడుదల


హసీనా అధికారిక నివాసాన్ని ముట్టడించిన వందలమంది ఆందోళనకారులు; (ఇన్‌సెట్) ప్రధాని పడకపై ఓ విద్యార్థి

హసీనాను జాతినుద్దేశించి ప్రసంగించనివ్వని ఆర్మీ
ఆగమేఘాల మీద భారత్‌కు.. కట్టుదిట్టమైన భద్రత
జాతీయ భద్రతా సలహాదారు ధోబాల్ సమావేశం
తమవద్దకు రావొద్దన్న బ్రిటన్!.. కొన్నాళ్లు భారత్‌లోనే!
బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జమా నేతృత్వంలో కొత్త సర్కారు
ఆందోళనలు విరమించాలని ఉద్యమకారులకు పిలుపు
బంగ్లాదేశ్‌కు విమానాలు, రైళ్ల రాకపోకలు బంద్
అమ్మ మళ్లీ రాజకీయాల్లోకి రారు: హసీనా కుమారుడు
ప్రధాని మోదీకి పరిణామాలను వివరించిన జైశంకర్

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 5: సర్కారీ కొలువుల్లో 30% కోటా నిరసనలతో దేశవ్యాప్తంగా ఆందోళనలు అట్టుడికిపోతుండడంతో.. నాటకీయ పరిణామాల మధ్య బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేశారు. హింస అదుపులోకి రాకపోవడం.. ఆందోళనకారులు వేల సంఖ్యలో ప్రధాని అధికారిక నివాసం 'గణభవన్' వైపు చొచ్చుకువస్తుండడంతో.. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదముందంటూ ఆర్మీ అధికారులు చేసిన హెచ్చరికలతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు

మిగతా 2వ పేజీలో...

హీరో, అతని తండ్రి హత్య



చాంద్‌పూర్ జిల్లా బగారాబజార్‌లో ఉంటున్న బంగ్లా నటుడు శాంటోఖాన్, అతని తండ్రి, సహ-నిర్మాత సెలీంఖాన్‌ను విద్యార్థులు కొట్టి చంపారు. విద్యార్థుల గుంపు ఇంటిని తగులబెట్టేందుకు రాగా.. వీరు తుపాకీతో కాల్పులు జరిపి, అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులు వీరిని చుట్టుముట్టి, కర్రలతో కొట్టి, హతమార్చారు

ఇద్దరు క్రికెటర్ల ఇళ్లకు నిప్పు





బంగ్లాదేశ్ జాతీయ క్రికెటర్లకూ నిరసనల సెగ తాకింది. ఢాకాలోని మాజీ క్రికెటర్, ఎంపీ మష్రఫే మొర్తుజా, నజ్ముల్ హసన్ ఇళ్లకు ఆందోళనకారులు నిప్పంటించారు.

అవామీ నేత హోటల్‌లో 13 మంది సజీవ దహనం



జెస్సోర్ జిల్లాలోని అవామి లీగ్ ప్రధాన కార్యదర్శి షహీన్ చక్లాదర్‌కు చెందిన 14 అంతస్తుల 'హోటల్ జబీర్ ఇంటర్నేషనల్'కు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనమయ్యారు. తప్పించుకునే ప్రయత్నంలో పైనుంచి కిందకు దూకిన 20 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. హోటల్‌లో ఇంకా ఎంత మంది చిక్కుకున్నారో తెలియదని స్థానికులు తెలిపారు.

భారత్ అప్రమత్తం

సరిహద్దు వెంట నిఘా పటిష్ఠం 2
ప్రధాని మోదీ నేతృత్వంలో క్యాబినెట్ కమిటీ భేటీ
కోల్‌కతా చేరుకున్న బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్‌సింగ్

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ భారీ విస్తరణ

10 లక్షల చదరపు అడుగుల్లో కొత్త క్యాంపస్

మరో 15 వేల మందికి ఉద్యోగ అవకాశాలు
న్యూజెర్సీ కార్యాలయంలో సీఈవోతో సీఎం రేవంత్ భేటీ
ఇప్పటికే హైదరాబాద్‌లో 5 ఆఫీసులు, 18 వేల ఉద్యోగులు
తెలంగాణ స్టార్టప్‌లలో వాల్స్ కర్రా రూ.839 కోట్ల పెట్టుబడులు
సీఎం సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ
అమెరికాను మార్చేశారు.. ఇక సొంత రాష్ట్రం తెలంగాణకు రండి
ఎన్నారైల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
రేవంత్‌కు ఘనస్వాగతం పలికిన తెలంగాణ ప్రవాసులు
అమెరికాకు పయనమైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
జయశంకర్ సార్.. నిన్ను మరువం: రేవంత్ నివాళి

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో తొలిరోజే ప్రముఖ అంతర్జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీ కాగ్నిజెంట్ శుభవార్త అందించింది. నగరంలో భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. హైదరాబాద్‌లో దాదాపు 15 వేల మంది ఉద్యోగులకు పని కల్పించేలా కొత్త క్యాంపస్ నెలకొల్పనున్నట్లు సోమవారం ప్రకటించింది. 20 వేల మంది ఉద్యోగులు పనిచేసే సామర్థ్యం కలిగి ఉండేలా 10 లక్షల చదరపు అడుగుల స్థలంలో దీనిని నెలకొల్పుతామని కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ప్రకటించారు. 2002లో కేవలం 180 మంది ఉద్యోగులతో హైదరాబాద్‌లో తొలి కార్యాలయం ప్రారంభించిన ఈ సంస్థ ప్రస్తుతం నగరంలో ఐదు కార్యాలయాలు, 18 వేల మంది ఉద్యోగులను కలిగి ఉంది. కొత్త సాంకేతిక

మిగతా 13వ పేజీలో...


కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌కు జ్ఞాపిక ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర



ఆల్మట్టి నుంచి సాగర్ దాకా!

అన్ని ప్రాజెక్టుల గేట్లనూ తెరిచి దిగువకు నీరు

నాగార్జునసాగర్‌లో 20 గేట్ల నుంచి విడుదల.. ఎగువ నుంచి 3.75 లక్షల క్యూసెక్కులు
దిగువకు 1,96,027 క్యూసెక్కులు.. 584.80 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం
పులిచింతలలోనూ రెండు గేట్లు ఓపెన్.. ఎగువ ప్రాజెక్టులకు స్వల్పంగా తగ్గుతున్న వరద

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా భారీగా వస్తున్న వరదతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండాయి. ఇంకా నిలకడగా వరద వచ్చిచేరుతుండటంతో ఆల్మట్టి నుంచి నాగార్జునసాగర్ దాకా ప్రాజెక్టుల గేట్లన్నీ తెరిచి ఉంచారు. ఆల్మట్టి ప్రాజెక్టు గేట్లు ఇప్పటికే తెరుచుకొని ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు, ఉజ్జయిని ప్రాజెక్టు గేట్లు 16, జూరాల ప్రాజెక్టుకు గేట్లు 34 , శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు, నాగార్జునసాగర్‌కు చెందిన 20 గేట్లను తెరిచి ఉంచారు. సాగర్‌లో ఉదయం 10గంటలకు ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు ప్రధాన డ్యాం క్రస్ట్ గేట్లపై 13వ నంబరు గేటు వద్ద ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం స్విచ్‌ఆన్ చేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ తర్వాత మొత్తం 6 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గేట్లపై

మిగతా 12వ పేజీలో...



డ్రోన్ల ద్వారా ఆహారం

- వయనాడ్‌లో వలంటీర్లకు పంపిణీ
- 'సూపర్ హీరో' ప్రజీశ్ మిస్సింగ్
- బాధితుల రక్షణకు వెళ్లి గల్లంతు

3



బ్లాక్ మండే

9

- ప్రపంచ మార్కెట్లతోపాటు కుప్పకూలిన దేశీయ స్టాక్ సూచీలు
- సెన్సెక్స్ 2,222 పాయింట్లు పతనం
- 662 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- చిన్న, మధ్య స్థాయి షేర్లు విలవిల
- రూ. 15.32 లక్షల కోట్ల సంపద ఉఫ్
- అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు, జపాన్ వడ్డీ పోటే ప్రధాన కారణాలు

ప్రపంచ మార్కెట్లతోపాటు దేశీయ ఈక్విటీ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 79,000 దిగువకు జారుకోగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,000 వద్దకు పడిపోయింది. నిఫ్టీ సైతం ఒక సమయంలో 824 పాయింట్లు (3.33%) పతనమై 23,893.70 వద్దకు జారుకుంది. చివర్లో తేరుకుని 662.10 పాయింట్లు (2.68%) నష్టంతో 24,055.60 వద్ద క్లోజైంది.

పెళ్లికి వేళాయె..

మూఢాలు పోయాయ్..
పెళ్లి ముహూర్తాలొచ్చేశాయ్
రేపటి నుంచి 28వ తేదీ వరకు
10 శుభ ముహూర్తాలు
11, 18వ తేదీల్లో
అత్యధిక సంఖ్యలో పెళ్లిళ్లు
4 నెలలకు శుభ ఘడియలు
మళ్లీ అక్టోబరు 13దాకా లేవు
ఫంక్షన్ హాల్, కేటరింగ్, డెకరేషన్ వ్యాపారుల్లో ఉత్సాహం



హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పరస్పరం నచ్చేసి.. నిశ్చితార్థం కూడా జరిగిపోయి పెళ్లి కోసం ఎదురుచూస్తున్న అమ్మాయి, అబ్బాయిల కోసం శుభ ముహూర్తాలు వచ్చేశాయ్! ఆ ఇళ్లలో ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి. ముహూర్తాల కోసం వెళితే.. శుభ శ్రావణమాసం.. శుభస్య శ్రీఘ్రం అంటూ పంతులు గారు మంచిరోజు నిర్ణయించేస్తారు! ఈ నెల.. అంటే ఆగస్టు 7 నుంచి 28వ తేదీ వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. పైగా మూడునెలల తర్వాత వచ్చిన శుభ ఘడియలు! ఇవి తప్పిపోతే.. మళ్లీ ఆగస్టు 29 నుంచి మూఢాలు

మిగతా 14వ పేజీలో...



రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు!

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదు
వారికి ప్రజా క్షేత్రంలోనే బుద్ధి చెబుతాం: కేటీఆర్
ఢిల్లీ న్యాయ నిపుణులతో బీఆర్ఎస్ బృందం భేటీ
హైకోర్టులో ఆలస్యమైతే సుప్రీంకెళ్లొచ్చని సూచన

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా 12

బడి శుభ్రంగా.. ఆవరణ పచ్చగా



పాఠశాలల నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు విడుదల 14
విద్యార్థులను బట్టి నెలకు రూ. 3వేల నుంచి 20వేలు
సమగ్ర శిక్ష కంపోజిట్ గ్రాంట్‌కు అదనంగా ఈ మొత్తం
అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా నిర్వహణ

ఇసుకకు యాప్!

తరలింపు పర్యవేక్షణకు వినియోగం
14 వాట్సాప్ తరహాలో తెచ్చే యోచన
అక్రమాల్ని అరికట్టేందుకు కొత్త విధానం
ఐటీ కంపెనీతో సర్కారు సమాలోచనలు

కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు తాఖీదులు

13

మేడిగడ్డ వైఫల్యంపై ప్రైవేటు పిటిషన్ దాఖలు
సెప్టెంబరు 5న హాజరు కావాలంటూ కేసీఆర్, హరీశ్‌రావులకు కోర్టు ఆదేశం



కేటీపీఎస్ టవర్ల కూల్చివేత


12

కాలం చెల్లిన విద్యుత్తు కేంద్రాల తొలగింపులో భాగంగా చర్యలు
58 ఏళ్లనాటి నిర్మాణాలు నేలమట్టం

మృత్యు కుహరాలుగా కోచింగ్ సెంటర్లు

3

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయి
అవసరమైతే వాటిని మూసివేయిస్తాం
ఢిల్లీ ఘటన నేపథ్యంలో సుప్రీం వ్యాఖ్యలు



బంగ్లాదేశ్ పార్లమెంట్ వెలుపల ఆందోళనకారులు



బంగ్లా జాతిపిత ముజీబుర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన ఆందోళనకారులు

కల్లోల బంగ్లా

(మొదటి పేజీ తరువాయి)

ఉధృతమైన వేళ.. ఆమె తన పదవికి రాజీనామా చేసి.. ప్రత్యేక విమానంలో భారత్‌కు బయలుదేరారు. జాతినుద్దేశించి ప్రసంగించడానికి కూడా సైన్యాధికారులు ఆమెకు అవకాశం ఇవ్వలేదు..! హసీనా తన సోదరి రెహనాతో కలిసి ఆర్మీ హెలికాప్టర్‌లో ఎయిర్‌బేస్‌కు.. అక్కడి నుంచి మిలటరీ రవాణా విమానం(సీ-130జే)లో భారత్‌కు బయలుదేరారు. 3.30 గంటల సమయంలో.. హసీనా భారత సరిహద్దుల్లోకి ప్రవేశించారని నిర్ధారించుకున్నాక.. ఆమె రాజీనామా చేసినట్లు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. ఆ తర్వాత జాతినుద్దేశించి ప్రసంగించారు. నిరసనకారులు ఆందోళనలను విరమించాలని, కర్ఫ్యూను ఎత్తివేస్తున్నామని ప్రకటించారు. ఆదివారం నుంచి సస్పెండ్ చేసిన ఇంటర్నెట్ కనెక్షన్‌ను తిరిగి పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. అధికారికంగా మిలటరీ ప్రభుత్వం ఏర్పడుతుందని వెల్లడించారు. అప్పటి దాకా నిరసనలు వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులు.. ఒక్కసారిగా సంబురాలు జరుపుకొన్నారు. అదే సమయంలో ప్రధాని అధికారిక నివాసం సహా.. అధికార అవామీ పార్టీ నేతల ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేశారు. మీడియా కార్యాలయాలపైనా దాడులు జరిగాయి. అధికారపక్షానికి మద్దతిచ్చే వ్యాపారుల దుకాణాలు, పరిశ్రమలు లూటీ అయ్యాయి. దాంతో ఢాకా సహా.. దేశంలోని ప్రధాన నగరాలు నిప్పుల కుంపటిగా మారిపోయాయి. మరోవైపు భారత్ చేరిన హసీనా.. ఘజియాబాద్‌లోని హిండన్ ఎయిర్‌ఫోర్స్ బేస్ వద్ద దిగారు. ఆ వెంటనే.. జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్, వైమానిక దళం అధికారులు అక్కడికి చేరుకున్నారు. హసీనా ఢిల్లీ మీదుగా లండన్ వెళ్లాలని నిర్ణయించుకున్నా.. బ్రిటన్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదని.. దాంతో హసీనా కొంతకాలం భారత్‌లోనే ఉండనున్నారు.

ఉదయం నుంచే

దేశంలో రిజర్వేషన్లపై జరుగుతున్న ఆందోళనల కట్టడిలో భాగంగా హసీనా.. నిరసనల్లో మృతిచెందిన 34 మంది కుటుంబ సభ్యులతో ఉదయం 10.30కు తన అధికారిక నివాసంలో భేటీ అయ్యారు. అప్పటి నుంచి పరిణామాలు వేగంగా మారిపోయాయి. మధ్యాహ్నానికి దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతమయ్యాయి. దాంతో ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా(హసీనాకు బంధువు) ప్రధాని నివాసానికి చేరుకుని, పరిస్థితిని వివరించారు. ఆయన సూచన(45 నిమిషాల అల్టిమేటం జారీ చేశారని బంగ్లాదేశ్ పత్రికలు పేర్కొంటున్నాయి) మేరకే మధ్యాహ్నం 3 గంటల సమయంలో హసీనా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం 3.35 సమయంలో ఆర్మీ చీఫ్ వకార్ జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వ ఏర్పాటు విషయమై చర్చించేందుకు అధ్యక్షుడు షాబుద్దీన్ నివాసానికి వెళ్లారు. తర్వాత అధ్యక్షుడు.. పార్లమెంటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.



ప్రధాని ప్యాలెస్‌లో నిరసనకారులు

ఉధృతమైన ఆందోళనలు

ఆర్మీ చీఫ్ ప్రసంగం తర్వాత కొంత సేపు వీధుల్లో సంబరాలు జరుపుకొన్న ప్రజలు.. ఆ వెంటనే మళ్లీ విధ్వంసకాండకు దిగారు. ప్రధాని అధికారిక నివాసంలోకి వందల మంది చొరబడ్డారు. అక్కడ దొరికిన వస్తువును దొరికినట్లు తస్కరించారు. ప్రధాని అధికార నివాసంలోని ల్యాన్‌లో విద్యార్థులు విలాసంగా కూర్చున్న ఫొటోలు, స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదే సమయంలో హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమాల్ ఇంటికి నిప్పుపెట్టారు. హసీనా తండ్రి, బంగ్లాదేశ్ లిబరేషన్ నాయకుడు, బంగబంధు ముజీబ్-ఉర్-రెహ్మాన్ భారీ విగ్రహం పైకెక్కిన ఆందోళనకారులు.. తల భాగాన్ని సుత్తెతో మోది, పాక్షికంగా ధ్వంసం చేశారు. రాత్రి 7.30 సమయంలో బుల్డోజర్‌తో తిరిగి వచ్చిన ఆందోళనకారులు.. ఆ విగ్రహాన్ని నేలమట్టం చేశారు. ఢాకాలోని అవామీ లీగ్ కార్యాలయం సుధాసదన్‌కు, బంగబంధు మ్యూజియానికి, ఇందిరాగాంధీ కల్చరల్ సెంటర్‌కు నిప్పుపెట్టారు. బంగ్లాదేశ్ ప్రధాన న్యాయమూర్తి ఇంట్లోనూ విధ్వంసం సృష్టించారు. ఆ తర్వాత పార్లమెంట్ భవనంలోకి చొచ్చుకువెళ్లారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఢాకా విమానాశ్రయాన్ని ఆరు గంటల పాటు మూసివేశారు.



15 ఏళ్లు ప్రధానిగా..

షేక్ హసీనా అనూహ్య పరిణామాల మధ్య రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె తండ్రి ముజీబ్-ఉర్-రెహ్మాన్. 1975లో మిలటరీ తిరుగుబాటులో.. ముజీబ్-ఉర్-రెహ్మాన్, ఆయన భార్య, ముగ్గురు కుమారులు దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో హసీనా, ఆమె సోదరి రెహనా జర్మనీలో ఉన్నారు. ఆరేళ్ల పాటు ప్రవాస జీవితాన్ని గడిపిన హసీనా.. ఆ తర్వాత బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ప్రజల పక్షాన నిలబడి రాజకీయాల్లోకి వచ్చారు. 15 ఏళ్లపాటు ఐదుసార్లు ప్రధానిగా సేవలందించారు.

అప్రమత్తమైన భారత్

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా తగ్గకపోవడంతో.. భారత్ అప్రమత్తమైంది. హింస నేపథ్యంలో ఇండో-బంగ్లా సరిహద్దు వెంబడి చొరబాట్లకు అవకాశాలుండడంతో.. సరిహద్దు భద్రత దళం(బీఎస్ఎఫ్) నిఘాను పెంచింది. బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్‌సింగ్ చౌదరి ఆగమేఘాల మీద కోల్‌కతా చేరుకున్నారు. బంగ్లాదేశ్‌తో 4,096 కిలోమీటర్ల మేర భారత్ సరిహద్దును పంచుకుంటుందని.. సరిహద్దు వెంబడి హైఅలెర్ట్ ప్రకటించామని ఆయన వివరించారు. మరోవైపు.. ప్రభుత్వం భారత్-బంగ్లాదేశ్ మధ్య రైలు సేవలను నిలిపివేసింది. ఎయిరిండియా కూడా బంగ్లాదేశ్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేసింది. హసీనాకు కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రాంతంలో బస ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కాగా.. హసీనా భారత్‌ను ఆశ్రయం కోరలేదని తెలుస్తోంది. ఆమె ఢిల్లీలోని తన కూతురు, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తూర్పు ఆసియా డైరెక్టర్ సైమా వాజిద్‌ను కలిసి.. ఆ తర్వాత లండన్‌కు వెళ్లే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. అయితే.. బ్రిటన్ ప్రభుత్వం ఆమెకు ఆశ్రయం కల్పించలేమని సమాచారం అందించినట్లు తెలిసింది. దీంతో హసీనా కొంతకాలం భారత్‌లోనే ఉండే అవకాశాలున్నాయి.

ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

బంగ్లాదేశ్ పరిణామాలపై మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమీక్షలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పాల్గొన్నారు. ంగ్లాదేశ్‌లో చదువుకుంటున్న భారత విద్యార్థులు పూర్తిస్థాయిలో వెనక్కి తిరిగి రాలేదు. అక్కడ కోటా ఆందోళనలు మొదలైనప్పటి నుంచి గత నెల 22 వరకు 2,894 మంది విద్యార్థులు వెనక్కి వచ్చారు. ఇంకా 3 వేల మంది వరకు అక్కడే ఉన్నారని.. వారిని వెనక్కి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. కాగా.. ఇండో-బంగ్లా మధ్య గూడ్స్ లారీలను నడిపే భారత డ్రైవర్లు సరిహద్దుల్లో చిక్కుకుపోగా.. ఆది, సోమవారాల్లో వారిని వెనక్కి రప్పించినట్లు బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

ఎస్సైని కొట్టి చంపిన దుండగులు

చాంద్‌పూర్ జిల్లాలోని కచువా, మత్లెబ్(సౌత్), మత్లెబ్(నార్త్), హెమ్సార్, ఫరీద్‌గంజ్ ఠాణాలపై ఆందోళనకారులు దాడి చేశారు. కచువా ఎస్సై మామునూర్ రషీద్‌ను కొట్టి చంపారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో షహదత్(20) అనే విద్యార్థి మృతిచెందగా.. ఇమ్రాన్‌హుస్సేన్ అనే విద్యార్థికి తూటా గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉంది.

బంగ్లాదేశ్‌ను కుదిపేస్తున్న ప్రస్తుత పరిణామాలకు 'ముక్తి యోధుల కోటా'పై ఆగ్రహమేనా? అంటే.. రిజర్వేషన్ల అంశం పైకి కనిపించే స్థూల కారణం మాత్రమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు! బంగ్లాదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా ఆ ఫలాలు ఉద్యోగాల రూపంలో ప్రజలకు అందకపోవడం, 2009 నుంచి అధికారంలో ఉన్న అవామీ లీగ్ అక్రమాలు, అవినీతి, విపక్ష నేతల అరెస్టులు, ప్రతిపక్షాలు ఎన్నికలనే బహిష్కరించే పరిస్థితి రావడం.. ఇలా చాలా కారణాలు ఒకదానికొకటి తోడై ప్రస్తుత సంక్షోభానికి దారితీశాయని వారు విశ్లేషిస్తున్నారు.

రిజర్వేషన్లపై యుద్ధంగా మొదలై



ప్రధాని ప్యాలెస్ వైపు ఆందోళనకారుల ర్యాలీ

1972లో అమల్లోకి స్వాతంత్ర్య సమరయోధుల కోటా

తదుపరి తరాలకూ వర్తింపజేయడంపై విద్యార్థుల ఆక్రోశం

1971 యుద్ధంలో స్వాతంత్ర్యం సంపాదించుకున్న అనంతరం.. బంగ్లాదేశ్ తొలి ప్రధాని షేక్ ముజిబుర్ రహమాన్ 1972లో స్వాతంత్ర్య సమరయోధులకు (30%), యుద్ధం వల్ల నష్టపోయిన మహిళలకు (20%), పేదలు, వెనుకబడిన జిల్లాలకు చెందినవారికి, గిరిజనులు, మైనారిటీలకు (30%) ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కేటాయించారు. ఆయన మరణానంతరం.. ఆ దేశ ప్రభుత్వం 1976లో రిజర్వేషన్లను 60 శాతానికి తగ్గించింది. మిగతా 40 శాతం ఉద్యోగాలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడం మొదలుపెట్టింది. 1996 నాటికి రిజర్వేషన్లు 55 శాతానికి తగ్గాయి. అయితే, 1997 తర్వాత స్వాతంత్ర్య సమరయోధుల కోటాలో ఉద్యోగాల భర్తీ క్రమంగా తగ్గడం మొదలైంది. ఆ తరం వారంతా వృద్ధులై చనిపోవడమే ఇందుకు కారణం. దీంతో అప్పటి షేక్ హసీనా ప్రభుత్వం ఆ కోటాను స్వాతంత్ర్య సమర యోధుల పిల్లలకు వర్తింపజేయడం మొదలుపెట్టింది. 2010లో స్వాతంత్ర్య సమరయోధుల మనవలకు సైతం ఆ కోటా వర్తించేలా చేశారు. 2012లో దివ్యాంగులకు 1 శాతం కోటాను వర్తింపజేశారు. దీంతో మళ్లీ రిజర్వేషన్లు 56 శాతానికి పెరిగాయి. 2018లో ఈ కోటా వ్యవస్థను నిరసిస్తూ బంగ్లాదేశ్‌వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో.. హసీనా సర్కారు ప్రథమ, ద్వితీయ శ్రేణి ఉద్యోగాల్లో అన్ని రకాల రిజర్వేషన్లనూ ఎత్తేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై స్వాతంత్ర్య సమరయోధుల వారసులు కొందరు 2021లో హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు ఎత్తేస్తూ హసీనా సర్కారు ఇచ్చిన సర్క్యులర్ చెల్లదంటూ ఈ ఏడాది జూలై 1న హైకోర్టు తీర్పునివ్వడంతో విద్యార్థులు మళ్లీ రోడ్డెక్కారు. ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జూలై 14న.. నిరసనకారులను ఉగ్రవాదులతో పోలుస్తూ హసీనా చేసిన వ్యాఖ్యలు, 'రిజర్వేషన్లు స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు కాక రజాకార్ల వారసులకు ఇవ్వాలా?' అని వ్యంగంగా ప్రశ్నించడం పరిస్థితిని తీవ్రతరం చేసింది. 'అవును మేం రజాకార్లమే.. అన్యాయాన్ని ప్రశ్నించినవారు రజాకార్లయితే.. మేం రజాకార్లమే' అంటూ నినాదాలు చేస్తూ నిరసనల జోరు పెంచారు. ఆ సమయంలో సున్నితంగా వ్యవహరించి విద్యార్థులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిన హసీనా సర్కారు.. ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని నిర్ణయించింది. కర్ఫ్యూ విధించి.. సాయుధ బలగాలను రంగంలోకి దించింది. జూలై 18న.. సాయుధబలగాలకు, నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో 200 మందికి పైగా మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. జూలై 21న.. ముక్తియోధుల వారసులకు ఇస్తున్న 30 శాతం కోటాను 5 శాతానికి, దివ్యాంగుల కోటాను ఒక శాతానికి, మైనారిటీలకు, ట్రాన్స్‌జెండర్లకు కలిపి ఇస్తున్న రిజర్వేషన్‌ను ఒక శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు అప్పిలేట్ డివిజన్ తీర్పునిచ్చింది. మిగతా 93 శాతం ఉద్యోగాలనూ ప్రతిభ ఆధారంగా భర్తీ చేయడానికి మార్గం సుగమం చేసింది. కానీ, ఈ కోటాలను భవిష్యత్తులో మార్చే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుందని తన తీర్పులో పేర్కొంది. ఆ తీర్పు ప్రకారం నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. కానీ, అప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

(సెంట్రల్ డెస్క్)

పాక్ హస్తం?

బంగ్లాదేశ్ కల్లోలం వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని విశ్వసనీయవర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థి ఆందోళనలకు మద్దతిచ్చిన నిషేధిత జమాతే ఇస్లామీకి చెందిన విద్యార్థి సంఘం 'ఛాత్ర శిబిర్'కు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ అండ ఉందని.. విద్యార్థి ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చడం వెనుక అది కీలక పాత్ర పోషించిందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. భారతదేశానికి అనుకూలంగా ఉండే హసీనా ప్రభుత్వాన్ని కూల్చి వారి లక్ష్యమని వివరించాయి.

హసీనా హయాంలో అభివృద్ధి

విద్యార్థుల ఉద్యమానికి సామాజిక, ఆర్థిక కోణాలూ ఉన్నాయి. గడిచిన దశాబ్దన్నర కాలంలో.. అంటే, షేక్ హసీనా 2009లో మళ్లీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ బంగ్లాదేశ్ ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందింది. ప్రపంచంలోనే అతిపెద్ద రెడీమేడ్ దుస్తుల తయారీ హబ్‌గా మారి అంతర్జాతీయ స్థాయి బ్రాండ్లకు వస్త్రాలను ఎగుమతి చేసింది. ఆ రంగంలో 4 కోట్ల ఉద్యోగాలున్నా.. అవి ప్రైవేటు ఉద్యోగాలు. వేతనం తక్కువ. చాకిరీ ఎక్కువ. సముచిత వేతనాలు వచ్చే ప్రభుత్వ ఉద్యోగాలనేమో.. స్వాతంత్ర్య సమరయోధుల కోటా కింద అధికార అవామీ లీగ్ పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు కేటాయించడం, విపరీతమైన అవినీతి కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోవడం ప్రజల్లో కోపానికి కారణమైంది. ఆ కోపాన్ని వెలిబుచ్చుదామంటే విపరీతమైన నిర్బంధాలు. నిరసన కూడా తెలపలేని భయానకమైన వాతావరణం నెలకొని ఉండేది. ఈ పదిహేనేళ్లలో ప్రభుత్వాన్ని విమర్శించిన 80 మంది ఆచూకీ గల్లంతైంది. వారి గురించి వారి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారమూ లేదు. ప్రభుత్వమే వారిని చంపించిందన్న ఆరోపణలున్నాయి. మరోవైపు.. హసీనా అధికారంలో ఉండగా ఎన్నికలు నిష్పాక్షికంగా జరుగుతాయన్న నమ్మకం లేక.. విపక్ష బీఎన్‌పీ, మరికొన్ని పార్టీలు 2014, 2024 ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఆమె రాజీనామా చేసి.. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపిస్తేనే తాము పోటీ చేస్తామని ప్రకటించాయి. ఇవన్నీ ప్రజల్లో కోపం తారస్థాయికి చేరడానికి కారణమయ్యాయి.

భారత్-బంగ్లా మధ్య నిలిచిన వాణిజ్యం

కోల్‌కతా, ఆగస్టు 5: బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాల ప్రభావం భారత్-బంగ్లాదేశ్ వాణిజ్యంపై పడుతోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి ఇరు దేశాల మధ్య వాణిజ్య కార్యకలాపాలు నిలిచిపోయినట్టు వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం నాడే బంగ్లాదేశ్ ప్రభుత్వం మూడు రోజుల ట్రేడ్ హాలిడేను ప్రకటిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అత్యవసర సర్వీసులను మాత్రం దీని నుంచి మినహాయించింది. బంగ్లాదేశ్‌లోని లాండ్ పోర్ట్‌ల వద్ద ఆ దేశ కస్టమ్స్ నుంచి క్లియరెన్స్ లేకపోవడం వల్ల అన్ని లాండ్ పోర్టుల్లో ఎగుమతి, దిగుమతుల కార్యకలాపాలు నిలిచిపోయాయని పశ్చిమ బెంగాల్ ఎగుమతిదారుల కోఆర్డినేషన్ కమిటీ సెక్రటరీ ఉజ్జల్ సాహ తెలిపారు. ఇదిలా ఉండగా.. బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభం పట్ల భారత ఎగుమతిదారులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ద్వైపాక్షిక వాణిజ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు. అయితే త్వరలోనే పరిస్థితులు సద్దుమణుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాసియాలో బంగ్లాదేశ్.. భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండగా.. ఆసియాలో బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి.



భారత్ విరాళంగా ఇచ్చిన అంబులెన్స్‌పై ఆందోళనకారుల దాడి



పాక్‌లో ఇమ్రాన్‌పై కుట్ర

సైనిక పెత్తనానికి కేంద్రమైన పాకిస్థాన్‌లో ఇమ్రాన్ ఖాన్‌ను పూర్తి కాలం పదవిలో కొనసాగనివ్వలేదు. ఉక్రెయిన్ యుద్ధం సమయంలో రష్యాలో పర్యటించిన ఆయనను పట్టుబట్టి మరీ తప్పించారు. దీనివెనుక అమెరికా హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. చివరకు ఇమ్రాన్ అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నరగా జైల్లోనే ఉన్నారు. ఆయన బయటకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

అనూహ్యంగా మారిన నేపాలన

నేపాల్‌లో మొన్నటి వరకు ప్రచండ ప్రధానిగా ఉన్నారు. కానీ, గత నెల 12న జరిగిన విశ్వాస పరీక్షలో ఓడిపోయారు. దీంతో ప్రచండ స్థానంలో కేపీ శర్మ ఓలీ ప్రధాని అయ్యారు. భారత్ వ్యతిరేకత కనబరిచే ఈయన 2021కి ముందు వరకు రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. మరోవైపు, మయన్మార్‌లో సైనిక పెత్తనం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రజాస్వామ్యం కోసం పోరాడిన సూచీని జైలుకు పంపిన మయన్మార్ సైనిక పాలకులు దేశంపై తమ పట్టును బిగించారు.







లంకలో కల్లోలం

ధరల పెరుగుదల, అంతులేని అవినీతి, కుటుంబ పెత్తనంతో సరిగ్గా రెండేళ్ల కిందట శ్రీలంకలో ప్రజలు అధ్యక్షుడు గొటబాయ రాజపక్స మీద తిరుగుబాటు చేశారు. రోజుల తరబడి ఆందోళనలు సాగించారు. చివరకు గొటబాయ అధికారిక నివాసంలోకి చొరబడి నానా బీభత్సం సృష్టించారు. ఈ ఆగ్రహాన్ని చూసిన రాజపక్స దేశం విడిచిపారిపోయారు.



బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ చిచ్చు

బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు రిజర్వేషన్లపై మొదలైన నిరసనలు చివరికి ఆ దేశ ప్రధాని షేక్ హసీనా రాజీనామాకు దారి తీశాయి. బంగ్లాదేశ్ హసీనా హయాంలో ఆర్థికంగా బాగా అభివృద్ధి చెందింది. అయితే, విపరీతమైన అవినీతి, ద్రవ్యోల్బణం, రాజకీయ ఏకస్వామ్యం, నిర్బంధ విధానాలతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది.

రికార్డు విజయం నుంచి

పలాయనం దాకా

విద్యార్థిగానే రాజకీయాల్లోకి హసీనా.. 5 సార్లు ప్రధానిగా ఎన్నిక

ఢాకా, ఆగస్టు 5: స్వాతంత్ర్యం కోసం పోరాడి.. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చి.. సొంత దేశంలోనే సైన్యం చేతిలో తల్లిదండ్రులు, సోదరులను కోల్పోయి.. భారత్‌లో ప్రవాసంలో గడిపి.. మాతృభూమికి తిరిగెళ్లి.. ప్రధానిగా రికార్డు కాలం పనిచేసిన షేక్ హసీనా జీవితంలో మరోసారి సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. బంగ్లా జాతిపిత షేక్ ముజిబుర్ రెహ్మాన్ కుమార్తె అయిన ఈమె.. భారత్-పాక్ విభజన జరిగాక 1947 సెప్టెంబరులో జన్మించారు. 1960ల చివరలో పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం కావాలంటూ బంగ్లా ప్రజలు సాగించిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తండ్రిని పాక్ పాలకులు జైలులో పెట్టగా.. ఆయన స్థాపించిన అవామీ లీగ్ పార్టీ బాధ్యతలను చూశారు. 1971లో దేశానికి స్వాతంత్ర్యం అనంతరం ముజిబుర్ తొలుత అధ్యక్షుడు, తర్వాత ప్రధాని అయ్యారు. మరో నాలుగేళ్లకే ఆయనతో పాటు భార్య, ముగ్గురు కొడుకులను సైన్యం అధికారిక నివాసంలోనే చంపేసింది. చెల్లెలు రెహానాతో కలిసి విదేశాల్లో ఉండడంతో హసీనా ప్రాణాలు దక్కించుకున్నారు. స్వదేశానికి వెళ్లలేని పరిస్థితుల్లో ఆరేళ్లు భారత్‌లో ఉన్నారు. అవామీ లీగ్ పార్టీ అధినేత్రిగా ఎన్నికయ్యాక 1981లో బంగ్లాకు వెళ్లారు. సైన్యం పాలన పోయి ప్రజాస్వామ్యం రావాలని గళమెత్తారు. గృహ నిర్బంధాలను ఎదుర్కొన్నారు. 1991లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్.. బేగం ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్పీ) చేతిలో పరాజయం పాలైంది. 1996లో తొలిసారి గెలిచి ప్రధాని అయ్యారు. 2001లో ఓడిపోయినా 2008 ఎన్నికల్లో గెలిచారు.



బంగ్లాదేశ్‌ను వీడే ముందు మిలిటరీ హెలికాప్టర్ వద్ద షేక్ హసీనా

ఐరన్ లేడీ నుంచి..

హసీనా గత రెండు ఎన్నికల్లో దొడ్డిదారిన ఎన్నికయ్యారన్న విమర్శలొచ్చాయి. భారత్, చైనాలతో బలమైన మైత్రీ బంధం ఆమె అధికార పీఠాన్ని పటిష్ఠం చేసినా క్రమేణా బంగ్లావాద భావోద్వేగం పేరిట ప్రత్యర్థులను అణచివేస్తూ ఆస్మదీయులకు పెద్ద పీట వేయడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఓ ర్యాలీలో హసీనాపై 2004లో హత్యాయత్నం జరిగింది. అనంతరం ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకున్నారు. 1971 యుద్ధ నేరాలపై ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. ఇది ప్రత్యర్థి పార్టీ అగ్రనేతలు కొందరిని దోషులుగా తేల్చింది. 2013లో బీఎన్పీ మిత్రపక్షం జమాత్ ఎ ఇస్లామీపై ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించారు. అవినీతి ఆరోపణలపై ఖలీదా జియాకు 17 ఏళ్ల జైలు శిక్ష పడేలా చేశారు. దీంతో హసీనాను నియంతగా ప్రత్యర్థులు విమర్శించారు. కాగా ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ గెలిచింది. ఆరు నెలలు తిరగకుండానే రిజర్వేషన్ల కోటాపై హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు నేపథ్యంలో అభిమానులు ఐరన్ లేడీగా పిలుచుకున్న నాయకురాలు దేశం విడిచి వెళ్లాల్సివచ్చింది.

ఆర్మీ చీఫ్ అయిన నెలన్నరకే..



షేక్ హసీనా రాజీనామాతో పాటు.. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాపైనే ప్రస్తుతం ప్రపంచం దృష్టంతా ఉంది. ఆయన ఆ పదవి చేపట్టింది ఈ ఏడాది జూన్ 23నే! అంటే ఇంచుమించుగా నెలన్నర క్రితం. ఆయన వయసు 58 సంవత్సరాలు. 1966లో ఢాకాలో జన్మించిన జమాన్.. బంగ్లాదేశ్ జాతీయ విశ్వవిద్యాలయం నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం కింగ్స్ కాలేజ్ (లండన్)లో డిఫెన్స్ స్టడీస్‌లో మరో ఎమ్మే చేశారు. 1985 డిసెంబరులో ఆర్మీలో చేరి సేవలందిస్తున్నారు. ఆర్మీ చీఫ్ కాకమునుపు.. చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్‌గా ఆర్నెల్లపాటు వ్యవహరించారు. ఐక్యరాజ్యసమితి పీస్‌కీపర్‌గా రెండు పర్యటనలు చేశారు. 1997-2000 సంవత్సరాల నడుమ ఆర్మీ చీఫ్‌గా ఉన్న జనరల్ ముహమ్మద్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ కుమార్తె కమలికను వివాహం చేసుకున్నారు. బంగ్లాదేశ్ సైన్యాన్ని ఆధునీకరించారన్న పేరు జమాన్‌కు ఉంది.

గల్ఫ్‌లో బంగ్లా ప్రవాసీల సంఘీభావం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బంగ్లాదేశీయులు లక్షల సంఖ్యలో గల్ఫ్ దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. స్వదేశంలో పరిణామాలను సోమవారం వీరంతా అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. హసీనా రాజీనామా చేయనున్నట్లుగా కథనాలు రావడంతో పనులను పక్కనపెట్టి ఇళ్లకు ఫోన్లు చేసి ఆరాలు తీశారు. కాగా, స్వదేశంలో జరుగుతున్న నిరసనలకు సంఘీభావం తెలిపినందుకు పెద్ద సంఖ్యలో గల్ఫ్ దేశాల్లోని బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్టు చేసి జైలు శిక్షలు విధించారు. వీధులలో శాంతియుతంగా గూమిగూడినా ఊరుకోలేదు. ఫేస్‌బుక్‌లో సంఘీభావ సందేశాలను పెట్టినందుకు దుబాయ్‌లోని బంగ్లాదేశీ ప్రవాసీయులను అరెస్ట్ చేశారు. హసీనా వాస్తవానికి గల్ఫ్ దేశాలలో బంగ్లాదేశ్ వీసాలపై ఉన్న ఆంక్షలను తొలగించి, ఉపాధికి దోహదం చేశారు. కానీ, బంగ్లాదేశ్‌లో పెరిగిపోతున్న మత ఛాందసవాదులకు ఆమె ధోరణి నచ్చలేదు. మోదీ పాలనలోని భారత్‌తో ఆమె సత్సంబంధాలు నెరపడం వారి ఆగ్రహాన్ని రెట్టింపు చేసింది.

లోకం తీరు



ఆరోగ్య బీమా ప్రీమియంపై
రూ.8,263 కోట్ల జీఎస్టీ
గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం వసూలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఆరోగ్య బీమా ప్రీమియంపై పెద్ద మొత్తంలో జీఎస్టీ వసూలు అవుతున్నట్టు కేంద్ర ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడైంది. అలాగే ఇది ఏటేటా పెరుగుతున్నట్టు స్పష్టమైంది. గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఆరోగ్య బీమా ప్రీమియంపై ప్రభుత్వం రూ.8,263 కోట్ల జీఎస్టీని వసూలు చేసింది. అలాగే హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీతో రూ.1,484.36 కోట్లు ప్రభుత్వ ఖజానాకు వచ్చింది. 2022-23లో ఆరోగ్య బీమా ప్రీమియం నుంచి జీఎస్టీ వసూళ్లు రూ.7,638 కోట్లు ఉండగా.. హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీతో మరో రూ.963 కోట్లు వచ్చాయి. జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ రేటును మినహాయించాలని కేంద్ర మంత్రి గడ్కరీ ఇటీవల ప్రతిపాదించిన సంగతి తెలిసిందే.

60 కి.మీ. ఛేజింగ్ చేసి రియల్టీ కంపెనీ సీఈఓ అరెస్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఢిల్లీ పోలీసులు 60 కి.మీ. మేర ఛేజింగ్ చేసి ఓ స్థిరాస్తి కంపెనీ సీఈఓను అరెస్టు చేశారు. పార్శ్వనాథ్ ల్యాండ్ మార్క్ డెవలపర్స్ కంపెనీకి డైరెక్టర్, సీఈఓగా వ్యవహరిస్తున్న సంజీవ్ జైన్‌పై రజత్ బబ్బర్ అనే వ్యక్తి 2017లో ఇచ్చిన ఫిర్యాదుల మేరకు జాతీయ వినియోగదారుల ఫోరం ఆయనపై నాలుగు నాన్‌బెయిలబుల్ వారెంట్లు, ఒక బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ కేసుల విచారణ నిమిత్తం హాజరు కాకపోవడంతో అరెస్టు చేయాలని ఫోరం ఆదేశించింది. గురుగ్రాంలోని డీఎల్ఎఫ్-2లో ఉన్న ఆయన నివాసానికి పోలీసులు వెళ్లగా ఆయన తప్పించుకొని ఇందిరాగాంధీ విమానాశ్రయం వైపు కారులో పారిపోయేందుకు ప్రయత్నించారు. దాంతో పోలీసులు 60 కి.మీ.మేర ఛేజింగ్ చేసి ఆయనను పట్టుకున్నారు.

సీఎంకు గవర్నర్ షోకాజ్ సబబే

న్యూఢిల్లీ,ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ఏ ప్రకారమే కర్ణాటక గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ షోకాజ్ నోటీసు ఇచ్చారని, ఇందులో తప్పేమీ లేదని కర్ణాటక మాజీ గవర్నర్ భరద్వాజ సలహాదారు, ప్రముఖ న్యాయవాది వికాస్ బన్సోడే తెలిపారు. కర్ణాటక గవర్నర్ పద్ధతి ప్రకారమే వ్యవహరించారని, ఆ షోకాజ్ నోటీస్‌కు జవాబివ్వాలా లేదా అన్నది సిద్ధరామయ్య నిర్ణయించుకోవాలని ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో మాట్లాడుతూ చెప్పారు.

200 అస్త్ర మార్క్ క్షిపణుల తయారీ.. డీఆర్డీవోకు వాయుసేన అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 5: గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే 200 అస్త్ర మార్క్ క్షిపణులను తయారు చేయడానికి డీఆర్‌డీవోకు వాయుసేన అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని వాయుసేన అధికార వర్గాలు మీడియాకు తెలిపాయి. ఎస్‌యూ- 30, తేలికపాటి తేజస్ యుద్ధ విమానాల్లో ఇది వరకే అస్త్ర మార్క్ 1, అస్త్ర మార్క్ 2 క్షిపణులను వినియోగిస్తున్నారు. ఈ క్షిపణులను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో భారత డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్)తో కలిసి డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది.

ఆప్ ప్రభుత్వానికి సుప్రీం షాక్

ఎంసీడీలో నామినేటెడ్ సభ్యుల నియామక అధికారం ఎల్జీకే

- మంత్రిమండలి సలహాను పాటించనక్కర్లేదన్న ధర్మాసనం



న్యూఢిల్లీ/చెన్నై, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద దెబ్బ తగిలింది. చట్టం ప్రకారం ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ)లో సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ)కే ఉందని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తేల్చి చెప్పింది. ఈ విషయంలో రాష్ట్ర మంత్రిమండలి సలహా, సూచనలను ఎల్జీ పట్టించుకోనవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసరం సోమవారం తీర్పు చెప్పింది. 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై విచారణను 15 నెలల క్రితమే పూర్తిచేసిన సుప్రీంకోర్టు అప్పుడు రిజర్వు చేసిన తీర్పును తాజాగా వెల్లడించింది. ప్రత్యేక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను ఎంసీడీకి నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి కల్పిస్తూ 1993లో ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1957కు సవరణలు చేశారని ధర్మాసనం తెలిపింది. ఎంసీడీలో 250 మంది ఎన్నికైన, 10 మంది నామినేటెడ్ సభ్యులు ఉంటారు. 2022 డిసెంబరులో జరిగిన ఎంసీడీ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మెజారిటీ మార్కు 126 స్థానాలు కాగా, ఆప్ 134, బీజేపీ 104, కాంగ్రెస్ 9 స్థానాలు గెలుపొందాయి. అనంతరం 10 మంది సభ్యులను ఎల్జీ నామినేట్ చేయగా, మంత్రిమండలి సూచించిన వ్యక్తులను ఎల్జీ నామినేట్ చేసేలా ఆదేశించాలని కోరుతూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. కాగా, ఎంసీడీలో సభ్యులను నామినేట్ చేసే అధికారాన్ని ఎల్జీకి ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన స్థానిక సంస్థను ఆయన అస్థిర పరిచే అవకాశం ఉందని విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, తాజా తీర్పు ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ అని ఆప్ పేర్కొంది. విచారణ సందర్భంగా సీజేఐ, జడ్జిలు చేసిన వ్యాఖ్యలకు ఈ తీర్పు పూర్తి భిన్నంగా ఉందని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు.

యూట్యూబ్ ఛానళ్ల నియంత్రణకు మద్రాస్ హైకోర్టులో పిల్

యూట్యూబ్ చానళ్ల నియంత్రణకు తగిన విధివిధానాలు రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. చెన్నైకి చెందిన పార్తీబన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌లో.. యూట్యూబ్ ఛానళ్లను నియంత్రించే విధానం లేకపోవడంతో ఆయా ఛానళ్ల క్రిమినల్ కేసులపై ఇష్టానుసారంగా ప్రసారం చేస్తున్నాయని, ఇది పోలీసుల విచారణపై ప్రభావం చూపుతోందని అన్నారు. ఈ ఛానళ్ల నియంత్రణకు విధివిధానాలు రూపొందించేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించారు.

మృత్యు కుహరాలుగా
కోచింగ్ సెంటర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలుగా మారాయని సోమవారం సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. అవి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించింది. పాత రాజేందర్‌నగర్‌లోని రావ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లో వరదల కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించిన ఘటనపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. కోచింగ్ సెంటర్లలో భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన అందరికీ కనువిప్పు కావాలని ఆకాంక్షించింది. మరోవైపు అన్ని కోచింగ్ సెంటర్లను తనిఖీ చేయాలంటూ 2023లో ఢిల్లీ హైకోర్టు అగ్నిమాపక శాఖను ఆదేశించడాన్ని సవాలు చేస్తూ కోచింగ్ సెంటర్ల అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ధర్మాసనం పరిశీలించింది. ఇది పసలేని పిటిషన్ అని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది.

అభ్యర్థిత్వం రద్దుపై ఢిల్లీ హైకోర్టుకు ఖేద్కర్

వివాదాస్పద మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అభ్యర్థిత్వాన్ని యూపీఎస్సీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమె సమర్పించిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. పూజా ఖేద్కర్.. మోసపూరితంగా ఓబీసీ, వికలాంగుల కోటాలో ఉద్యోగం పొందినట్లు ఆరోపణల నేపథ్యంలో ఏకసభ్య కమిషన్ నివేదిక మేరకు యూపీఎస్సీ ఆమె సభ్యత్వాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.

ప్రజల సమ్మతితోనే 370 రద్దు

- ఆ నిర్ణయంతో కశ్మీర్‌లో నవ శకం
- రద్దుకు ఐదేళ్లు పూర్తైన సందర్భంగా మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 5: భారత దేశ చరిత్రలో ఆర్టికల్ 370 రద్దు కీలక మలుపు అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నాటి నిర్ణయం ప్రజల సమ్మతితోనే జరగాలని భావించానని ఆయన తెలిపారు. ఐదేళ్ల క్రితం తాము తీసుకున్న నిర్ణయం జమ్మూ, కశ్మీర్, లఢఖ్‌లలో కొత్త శకానికి నాంది అని మోదీ వ్యాఖ్యానించారు. 'ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో తమ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుంది. ఈ మేరకు కశ్మీర్ వాసులకు హామీ ఇస్తున్నా' అని మోదీ తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. ఆర్టికల్ 370 రద్దుతో భద్రత, భరోసా, మెరుగైన అవకాశాలు ఇక్కడి యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు చేరువయ్యాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలను అందుకోలేని వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నాడు తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపయుక్తంగా మారిందని తెలిపారు. 2019, ఆగస్టు ఐదున మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్మూ, కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే. ఇక, ఆగస్టు ఐదును కాంగ్రెస్, పీడీపీలు బ్లాక్‌డేగా పాటించాయి. జమ్మూ, కశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్రంలో పూర్వ స్థితిని తేవాలని డిమాండ్ చేస్తూ ఈ పార్టీలు వేర్వేరుగా నిరసన ర్యాలీలు నిర్వహించాయి. ఆగస్టు 5 భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ముఫ్తి ధ్వజమెత్తారు.

తక్షణం ఎన్నికలు పెట్టండి: కాంగ్రెస్

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిర్దేశించిన సమయంలోపు జమ్మూ, కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తమను పాలించే వారిని ఎన్నుకునే అవకాశం కశ్మీర్ ప్రజలకు కల్పించాలని, తద్వారా కొన్నేళ్లుగా కొనసాగుతున్న అధికారుల పాలనకు ముగింపు పలకాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 30 లోపు జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని గత ఏడాది డిసెంబరులో సుప్రీం కోర్టు ఆదేశించింది.

లవ్ జిహాద్‌పై
ఇక కఠిన వైఖరి

- జీవిత ఖైదు విధించేలా చట్టం
- అస్సాం సీఎం హిమాంత



గువాహటి, ఆగస్టు 5: లవ్ జిహాద్‌కు పాల్పడితే జీవిత ఖైదు శిక్ష విధించేలా చట్టాన్ని తీసుకొస్తామని అస్సాం సీఎం హిమాంత బిశ్వశర్మ వెల్లడించారు. లవ్ జిహాద్‌ను అరికట్టడానికి చట్టాన్ని రూపొందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని, దాన్ని ప్రస్తుతం అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయమై నూతన నివాస విధానాన్ని అమలు చేస్తామన్నారు. దీని ప్రకారం స్థానిక జాతులకే ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. హిందువులు-ముస్లింల మధ్య జరిగే భూ క్రయ విక్రయాలపైనా ఆంక్షలు విధించనున్నట్టు బిశ్వశర్మ వెల్లడించారు. ఇలాంటి క్రయవిక్రయాలకు ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరిగా ఉండేలా నిబంధన రూపొందిస్తామని, స్థానికుల హక్కులను కాపాడేందుకే ఈ నిర్ణయమని చెప్పారు.

వయనాడ్ 'సూపర్ హీరో' మిస్సింగ్!

- బాధితులను కాపాడేందుకెళ్లి కనిపించకుండాపోయిన ప్రజీశ్



వయనాడ్‌లో సహాయ బృందాలకు డ్రోన్ల ద్వారా ఆహారాన్ని చేరవేస్తున్న దృశ్యం

వయనాడ్, ఆగస్టు 5: ప్రకృతి సృష్టించిన విలయానికి కేరళలోని వయనాడ్ అతలాకుతలమైంది. ఈ పరిస్థితుల్లోనే కొందరు యువకులు తమ ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారిలో ప్రజీశ్ ఒకరు. ముండక్కైలో కొండచరియలు విరిగిపడ్డాయని తెలియడంతో ప్రజీశ్.. తన జీపుతో రెండు సార్లు అక్కడికెళ్లి పలువురిని కాపాడి తీసుకొచ్చాడు. ఆ తర్వాత తన కుటుంబంతో సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న సమయంలో మరోసారి అతడికి ఫోన్ వచ్చింది. సాయం కోసం ముండక్కైకి తన జీప్‌లో మరోసారి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. చురాల్‌మల్ ప్రాంతంలోనే ఓ చోట ధ్వంసమైన అతడి జీపు కనిపించింది. ప్రజీశ్ ఆచూకీ తెలియరాలేదని స్థానికులు చెబుతున్నారు. 'ఎవరికే సాయం కావాలన్నా ప్రజీశ్ ముందుండే వాడు. కొందరినైనా కాపాడాలంటూ ఆరోజు వెళ్లాడు. అతడే మా సూపర్ హీరో' అని స్థానికులు కన్నీళ్లు పెట్టుకున్నారు. కాగా, వయనాడ్ విపత్తు మృతుల సంఖ్య 222కు చేరినట్లు కేరళ ప్రభుత్వం వెల్లడించింది.

చెరువులు నిండేదెప్పుడో?

- రాష్ట్రంలో 34,716 చెరువులు.. 15,131 చెరువుల్లో 25 శాతంలోపే నీటి నిల్వలు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షాలు నిరాశాజనకంగా ఉండటంతో చెరువులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఓవైపు కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లన్నీ పూర్తి స్థాయిలో నిండి జలకళను సంతరించుకోగా.. మరోవైపు గోదావరి బేసిన్‌లో రాష్ట్రంలో సాగునీరు అందించే ప్రాజెక్టుల మాదిరిగానే చెరువుల్లో నీటి నిల్వలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 34,716 చెరువులు ఉండగా వీటిలో 15,131 చెరువుల్లో 25శాతంలోపే నిల్వలున్నాయి. 6,165 చెరువుల్లో 25శాతం నుంచి 50శాతంలోపు, 3,438 చెరువుల్లో 50శాతం నుంచి 75శాతంలోపు, 6,735 చెరువుల్లో 75శాతం నుంచి 100శాతంలోపు నిల్వలున్నాయి. అయితే 3,247 చెరువులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. ములుగు చీఫ్ ఇంజనీర్ (సీఈ) పరిధిలో 2,145 చెరువులు ఉండగా.. వీటిలో 1,012 చెరువులు అలుగు దూకుతున్నాయి. రామగుండం సీఈ పరిధిలోని 1,210 చెరువుల్లో 504 అలుగులు దూకుతుండగా... మరో 698 చెరువుల్లో 75శాతం నుంచి 100శాతంలోపు నిల్వలున్నాయి. కొత్తగూడెం సీఈ పరిధిలో 2,144 చెరువులు ఉండగా.. వాటిలో 75శాతం నుంచి 100 శాతంలోపు నిండిన చెరువులు 1,563 ఉన్నాయి. 341 చెరువులు అలుగులు పారుతున్నాయి. మంచిర్యాల సీఈ పరిధిలో 1,150 చెరువులు ఉండగా.. అందులో 908 చెరువుల్లో 75శాతం నుంచి 100 శాతం దాకా నిల్వలు ఉండగా... 227 చెరువులు అలుగులు దూకుతున్నాయి.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి.. నిందితులపై హత్యాయత్నం సెక్షన్ సబబే

- ఏపీ హైకోర్టు స్పష్టీకరణ.. నలుగురు నిందితులకు బెయిల్

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడి ఘటనలో నిందితులపై హత్యాయత్నం, తదితర సెక్షన్లు చేర్చడాన్ని హైకోర్టు సమర్థించింది. దర్యాప్తు అధికారి చర్య సహేతుకమైనదేనని అభిప్రాయపడింది. దాడి ఘటన పూర్తి వివరాలు ఎఫ్ఐఆర్‌లోనే ఉన్నాయని, దాని ఆధారంగా ఐపీసీ సెక్షన్లు 307 (హత్యాయత్నం), 326 (ప్రమాదకర ఆయుధాలతో తీవ్రంగా గాయపరచడం) వంటివి చేర్చకపోవడం దర్యాప్తు అధికారి అసమర్థతగా పేర్కొంది. కేసు ప్రాథమిక దశలో విస్మరించిన వివరాలను తర్వాతి దశలో సరిచేయడం తప్పేమీ కాదని తెలిపింది. అదనపు సెక్షన్లు చేర్చేముందు మేజిస్ట్రేట్‌కు తెలియపరచాలని చట్టనిబంధనల్లో నిర్దేశించలేదని తెలిపింది. ఐపీసీ 307, 326 సెక్షన్లను చేరుస్తూ దర్యాప్తు అధికారి వేసిన మెమోను తిరస్కరించాలని నలుగురు నిందితుల తరఫు న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అయితే ఆ నలుగురికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో గుంటూరుకు చెందిన అచ్చల వెంకటరెడ్డి, బత్తుల దేవానంద్, షేక్ ఖాజా మొహిద్దీన్, షేక్ మస్తాన్‌వలీలను పోలీసులు అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వీరికి జూలై 3న మేజిస్ట్రేట్ జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ట్రయల్ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో వీరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి సోమవారం నిర్ణయాన్ని వెల్లడించారు. కాగా, మరోవైపు.. ఇదే దాడి కేసులో వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మరికొందరు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

సీఎంగా ఉన్నప్పటి భద్రత ఇవ్వండి

- హైకోర్టులో వైఎస్ జగన్ పిటిషన్

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించాలని.. ఈ మేరకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తనకు పర్సనల్ సెక్యూరిటీ అధికారులు(పీఎస్‌వోలు), కౌంటర్ అసాల్ట్ టీములు, జామర్‌ను ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి హోదాలో కేంద్ర ప్రభుత్వం తనకు కల్పించిన జడ్ ప్లస్ సెక్యూరిటీని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తగ్గించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, నిఘా విభాగం ఐజీ, గుంటూరు ఎస్పీ, రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ రివ్యూ కమిటీని తన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు. 'నా ఇల్లు, కార్యాలయం వద్ద భద్రతను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం నాకు ఇద్దరు పీఎస్‌వోలు మాత్రమే ఉన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలకు నాకంటే ఎక్కువ మంది పీఎస్‌వోలను ఇచ్చారు. పోలీసులు నాకిచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా ప్రయాణానికి అనుకూలంగా లేదు. అందులో ఏసీ పనిచేయడం లేదు. ఈ కారణంగా ఇటీవల ఓ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకోవలసి వచ్చింది. నన్ను భౌతికంగా లేకుండా చేస్తామని అధికార కూటమి నేతలు ప్రకటనలు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కోర్టు ముందు ఉంచుతున్నాను. సీఎం హోదాలో నాకున్న జడ్ ప్లస్ భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జూన్ 7న కేంద్ర హోం శాఖకు వినతి సమర్పించాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని జూన్ 3 వరకు నాకున్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వండి' అని జగన్ పిటిషన్‌లో కోరారు.

బడుల్లో బాత్‌రూమ్‌ల ఫొటోలకు ఫుల్‌స్టాప్

- యాప్‌ను తొలగించిన ఏపీ ప్రభుత్వం

గత ప్రభుత్వం వివాదాస్పద రీతిలో ప్రవేశపెట్టిన బాత్‌రూమ్‌ల ఫొటోల యాప్‌కు ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. టీచర్లు బడుల్లో బాత్‌రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసే యాప్‌ను పాఠశాల విద్యాశాఖ తొలగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. దీంతో టీచర్లకు బాత్‌రూమ్ ఫొటోల విషయంలో విముక్తి లభించినట్లైంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. యాప్‌ను తొలగించినందుకు ఏపీటీఎఫ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.

ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, ఐదుగురు కానిస్టేబుళ్లపై వేటు.. దళిత మహిళపై థర్డ్ డిగ్రీ కేసులో చర్య

- ఆస్పత్రిలో బాధితురాలికి నేతల పరామర్శ

షాద్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దొంగతనం ఆరోపణతో దళిత మహిళను చిత్రహింసలకు గురి చేసిన ఘటనలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురిని సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి.. కానిస్టేబుళ్లు మోహన్‌లాల్, అఖిల, జకీర్, కరుణాకర్, రాజును సస్పెండ్ చేశారు. జూలై 24న షాద్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న దళిత మహిళ సునీతను పోలీసులు అరెస్టుచేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న వార్త వైరల్ అయింది. దీనిపై సోమవారం బీఆర్ఎస్, బీజేపీ, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు ఆందోళనలు చేశారు. ఘటనపై డీజీపీ జితేందర్ ఆరా తీశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి అండ చూసుకునే పోలీసులు రెచ్చిపోతున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. గతంలో తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీ పోలీస్ ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. షాద్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతను సబితారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, పార్టీ నేతలు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, మంద జగన్నాథం తదితరులు పరామర్శించారు. అనంతరం సబిత మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండబోదని, కేవలం లాఠీ పోలీస్ పద్ధతే ఉంటుందని రేవంత్ చెప్పిన మాటలను షాద్‌నగర్ పోలీసులు నిజం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లోనే లైంగిక దాడులు, హత్యలు, పోలీసు దాడులు పెరిగి పోయాయని చెప్పారు. రాత్రి 8 గంటలకు మహిళను పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఆమెపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం నేరమని ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బాధితురాలికి రూ.కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి తక్షణ సాయంగా సునీత కుటుంబానికి రూ.లక్ష అందజేశారు. కాగా, 'మేమూ దళితులమే. చోరీ విషయంలో మేము పెట్టిన కేసును నీరుగార్చేందుకే సునీత కుటుంబం థర్డ్ డిగ్రీ డ్రామాలాడుతోంది' అని ఫిర్యాదుదారు నాగేందర్, ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.


బాధితురాలిని పరామర్శిస్తున్న సబితారెడ్డి, ప్రవీణ్ కుమార్, తదితరులు

దళిత మహిళపై ఇంత దాష్టీకమా?: కేటీఆర్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళపై పోలీసుల దాడిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. "దళిత మహిళపై ఇంత దాష్టీకమా? కాంగ్రెస్ నేతలు చెప్పే ఇందిరమ్మ పాలన ఇదేనా?"అని ప్రశ్నించారు. యథా రాజా.. తథా ప్రజా.. అన్నట్లుగా ముఖ్యమంత్రే స్వయంగా ఆడబిడ్డలను అవమానిస్తుంటే, పోలీసులు అదే బాటలో నడుస్తూ.. వారిపై దాడులు చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆరోపించారు. మహిళలంటే ఈ ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు అని ప్రశ్నించారు. మహిళపై దాడి చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని 'ఎక్స్'లో కేటీఆర్ ఆరోపించారు.

50లక్షలు కాజేసి.. 22 ఏళ్లుగా తప్పించుకొని..

పనిచేస్తున్న బ్యాంకుకే టోపీ పెట్టిన కంప్యూటర్ ఆపరేటర్.. వేషం, పేర్లు, ఊర్లు మారుస్తూ పోలీసులకు బురిడీ

- చివరికి స్వామీజీ అవతారం..
- రూ.7లక్షలతో శ్రీలంక పరారీకి ప్లాన్.. తమిళనాడులో అరెస్టు

హైదరాబాద్, న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న బ్యాంకుకే రూ.50 లక్షల మేర టోపీ పెట్టాడా ఉద్యోగి. ఇది జరిగి ఏకంగా 22 ఏళ్లయింది. సీబీఐ నుంచి తప్పించుకొనేందుకు ఎప్పటికప్పుడు వేషం మార్చేయడం.. ఉన్న ఊరు నుంచి మరో ఊరు.. వెళతూ చివరికి ఓ స్వామీజీ అవతారమెత్తి.. ఓ ఆశ్రమం తెరిచి.. భక్తుల నుంచి దండిగానే దోచుకున్నాడు. ఆ రూ.7 లక్షల డబ్బుతో సముద్రమార్గం మీదుగా శ్రీలంకకు ఉడాయించే ప్రణాళికలో ఉండగా సీబీఐ అధికారులకు దొరికిపోయాడు!: 2002లో నేరం చేస్తే.. ఇప్పటికి దొరికిన ఆ నిందితుడి పేరు వి. చలపతిరావు. హైదరాబాద్‌లోని చందులాల్ బరాదరి ఎస్బీఐ బ్రాంచ్‌లో చలపతి రావు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. 2002లో నకిలీ పత్రాలు సృష్టించి పనిచేస్తున్న బ్యాంకులో రూ. 50 లక్షలు కాజేశాడు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు సీబీఐ అధికారులు అదే ఏడాది మే 1న కేసు నమోదు చేశారు. రెండు చార్జిషీట్లు దాఖలు చేశారు. తర్వాత తన భర్త కనిపించకుండా పోయి ఏడేళ్లయిందని, ఫలితంగా చనిపోయినట్లు ప్రకటించాలని కోరుతూ నిందితుడి భార్య సివిల్ కోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం కోర్టు ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ దర్యాప్తు ముమ్మరం కావడంతో హైదరాబాద్ నుంచి పరారైన చలపతి ఆ తర్వాత పేర్లు, చిరునామాలు, ఆధార్ కార్డులు మారుస్తూ తిరిగాడు. 2007లో వినీత్ కుమార్‌గా పేరు మార్చుకుని తమిళనాడు సేలంలో మరో వివాహం చేసుకున్నాడు. అరెస్ట్ చేసేందుకు సీబీఐ సిద్ధం కాగా అక్కడి నుంచి పరారయ్యాడు. భోపాల్ చేరుకుని లోన్ రికవరీ ఏజెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్ మకాం మార్చాడు. తర్వాత మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లోని వెరుల్ గ్రామంలో ఉన్న ఆశ్రమంలో స్వామి విధిత్మానంద తీర్థగా అవతారమెత్తాడు. ఆ ఆశ్రమం నుంచి వెళ్లే సమయంలో శిష్యురాలిని వెంటబెట్టుకుని వెళ్లాడు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు వెళ్లి 2024 జూలై 8వ తేదీ వరకు అక్కడే ఉన్నాడు. తర్వాత తమిళనాడు తిరునల్వేలిలోని నర్సింగనుల్ల గ్రామం చేరుకున్నాడు. శ్రీలంక వెళ్లే ప్రయత్నాల్లో ఉండగా సమాచారంతో సీబీఐ అధికారులు ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

బంగ్లా పయనం ఎటు?

బంగ్లాదేశ్‌లో పరిణామాలు ఇంతవేగంగా మారిపోతాయని, ముగింపు ఇలా ఉంటుందని ఎవరూ ఊహించలేదు. ఆమె తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రహ్మాన్ యాభైయేళ్ళక్రితం స్వదేశంలో హత్యకు గురైన విషయాన్ని గుర్తుచేసుకుంటే, హసీనా ఆమేరకు అదృష్టవంతురాలే. పదిహేను సంవత్సరాలు దేశాన్ని నిరవధికంగా, ఓ నియంతలాగా ఏలిన ఆమె ఇక తనకు పదవి కంటే ప్రాణం ముఖ్యమని తేల్చుకోవాల్సి వచ్చింది. హడావుడిగా దేశం నుంచి నిష్క్రమించాల్సివచ్చింది. రాజీనామా చేసిన గంటలోగా అప్పటికే పెట్టాబేడాతో సిద్ధంగా ఉన్న హెలికాప్టర్ ఎక్కి దేశ సరిహద్దులు దాటిపోయారామె.

గత మూడువారాలుగా బంగ్లాదేశ్ తీవ్ర హింసాకాండ చవిచూసింది. భద్రతాబలగాలు, అధికారపార్టీ కార్యకర్తలు కలసికట్టుగా యువకులమీద సాగించిన అకృత్యాలు, మూడువందలమందిని నడిరోడ్డుమీద కాల్చిచంపేసిన దారుణాలు ఆమెకు ఎంతో చెడ్డపేరు తెచ్చాయి. స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ముప్పైశాతం మేరకు రిజర్వేషన్లు కల్పించిన అంశం ఈ మొత్తం ఉపద్రవానికి తక్షణ కారణం. తన తండ్రి హయాంలో ఆరంభమైన ఆ రిజర్వేషన్లు అనంతరకాలంలో ఎన్నో మలుపులు తిరిగి, తప్పుదోవలుపట్టి, కొంతమేరకు బలహీనపడినప్పటికీ, వీటి విషయంలో యువతరంతో ఆమె ఏ స్థాయిలో యుద్ధం చేశారో తెలియంది కాదు. హైకోర్టు తీర్పుతో తిరిగిరగిలిన ఆ చిచ్చు సుప్రీంకోర్టు ఆదేశాలతో నిజానికి చల్లారాలి. కానీ, అందుకు భిన్నంగా హసీనా గద్దెదిగాలన్న లక్ష్యంతో, దిగేంతవరకూ ఆగకుండా సాగడం విశేషం. కోటా వ్యతిరేక ఉద్యమం వెనుక విపక్ష బీఎన్పీ, ఇస్లామిస్ట్ శక్తుల రాజకీయ కుట్ర ఉన్నదని ఆమె ఆరోపణ. హైకోర్టు తీర్పు వెనుక ఆమె పాత్ర ఉన్నదని అనుకున్నప్పటికీ, ఆ తీర్పును రద్దుపరచి కోటాలన్నింటినీ బాగా కుదించడం ద్వారా సుప్రీంకోర్టు అటు ఉద్యమకారులకు, ఇటు హసీనాకు కూడా న్యాయం చేసింది. కానీ, ఆ తీర్పు అమలుజరిగే వరకూ పోరాడుతూనే ఉంటామని, హసీనా క్షమాపణ చెప్పాలనీ, మృతులకు న్యాయం చేయాలనీ, చివరకు ఆమె దిగిపోవాలనీ ఇలా ఎప్పటికప్పుడు కొత్త డిమాండ్లతో ఆ ఉద్యమం కొనసాగడం విచిత్రం. సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఆమె ఏకంగా దేశంలో అతిపెద్ద మతపార్టీ జమాత్-ఎ-ఇస్లామీ మీద నిషేధం విధించడానికి సిద్ధపడటం పరిస్థితులను మరింత దిగజార్చింది.

హసీనా లేని బంగ్లాదేశ్‌తో భారత్ ఇకపై చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇస్లామిస్టులను సంతృప్తిపరచడం కోసం హసీనా తనను దేశంనుంచి గెంటేశారని, ఇప్పుడు ఆ ఇస్లామిస్టులే హసీనాను దేశం నుంచి గెంటేశారని ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ ఓ వ్యాఖ్య చేశారు. అధికారంలోకి వచ్చిన సైన్యం ఎలా వ్యవహరిస్తుందో, విపక్ష బీఎన్పీ, జమాత్-ఎ-ఇస్లామీ ఏమేరకు చక్రం తిప్పుతాయో చూడాలి. మిగతా ఇస్లామిక్ పార్టీలూ కలసి ఈ రెండూ, ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా సైన్యం కృషి చేస్తుందని వార్తలు వస్తున్నాయి. ఇలా జరిగినా, జరగకపోయినా భారతదేశం ఇకపై గతంలో మాదిరిగా ప్రశాంతంగా ఉండలేదు. మతఛాందసశక్తులను నియంత్రణలో ఉంచుతూ, అటువంటివారినుంచి మనకు ముప్పులేకుండా హసీనా ఇంతకాలమూ చూసుకున్నారు. గత పదిహేనేళ్ళుగా మనం ఎంత ప్రశాంతంగా ఉన్నామన్నది 2001–2006 మధ్యకాలంలో మనం ఎదుర్కొన్న సమస్యలను బట్టి అర్థంచేసుకోవచ్చు. బీఎన్పీ-జమాతే కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగిన ఆ ఐదేళ్ళలో అనేక ఇస్లామిక్ సంస్థలు పురుడుపోసుకున్నాయి, పాకిస్థాన్ పోషించిన ఉగ్రవాద సంస్థలు మనదేశంలో విధ్వంసకాండకు పాల్పడ్డాయి. హసీనా అధికారంలోకి రాగానే ఇటువంటి శక్తులను ఏరివేశారు, ఉరితీశారు. ఇప్పుడు గతంలో మాదిరిగా బీఎన్పీ-జమాతే కూటమి అధికారంలోకి వస్తే అవే పరిణామాలు మనం చూడాల్సిరావచ్చు. బంగ్లాదేశ్‌లోని వేలాదిమంది హిందువుల భవితవ్యం ఎలా ఉండబోతున్నదో ఇప్పటికే కొన్ని సంఘటనలు తెలియచెబుతున్నాయి.

హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో చాలా శక్తులు ఏకమైనాయి. ఈ సంక్షోభం వెనుక పాకిస్థాన్, చైనాలున్నాయన్న విశ్లేషణలను అటుంచితే, అమెరికా కూడా తనవంతుగా ఓ చేయివేసిందన్నది నిజం. బైడెన్ ప్రభుత్వం విలన్ పాత్ర కాకున్నా, ఒక బలమైన విపక్షపాత్ర పోషిస్తుంటే, హసీనాను నిలబెట్టడానికి మనం చేయవలసినంత చేయలేదన్న విమర్శలు కూడా ఈ సందర్భంలో రావడం సహజం.



నిరంతర విప్లవకారుడు

కళాసాహిత్యాలు, సంస్కృతి స్వయంభూలు కావు. అవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఉత్పత్తులని మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం అంటుంది. పాట, కవిత, నాటకం, నవల, కథ, ఇతర కళాప్రక్రియలన్నీ ఆయా సమాజాల నిర్దిష్ట భౌతికత లేదా అనిర్దిష్ట భౌతికత ఉత్పత్తులే. కళాసాహిత్యాల, సంస్కృతిని ఉత్పత్తి, పంపిణీ కోణం నుంచి చూడటం ఒక చారిత్రక దృక్పథం. ఉత్పత్తి, పునాది, ఉపరితలం అనే వర్గీకరణ అవసరమనీ, అలాగే అసహజమైన కేంద్రం, దాని అంచు (పెరిఫెరీ) అనే వర్గీకరణ కూడా సంస్కృతి అనే విశాల భావనలోకి వస్తాయని మార్క్సిస్టు సాహితీ సిద్ధాంత విమర్శకుడు రేమాండ్ విలియమ్స్ అంటాడు. గద్దర్ కళాసాహిత్యాలను, గద్దర్ సృష్టించిన సాంస్కృతిక సంపదను పునరాలోకన చేయడానికి రేమాండ్ విలియమ్స్ విమర్శా మార్గం దోహదం చేస్తుంది.

కళలు, పాటలు, సృజనాత్మక రచనా ప్రక్రియలన్నీ సమాజ ఉత్పత్తులనీ, అవి సమిష్టి ఉత్పత్తులని గద్దర్ అంటాడు. తన పాటల నేపథ్యాన్ని ఈ కోణం నుంచే ఆయన వివరించాడు. ప్రజలే కళల్ని నిర్మిస్తారని చెప్పాడు. వాటిని పెట్టుబడిదారీ వ్యవస్థ, అది ఉత్పత్తిచేసే దోపిడీ సంస్కృతి పరాయీకరిస్తాయని గద్దర్ అంటాడు. అయితే, భూస్వామ్య, పెట్టుబడిదారీ సమాజాలు ఉత్పత్తిచేసే కళాసాహిత్య సంస్కృతులను విప్లవీకరించాలంటాడు. క్యాపిటలిస్టు దేశాలలోని జనపదాలలో కూడా వర్గ స్పృహ వుంటుంది. మన సమాజంలోని జనపదాలలో వర్గ, కుల స్పృహ రెండూ కనిపిస్తాయి. అయితే, వాటిలో పీడిత వర్గాల పట్ల అవహేళన, వివక్ష, పాలక వర్గాల పట్ల ఆరాధన వంటివి కూడా కనిపిస్తాయి. అసమానతలు తొలిగిపోవాలన్న చైతన్యం కొరవడటం వల్ల ఈ వాసనలు వుంటాయి. పాలక వర్గాల భావాలే ప్రజల భావాలుగా చలామణి అవుతూ, దోపిడీని జనరలైజ్ చేస్తాయి. ఆ పాలక వర్గాల భావాల నుంచి ప్రజలను విముక్తి చేయటమే నా కర్తవ్యమనీ, అందుకే పాటలను విప్లవీకరించే పనిని స్వీకరించానని గద్దర్ స్పష్టం చేశాడు. ఆధిపత్య కళా సాహిత్యాలే ప్రజా జీవితంలో కేంద్ర స్థానం ఆక్రమించాయి. శ్రామిక వర్గ, పీడిత కుల కళాసాహిత్యాలు జానపదాలుగా పెరిఫెరీకి నెట్టేయబడ్డాయి. గద్దర్ విశిష్టత ఇక్కడే వుంది. జానపదాలను విప్లవపాటలుగా మార్చి, వాటిని జనజీవనంలో కేంద్రస్థానంగా మార్చేశాడు గద్దర్. నిజానికి గద్దర్‌కు అంతా సంస్కృతే. ఆర్థికం మాత్రమే కేంద్రం, మిగతావన్నీ ఉపరితలాలనే భావనపట్ల నిర్దిష్టమైన స్పష్టత ఆయనకు లేనప్పటికీ, కేంద్రం అనేది ఆధిపత్య భావననీ, అదెక్కడున్నా సరే, దాన్ని ధ్వంసం చేయాలని చూశాడు. అందుకే, ఆయన పాటలు, ఆయన జీవితంలో అనిర్వచనీయమైన విస్తృతి, వైవిధ్యం కనిపిస్తాయి. విస్తృత అంశాలను కావ్యవస్తువును చేశాడు. అలాగే, కులం, ప్రాంతం, మతం, భాష, లింగం ఇత్యాదివి ఆధిపత్య కేంద్రాలుగా మారినప్పుడు, వాటికి వ్యతిరేకగా తన

గద్దర్ సాహిత్యమూ జీవితమూ విడదీయలేనివి. ఆయన కళాసాహిత్యాలను కేవలం సౌందర్యశాస్త్ర కోణం నుంచో లేదా అలంకార శాస్త్రాల అకడమిక్ దృక్పథం నుంచో వివేచించలేము. గద్దర్‌ది విశాలమైన కాన్వాసు. ఆయన తాత్త్వికత నిశ్చలమైనది కాదు. నిరంతర చింతనతో, తత్త్వశాస్త్ర సరిహద్దులను విస్తరించుకుంటూ పోయాడు. గద్దర్ యుగకర్త మాత్రమే కాదు, రాబోవు యుగాలకు కూడా ముందున్న విప్లవకారుడు.

పాటను, ప్రదర్శనను ఎక్కుపెట్టాడు. సమాజంలో భావ విప్లవం, సాంస్కృతిక విప్లవం రెండూ నిరంతరం కొనసాగాలని గద్దర్ సూచించాడు. కేవలం సాయుధ విప్లవం ఒంటరిగా విజయవంతం కాదని గద్దర్ అభిప్రాయం. మార్క్సు లెనిన్ మావోలతోపాటు పూలే అంబేద్కర్‌ల తాత్త్విక చింతనను కమ్యూనిస్టు పార్టీలు స్వీకరించాలని ఆయన సూచించాడు. అంతేకాదు, ప్రజాస్వామిక దశలో ప్రాంతీయ ఉద్యమాలు కూడా కీలకమైనవని, వాటికి ప్రజలే నాయకత్వం వహించాలని గద్దర్ ఆలోచించాడు. తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఉద్యమానికి ఆయన దిక్సూచి. తెలంగాణ ఉద్యమాన్ని ఆంధ్ర కేంద్ర పాలనకు వ్యతిరేకంగా నడిపినందుకే గద్దర్ మీద కాల్పులను రాజ్యం జరిపింది. ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పడాలనే ఉద్యమ ఆశయం నెరవేరకుండానే భౌగోళిక తెలంగాణ ఆవిర్భవించింది. ఆ కారణంగా తెలంగాణ ప్రజల జీవితంలో ఏ మార్పూ రాలేదు. ప్రజల వాంఛ నెరవేరలేదు. దొరల వాంఛ నేరవేరలేదనేది ఆయన అభిప్రాయం. ప్రజాస్వామిక ఉద్యమాలకు పాలక వర్గాలు నాయకత్వం వహించినప్పటికీ, ప్రజలు ఆ నాయకత్వాన్ని ఆమోదించటం వల్ల ఆయా ఉద్యమాల ఆశయాలు నెరవేరవు. తెలంగాణ ఉద్యమం ఒక ప్రజాస్వామిక ఉద్యమమే అయినప్పటికీ, ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేరలేదు. అందుకే పాట మహాశక్తిగా మారాలి. అంటే పాట సామాన్య ప్రజలను, పీడిత వర్గ ప్రజలను మహాశక్తిమంతులుగా మార్చాలని అర్థం. అప్పుడే ఆశించిన మార్పు వస్తుందనే అవగాహన గద్దర్‌కు ఉంది. తెలంగాణ అనంతరం ఒక దశాబ్దం పాటు నిశ్శబ్ద విప్లవం నివురు కప్పిననిప్పులా వుంది. అది సరైన నాయకత్వం రాగానే బహిర్గతమవుతుందని గద్దర్ ఆశించాడు. తెలంగాణ బచావో ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. అయితే, పాలకులు మారినంత మాత్రాన తెలంగాణ ప్రజాస్వామిక ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయని అనుకోలేము. గత ఆర్నెళ్లుగా ఈ సత్యాన్ని గమనిస్తూనే వున్నాము. పాలక వర్గం స్థానంలో పీడిత వర్గం అధికారం అధిరోహించకుండా అంతరాలు తొలిగిపోవు. రాజ్యాధికారం పీడిత వర్గాలకు దక్కకుండా గద్దర్ ఆశించిన సమాజ నిర్మాణం సాధ్యం కాదు. అందుకే వర్గ కేంద్ర భావనను ఆయన సవరించి ఇది కుల కేంద్ర సమాజమని తన పాటలతో అర్థం చేయించాడు. ఊరు, వాడ రెండూ ప్రజాస్వామికం కావాలంటే రెండూ స్వయంపాలనా వ్యవస్థలుగా అభివృద్ధి చెందాలని దళిత పంచాయతీ ఉద్యమానికి ఆయన సంఘీభావం తెలిపాడు. తెలంగాణ ధూంధాం నిర్మాణం చేసిన గద్దరే, బహుజన ధూంధాం సభలకు ముఖ్యఅతిథిగా హాజరై 'బానిసలారా లెండిరా' అని పిలుపునిచ్చాడు. ఓటు కూడా విప్లవ రూపమని భావించిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని గద్దర్ అనేక సభలలో నొక్కి చెప్పాడు.

గద్దర్ సాహిత్యమూ జీవితమూ విడదీయలేనివి. గద్దర్ కళాసాహిత్యాలను కేవలం సౌందర్యశాస్త్ర కోణం నుంచో లేదా అలంకార శాస్త్రాల అకడమిక్ దృక్పథం నుంచో వివేచించలేము. ఆయనది విశాలమైన కాన్వాసు. ఆయన తాత్త్వికత నిశ్చలమైనది కాదు. ఆయన నిరంతర చింతన, తత్త్వశాస్త్ర సరిహద్దులను నిరంతరం విస్తరించుకుంటూ పోయాడు. అందుకే, గద్దర్ యుగకర్త మాత్రమే కాదు, రాబోవు యుగాలకు కూడా ముందున్న విప్లవకారుడు.


● శ్రీనివాస్ దక్షిణ్

(నేడు గద్దర్ ప్రథమ వర్ధంతి)

కోటా తీర్పులో క్రీమీలేయర్ తంటా!

సామాజిక అసమానతలను రూపుమాపే ఒక ప్రగతిశీల విధానాన్ని సుప్రీంకోర్టు స్వాగతించింది; సామాజిక న్యాయసాధన రాజకీయాలకు మద్దతు నిచ్చింది. శుభస్కరమైన, చాలా కాలంగా నిరీక్షించిన ఈ చర్య ద్వారా విద్యా ఉద్యోగాలలో షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), షెడ్యూల్డు తరగతుల (ఎస్టీ)కు ప్రస్తుతమున్న రిజర్వేషన్ల ఉప-వర్గీకరణకు శాసన సంబంధమైన ఆటంకాలను ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తొలగించింది. అయితే చర్చకు యోగ్యమైన రీతిలో, ఎస్సీలు, ఎస్టీలలోని సకల సామాజిక శ్రేణులు రిజర్వేషన్ల లబ్ధి పొందేందుకు వీలుగా 'క్రీమీ లేయర్' మినహాయింపునకు కూడా పచ్చ జెండా ఊపి ఉండవల్సింది. విశేష ప్రాముఖ్యత సంతరించుకోగల అటువంటి నిర్ణయం సహజంగానే ప్రశంసలు, విమర్శలకు పాత్రమయ్యేది. ఎస్సీ రిజర్వేషన్ల విభజన తీర్పుపై దళిత నాయకులు ప్రకాశ్ అంబేద్కర్, చంద్రశేఖర్ రావణ్ తదితరులులు ప్రశ్నలు లేవనెత్తగా షెడ్యూల్డు కులాలలో బాగా అట్టడుగున ఉన్న వాల్మీకి, మాదిగ మొదలైన దళిత సమూహాలు సుప్రీంకోర్టు తీర్పుపట్ల హర్షామోదాలు వ్యక్తం చేశాయి. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో మారిన న్యాయ సంబంధిత పరిస్థితికి ప్రతిస్పందనగా రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కొత్త విధానాలను రూపొందిస్తాయి, రాజకీయ పార్టీలు కొత్త రాజకీయాలను ఎలా సృష్టిస్తాయి అన్న దానిపైనే భవిష్యత్తు చాల వరకు ఆధారపడి ఉన్నది. అయితే 'ది స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దేవీందర్ సింగ్' కేసులో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వేషన్లపై భారతదేశ సమున్నత న్యాయశాస్త్ర ఆలోచనా స్రవంతి, శ్రేష్ఠమైన న్యాయ నిర్ణయాలలో ఒక ముందడుగు అని నిస్సంకోచంగా చెప్పవచ్చు. మొత్తం మీద 'అఫర్ మేటివ్ యాక్షన్' (నానా వివక్షల వల్ల రకరకాల ఇబ్బందులకు గురవుతూ తమకు దక్కాల్సిన ప్రయోజనాలను అందుకోలేకపోతున్న నిమ్న సామాజిక శ్రేణులకు జరుగుతున్న అన్యాయాల నిర్మూలనకై ప్రభుత్వం చేపట్టే సానుకూల వివక్ష లేదా ప్రగతిశీల పక్షపాత చర్య)పై ముమ్మర దాడి జరుగుతున్న ఈ రోజుల్లో సామాజిక న్యాయ రాజకీయాలలో చిన్న సర్దుబాట్లకు, విధానాలను విశాల పరిచేందుకు సుప్రీంకోర్టు తీర్పు తప్పక దోహదం చేస్తుంది.

అసంఖ్యాక దళితులు ఎంతో కాలంగా ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న న్యాయనిర్ణయమది. షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ విషయంలో తమ అధికారాల పరిమితుల నుంచి బయటపడేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు రెండు దశాబ్దాలుగా ఉన్నత న్యాయస్థానాలలో చేస్తున్న పోరాటాలను ఈ తీర్పు ఒక కొలిక్కి తీసుకువచ్చింది. అధికరణ 341 (షెడ్యూల్డు కులాల వారికి ప్రత్యేక నిబంధనలు– ఒక రాష్ట్రం లేక కేంద్ర పాలిత ప్రాంతంలో గల ఎటువంటి కులాలు, తెగలు, జాతులు, ఆయా కులాలు, జాతులు, తెగలలో గల గ్రూపులు సంబంధిత రాష్ట్రానికి సంబంధించి షెడ్యూల్డు కులాలుగా పరిగణింపబడతాయో రాష్ట్రపతి నిర్ధారించి అధికారకంగా నోటిఫై చేస్తారు) ప్రకారం ఒక నిర్దిష్ట రాష్ట్ర ఎస్సీలు దేశవ్యాప్తంగా ఎస్సీలుగా పరిగణింపబడడం సరైన విషయమేనా అన్నది ఒక వివాదాంశంగా ఉన్నది. ఎస్సీ రిజర్వేషన్లలో ఉప కోటాలను సృష్టించేందుకు ఉద్దేశించిన ఏ విధానమైనా సరే న్యాయవిరుద్ధమని 2004లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. ఇ.వి. చిన్నయ్య కేసుగా ప్రాచుర్యం పొందిన ఆ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం అధికరణ 341పై ఏకగ్రీవంగా ఒక అసాధారణ సాంకేతిక దృక్పథాన్ని అనుసరించింది. రాష్ట్రాల పరిధిలోని వివిధ సామాజిక వర్గాలలోని సకల శ్రేణులు ఒక 'హోమోజీనస్ క్లాస్' (ఒకే సామాజిక సమూహం) అని, కనుక దానిలో ఉప విభజనలు న్యాయవిరుద్ధమని నాటి ఆ ధర్మాసనం స్పష్టం చేసింది.



సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను అనుమతించిందే కాని, ఆ విభజనను అమలుపరచాలని రాష్ట్రాలను ఆదేశించలేదు. షెడ్యూల్డు కులాలలోని 'క్రీమీ లేయర్' అంటే సామాజికంగా అభివృద్ధి చెందినవారికి ఈ ఉప వర్గీకరణ నుంచి మినహాయింపు ఇవ్వాలని వాదిస్తున్నట్టుగా ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలు ఉన్నాయి. 'క్రీమీ లేయర్' నిబంధనను అమలుపరచని ఏ ఉప కోటా విధానాన్ని అయినా సవాల్ చేసేందుకు ఆ వ్యాఖ్యలను ఉపయోగించుకోవడానికి ఆస్కారం ఉంది.

ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులో ఒక లోపం ఉన్నది. సామాజిక వాస్తవికతతో పొందూ పోలిక లేని తీర్పు అది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు అనే వివిధ సామాజిక వర్గాలలో విభిన్న సంప్రదాయ వృత్తులు, వేర్వేరు ప్రతికూలతల ప్రాతిపదికన అనేక శ్రేణులవారు ఉన్న వాస్తవాన్ని ఆ అసంబద్ధ తీర్పు గుర్తించలేదు. చారిత్రకంగా ఆ అట్టడుగు సామాజిక శ్రేణులు ఆధునిక విద్యావకాశాలకు ఏ మాత్రం నోచుకోలేదు. తత్కారణంగా అవి అఫరమేటివ్ యాక్షన్ ప్రయోజనాలను పొందలేకపోతున్నాయి. తత్కారణంగా ఉన్నత స్థాయిలో ఉన్న ఎస్సీ కులాలు రిజర్వేషన్ల ప్రయోజనాలలో సింహభాగం పొందుతున్నాయి. ఆ వ్యత్యాసాలు చిన్నవేమీ కావు బిహార్‌లో ఎస్సీ వర్గంలోని విభిన్న కులాల మధ్య విద్యా స్థాయిలో అంతరాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో 2023లో ఆ రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన స్పష్టంగా వెల్లడించింది. ప్రతి 10,000 మందిలో 124 మంది రజకులు ఉన్నత విద్య డిగ్రీలు కలిగి ఉండగా దుసధ్ కులం వారిలో అటువంటి ఉన్నత విద్యావంతులు కేవలం 45 మంది మాత్రమే ఉన్నారు. ముసాహర్ కులానికి వస్తే ఒకే ఒక్క ఉన్నత విద్యావంతుడు ఉన్నాడు!

ఈ అసమానతలకు పరిష్కారమేమిటి? ఒక విస్తృత సామాజిక వర్గాన్ని రెండు, అంతకంటే ఎక్కువ ఉప వర్గాలుగా విభజించి ప్రతి ఉప వర్గానికి జనాభాలో వారి వాటా ప్రాతిపదికన ప్రత్యేక రిజర్వేషన్ కోటాను కేటాయించడమేనని లోకజ్ఞానం స్పష్టం చేస్తోంది. అనేక రాష్ట్రాలలో ఓబీసీల విషయంలో ఇలానే జరిగింది కదా. అయితే ఆ ప్రకారమే ఎస్సీ రిజర్వేషన్లను ఉప కులాల జనాభా ప్రాతిదికన విభజించేందుకు పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్ బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు (2004లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం) రాజ్యాంగ విరుద్ధమని ఉన్నత న్యాయస్థానాలు ప్రకటించాయి.

అంతిమంగా సుప్రీంకోర్టు 2004లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన తీర్పును అదే సర్వోన్నత న్యాయస్థానం ఏడుగురు సభ్యుల ధర్మాసనం అంతిమంగా ఈ నెల 1న 6–1 మెజారిటీతో రద్దు చేసింది. మెజారిటీ తీర్పును భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ స్వయంగా రాసిన మెజారిటీ తీర్పు ఉప వర్గీకరణకు ప్రాధాన్యమిచ్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ సమానత్వ సూత్రానికి ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. గమనార్హమైన విషయమేమిటంటే దేశ సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను అనుమతించిందే కాని, ఆ విభజనను అమలుపరచాలని రాష్ట్రాలను ఆదేశించలేదు. షెడ్యూల్డు కులాలు వేర్వేరు రాష్ట్రాలలో విభిన్న రీతుల్లో ఉన్నందున ఉప వర్గీకరణ ఎలా జరగాలన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే సుప్రీంకోర్టు వదిలివేసింది. ఈ తీర్పుతో ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులోని లాంఛనప్రాయ న్యాయపరాయణత్వం (లీగల్ ఫార్మలిజం)కు సుప్రీంకోర్టు ముగింపు పలికింది. షెడ్యూల్డు కులాలలోని బాగా వెనుకబడిన సమూహాల ఇక్కట్ల పట్ల సంవేదన శీలతను ప్రదర్శించింది. వారి చారిత్రక ఇబ్బందులను పరిష్కరించేందుకు మార్గాన్ని నిర్దేశించింది. సుప్రీంకోర్టు వైఖరిని కుల ప్రాతిపదిక రిజర్వేషన్‌కు దూరంగా వెళ్లినట్టుగా భావించకూడదు. ఒక పెద్ద మార్పుకు (అది సమస్యాత్మకమే కావచ్చు) ఒక ఆరంభమే, సందేహం లేదు. ఈ విషయంలో జస్టిస్ పంకజ్ మిథల్ వ్యాఖ్యలు సమర్థించ వీలులేనివే అయినప్పటికీ, 1992లో ఇంద్ర స్వాహ్నే కేసు తీర్పు నెలకొల్పిన నియమబద్ధ, కుల అంతరాల స్పృహతో కూడిన సానుకూల చర్యల విధానం ఆవశ్యకత విషయమై సామాజిక-న్యాయపరమైన ఏకాభిప్రాయాన్ని ప్రధాన తీర్పు దృఢతరం చేసిందని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఆ అనుకూలతకు మరింత ఆసరా నిచ్చి బాగా బలపరిచింది. తద్వారా ఒక విస్తృత, మరింత ప్రభావదాయక, యుక్తియుక్తమైన సానుకూల చర్యల విధానానికి బాధిత వర్గాలు చేస్తోన్న పోరాటాన్ని శక్తిమంతం చేసింది.

ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వెలువరించిన తీర్పులో ఒక ఆక్షేపణీయమైన విషయమున్నది. అది, షెడ్యూల్డు కులాలలోని 'క్రీమీ లేయర్' అంటే ఎస్సీలలో సామాజికంగా అభివృద్ధి చెందినవారికి లేదా సంపన్నులకు ఈ ఉప వర్గీకరణ నుంచి మినహాయింపు ఇవ్వాలని వాదిస్తున్నట్టుగా ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలు స్ఫురింపచేస్తున్నాయి. క్రీమీ లేయర్ నిబంధనను ఇప్పటివరకు ఎస్సీలు, ఎస్టీలకు కాకుండా కేవలం ఓబీసీలకు మాత్రమే వర్తింపచేస్తున్నారు. విచిత్రమైన విషయమేమిటంటే ఈ కేసు విచారణాంశాలలో క్రీమీ లేయర్ నిబంధన లేనే లేదు. అయినప్పటికీ న్యాయమూర్తులు ఆ విషయమై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'క్రీమీ లేయర్' మినహాయింపు అనేది సుప్రీంకోర్టు ఆదేశం కానేకాదు. అయితే 'క్రీమీ లేయర్' నిబంధనను అమలుపరచని ఏ ఉప కోటా విధానాన్ని అయినా సవాల్ చేసేందుకు నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలను ఉపయోగించుకోవడానికి ఆస్కారముందనే సహేతుక అనుమానం ఒకటి బాగా వ్యక్తమవుతోంది. ఓబీసీలకు వర్తింపచేస్తున్న 'క్రీమీ లేయర్' ప్రమాణాలను షెడ్యూల్డు కులాల విషయంలో ఎట్టి పరిస్థితులలోను పాటించకూడదని జస్టిస్ గవాయి స్పష్టం చేయడం సముచితంగా ఉన్నది. ఆ ప్రమాణాలను ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణలో దుర్వినియోగం చేసేందుకు ఎంతైనా అవకాశమున్నది. ఎందుకని? ఎలా? రిజర్వేషన్లను ఏమార్చడం ప్రభుత్వ సంస్థలు, విభాగాలకు చాలా పరిపాటిగా ఉన్నది. 'సరైన, అర్హుడైన అభ్యర్థి లభ్యం కాలేదన్న' మిషతో రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలివేయడం తరచు జరగడం లేదా? 'క్రీమీ లేయర్' నిబంధనను ప్రవేశపెట్టడం వల్ల యోగ్యులైన అభ్యర్థుల లభ్యత తగ్గిపోతుంది. అంతేకాకుండా ఆ రిజర్వ్‌డ్ పోస్టులను జనరల్ కేటగిరీకి బదలాయించే అవకాశమూ ఉన్నది. కనుక ఎస్సీ/ఎస్టీల విషయంలో 'క్రీమీ లేయర్'గా పరిగణించే ఆదాయ స్థాయి అత్యధిక స్థాయిలో నిర్ణయించడం చాలా చాలా ముఖ్యం. అంతేకాకుండా 'క్రీమీ లేయర్'గా పరిగణన పొందిన వారిని అనర్హులుగా ప్రకటించకుండా విద్యా ఉద్యోగాలలో ప్రవేశాలకు పరిశీలనార్హుల వరుసలో చివరి స్థానాలలో ఉంచాలి.

మరి ఎస్సీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణలను రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా చేయనున్నాయి అనేదే ఇప్పుడు అసలైన ప్రశ్న. దళితులలో చీలికలు తెచ్చి, తమకు అనుకూలంగా ఉన్న ఎస్సీ కులాల నుంచి రాజకీయ మద్దతు పొందేందుకు ఉప కోటాలను ఉపయోగించుకోవాలనే స్వార్థపరత్వంతో రాజకీయవేత్తలు తప్పక వ్యవహరిస్తారు. చరిత్ర చాటిన, చాటబోయే సత్యమిది. అయితే ఏ ఉప వర్గీకరణలు అయినా సరే వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే జరిగితీరాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిందన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. ఇందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలుపవలసి ఉన్నది. అయితే సమీప గతంలో లేదా వర్తమానంలో నిర్వహించిన సమగ్ర పరిశోధనల ఆధారంగా సేకరించిన సమాచారం ప్రాతిపదికన మాత్రమే సామాజిక న్యాయ విధానాలు ఉండి తీరాలన్న న్యాయబద్ధమైన షరతును, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యుఎస్) కోటాను ధ్రువీకరిస్తూ వెలువరించిన తీర్పులో దేశ సర్వోన్నత న్యాయస్థానం దాదాపుగా పాటించనేలేదు! ఏమైనా వాస్తవిక సమాచార ఆధారిత విధానం గురించిన పునరుద్ఘాటనతో దేశ వ్యాప్తంగా కులాల ప్రాతిపదికన జనాభా గణన ఆవశ్యకతను సుప్రీంకోర్టు బలపరిచింది.

○ యోగేంద్ర యాదవ్

○ ప్రణవ్ ధావన్

ఆ దొంగ మెచ్చిన కవి ఎవరు?

పేదరికాన్ని భరించలేక, దొంగగా మారిన సాహిత్యాభిమాని అతడు. ఇటీవల ముంబైలో ఒక ఇంటిలోకి చొరబడి తీసుకుపోదామనుకున్న ఎల్‌ఎస్‌డి టెలివిజన్‌ను తిరిగి యథాస్థానంలో పెట్టి అక్కడ మరాఠీలో ఒక సంజాయిషీ (నోట్) పెట్టాడు– "నాకు ఇది నారాయణ్ సుర్వే ఇల్లని తెలియదు. తెలిసుంటే ఇక్కడి నుంచి దొంగతనమే చేసేవాణ్ణి కాదు. నన్ను క్షమించండి. నేను దొంగిలించిన వాటిలో టీవీతో సహా కొన్ని వస్తువులు వదిలి వెళ్తున్నాను. క్షమించాలి." ఈ పశ్చాత్తాపానికి కారణం తాను సుప్రసిద్ధ కవి నారాయణ సుర్వే ఇంట్లో దొంగతనం చేసానని ఆ ఇంట్లోనే తెలియటమే– బహుశా ఈ సంఘటన ప్రజలు మళ్లీ నారాయణ సుర్వేను చదవడానికి పురికొల్పవచ్చు. మరాఠీ సాహిత్య చరిత్రలో కార్మిక వర్గ యోధునిగా శాశ్వత్వంగా గుర్తుండిపోయే కవి నారాయణ సుర్వే



నేను లోనా బయట చిరుగులతో పరుగెత్తుతున్నాను
నా రోజు రొట్టె నా నిత్యసందేహమే
నేనొక కార్మికుణ్ణి!
పోగుపడిన సాహితీసంపదను
మెరిసే కత్తితో ఛేదిస్తాను
'టాట్..' అని వణకకండి
మిస్టర్ సారస్వత్
నా పాపాలు అనుగ్రహించదగినవి

సుప్రసిద్ధ మరాఠీ కవి నారాయణ సుర్వే బహుళ ప్రచారంలో ఉన్న కవితల్లో ఇది ఒకరకంగా తన పరిచయ కవిత. ఆయన కవిత్వమంతా ప్రొలిటేరియట్ పోరాటాల గురించే, సుర్వే 2010లో చనిపోయాడు. ఆయన కూతురు, అల్లుడు నవి ముంబైలో ఉన్న ఆయన మధ్యతరగతి నివాసంలో ఉంటున్నారు. కూతురు సుజాత, అల్లుడు గణేష్‌ఘరే.. విరార్‌లో ఉన్న తమ కొడుకు దగ్గరికి వెళ్లి జూలై 14న ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఆయన ఇంట్లో దొంగతనం జరిగింది. కొన్ని వంటదినుసులు, వంట మసాలా పెట్టె, ఒక ఇత్తడి కందీలు, ఒక మేజాబల్ల, ఐదులీటర్ల వంటనూనె క్యాన్, స్నానాలగది నుంచి కొన్ని నల్లా పరికరాలతో పాటు ఒక ఎల్ఇడి టెలివిజన్ దొంగిలింపబడినవి. ఇల్లంతా చిందరవందరగా ఉన్నది. దొంగ స్నానాలగది కిటికీ అద్దం పగులగొట్టి కిటికీ ఊచలు వంచి లోపలికి ప్రవేశించాడు. సుర్వే కూతురు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో గానీ రిజిస్టర్ చేసిన ప్రాథమిక సమాచార రిపోర్టులో గానీ కొన్ని పోయిన వస్తువుల గురించే రాసింది గానీ "ప్రధానంగా ఉప్పు, బియ్యం, మసాలాలు, కొన్ని కిలోల రకరకాల పప్పులు వంటి వంటదినుసుల గురించి ప్రస్తావించలేదు." ఎందుకంటే మొదట తీసుకుపోదామనుకున్న ఎల్ఎస్‌డి టెలివిజన్ యథాస్థానంలో పెట్టి ఆ దొంగ అక్కడ మరాఠీలో ఒక సంజాయిషీ (నోట్) పెట్టాడు– "నాకు ఇది నారాయణ్ సుర్వే ఇల్లని తెలియదు. తెలిసుంటే ఇక్కడి నుంచి దొంగతనమే చేసేవాణ్ణి కాదు. నన్ను క్షమించండి. నేను దొంగిలించిన వాటిలో టీవీతో సహా కొన్ని వస్తువులు వదిలి వెళ్తున్నాను. క్షమించాలి."

సుర్వే కూతురు ఏమంటుందంటే, దొంగ తన క్షమాపణ పత్రంలో "మిగిలిన వస్తువులు కూడ తిరిగి ఇస్తానని వాగ్దానం చేసాడు" ఈ పశ్చాత్తాపానికి కారణం తాను సుప్రసిద్ధ రచయిత నారాయణ సుర్వే ఇంట్లో దొంగతనం చేసానని ఆ ఇంట్లోనే తెలియడమంటుంది. మేముండే గదిలో నారాయణ సుర్వే ఫోటోలు, ఆయనకొచ్చిన సత్కారాలు, పద్మశ్రీ ఫలకం... ఇవన్నీ చూసి ఆ దొంగ తన తప్పు గ్రహించి ఉంటాడంటుంది.

నారాయణ సుర్వే మరణానంతరం కూడ మహారాష్ట్రలో ఒక సాంస్కృతిక సంస్థగానే ప్రభావం చూపుతున్నాడు.

ఆయన శిశువుగా ఒక బట్టలమిల్లు కార్మికునికి బొంబాయిలో ఫుట్‌పాత్ మీద దొరికాడు. ఇంకా శిశువుగా ఉండగానే ఆ కార్మికుడు కూడ పోషించలేక వదిలిపెడితే తనకు తానే మహానగర వీథుల్లో ఏ పని దొరికితే ఆ పని చేసి తన పొట్ట నింపుకునేవాడు. ఆటో నడిపాడు. ఒక మునిసిపల్ స్కూల్లో చప్రాసీగా పని చేసాడు. ఆ స్కూలు వాతావరణంలో ఉద్యోగిగా చదువు నేర్చుకొని టీచర్ అయ్యాడు.

మ్యాగ్జింగోర్కీకి తన బాల్యమే తన విశ్వవిద్యాలయమైనట్లు తన శ్రమజీవన క్రమాన్ని "నా విశ్వవిద్యాలయం – మారేఖ విద్యాపీఠ్" అని 1966లో వెలువరించిన కవితాసంకలనం విస్తృతమైన ప్రచారాన్ని గుర్తింపును పొందింది. ఎందుకంటే అందులో ఉన్నవన్నీ కార్మికుల ఎదుగూ బొదుగూ లేని జీవితాలు – పోరాటాలే. కార్మికుల హక్కులు – సామాజిక న్యాయంపై ఆయన చేసిన రచనలకు 1973లో సోవియెట్ ల్యాండ్ నెహ్రూ అవార్డ్ వచ్చింది.

సుర్వే అల్లుడు గణేశ్‌ఘరే ఆ దొంగ రాసిన క్షమాపణపత్రం చదివి చాలా చలించిపోయాడు. "ఇటీవలి ప్రజల జ్ఞాపకాల నుంచి సుర్వే కవిత్వం కనుమరుగవుతున్నది. కాని ఒక దొంగగా మారిన పేదవానిపై ఆయన కవిత్వ ప్రభావం ఉండడమే ఆయన మా టి.వి. వదిలి వెళ్లడానికి పురికొల్పి ఉంటుంది. బహుశా ఈ సంఘటన ప్రజలు మళ్లీ నారాయణ సుర్వేను చదవడానికి పురికొల్పవచ్చు" అన్నాడు.

ప్రజలు మరొకందుకు కూడా నారాయణ సుర్వేను మళ్లీ చదవాలి – మరాఠీ సాహిత్య చరిత్ర నారాయణ సుర్వేను ప్రొలిటేరియట్ (కార్మికవర్గ) కవిగా గుర్తుపెట్టుకుంటుంది. జీవితం వల్ల, కవిత్వం, రచనల వల్ల.

మళ్లీ అటువంటి బొంబాయిలో 1981 బట్టలమిల్లుల కార్మికుల ఒక సంవత్సరం చారిత్రాత్మక సమ్మె సందర్భంగా ఆవాన్ నాట్యమంచ్ ప్రారంభమైంది. ఆ సమ్మెలో మిల్లుల ముందు భారత్ నవ్‌జవాన్ సభ నిరసన ప్రదర్శనల్లో భాగంగా విలాస్ గోగ్రే అనే దళిత విప్లవకవి ఉద్భవించాడు. ఆయన పాటలు నారాయణ సుర్వే కార్మికవర్గ చైతన్యాన్ని మరింత గుణాత్మకంగా నక్సల్బరీ, దళిత పాంథర్స్ (1972) ప్రభావంతో ముందుకు తీసుకుపోయాయి. 1997లో ఘట్కోపర్‌లో అంబేద్కర్ విగ్రహానికి తారుపూసి చెప్పులదండ వేసిన దుండగుల చర్యకు వ్యతిరేకంగా దళితాగ్రహం పెల్లుబికినప్పుడు సిఆర్‌పిఎఫ్ నిరసన ప్రదర్శనకారులపై జరిపిన కాల్పుల్లో 11 మంది దళితులు మరణించారు. ఆ దృశ్యాన్ని చూసి విలాస్‌గోగ్రే ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే ఆయన పాటలతో, ప్రదర్శనలతో ప్రభావితుడైన ట్రేడ్ యూనియన్ ఆర్గనైజర్ సుధీర్‌ధావ్లే ఆ సంఘటన తర్వాత విద్రోహి అనే సంస్థను స్థాపించి 'విద్రోహి' అనే పత్రికను కూడ మరాఠీ దళిత, ముస్లిం రచయితల వేదికగా ప్రారంభించాడు. ఆయన ఆరేళ్లకు పైగా (6 జూన్ 2018 నుంచి) జైల్లో ఉన్నా ఆ పత్రిక ఇప్పటికీ వెలువడుతున్నది. ఆయన ప్రభావంతోనే నాగపూర్ నుంచి సురేంద్ర గాడ్లింగ్ మొదట ఆవాన్ నాట్యమంచ్ గాయకుడుగా, సాంస్కృతిక కార్యకర్తగా ప్రారంభించి జీవిక కోసం న్యాయవాది అయి సుప్రసిద్ధ క్రిమినల్ లాయర్‌గా 25 సంవత్సరాలు పని చేసి 6 జూన్ 2018న ఎల్గార్ పరిషత్ భీమాకోరేగాంవ్ కేసులో అరెస్టయ్యాడు. ఆయన తల్లి చనిపోయిన ఏడాదికి ఎనిమిది రోజుల కోసం బయటికి వచ్చినప్పుడు నాగపూర్‌లో న్యాయవాదుల బృందంలో పాడిన పాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ ఇద్దరి ఇళ్లమీద కూడ 2018, ఏప్రిల్ 27న పూనె పోలీసులు దాడిచేసి వీళ్ల కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు ఎత్తుకుపోయారు. ఆ తర్వాత జూన్ 6న ఇద్దరినీ ఎత్తుకుపోయారు. దీనిని అరెస్టు అంటారనుకోండి.

1970ల ఆరంభంలో పోలీసులు ఖమ్మంలో బి.వీరయ్య అనే విప్లవాభిమాని బుక్‌స్టాల్‌పై దాడి చేసి పుస్తకాలు ఎత్తుకుపోయారు. అప్పుడు శ్రీశ్రీ పోలీసులను 'పుస్తకాల దొంగలు' అని ఎత్తి పొడిచారు. సాంకేతిక విజ్ఞాన పరికరాలు – కంప్యూటర్లు, పెన్‌డ్రైవ్‌లు, మొబైల్‌ఫోన్ల వంటి ఎలక్ట్రికల్ డివైసెస్ వచ్చాక – పుస్తకాలతో పాటు వీటినీ ఎత్తుకుపోతున్నారు. అయితే ఇవి నిర్దోషిగా ప్రకటించినా తిరిగి ఇవ్వడం ఉండదు. మనుషులే తిరిగి వస్తే అదే మహాభాగ్యం – బతికుంటే బలుసాకు తిని బతుకొచ్చు అనుకునే కాలంలో ఉన్నాం మనం.

నిజంగానే అటువంటి కడు పేదరికం అనుభవిస్తూ రెక్కల కష్టం చేసుకొని బతికి వృద్ధులైన పూనేలోని దళిత కుటుంబాల నుంచి వచ్చారు కబీర్ కళామంచ్ కళాకారులు – జ్యోతి జగతప్, రమేశ్ గైచార్, సాగర్ గోర్ఖే. ముగ్గురూ ముప్పైలలో ఉన్న వాళ్లు. సుధీర్‌ధావ్లే స్థాపించిన రిపబ్లికన్ ప్యాంథర్స్ – బ్లాక్ పాంథర్స్, దళిత పాంథర్స్ – సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక సంస్కృతి కోసం సైద్ధాంతిక దృక్పథాన్ని ఇస్తే మహారాష్ట్రలో ఉన్న పీష్వాలను, బ్రాహ్మణీయ సంస్కృతిని ధిక్కరిస్తూ 'నయా పీష్వాయీ నహీ చలేగీ' అనే సందేశాన్ని పాటలు, నాటికలు వంటి కళారూపాలతో ముందుకు తీసుకుపోతున్న సాంస్కృతిక కార్యకర్తలు వీళ్లు. కబీర్ కళామంచ్ మహారాష్ట్రలో ఒక సాంస్కృతిక కళావేదికగా ఎంత ప్రసిద్ధి పొందిందంటే వీళ్లపై ఆనంద పట్వర్ధన్ ఒక డాక్యుమెంటరీ కూడా తీసాడు. వీళ్లదగ్గర ఎత్తుకుపోవడానికి ఏమీలేక సుధీర్, సురేంద్రలకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరిస్తే 2000 సంవత్సరం సెప్టెంబర్‌లో వీళ్లనే ఎత్తుకుపోయి జైల్లో పెట్టింది ఎన్ఐఎ.

ఎల్గార్ పరిషత్ భీమాకోరేగావ్ 200 సంవత్సరాల సందర్భంగా బి.వి. సావంత్ (సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయవాది), కోల్సే పటేల్ (బొంబాయి హైకోర్టు విశ్రాంత న్యాయవాది చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా 280 దళిత, మైనారిటీ, బహుజన సంఘాలతో పూనే శనివార్‌వాడలో సుధీర్‌ధావ్లే మరొక ఫాసిస్టు వ్యతిరేక ప్రొలిటేరియట్ కవి బెర్టోల్ట్ బ్రెహ్ట్ మరాఠీ కవితానువాదంతో తన ప్రసంగం ప్రారంభించి రాజ్యాంగం ఆదేశిక సూత్రాలు ప్రమాణంగా 'నయా పీష్వాయీ నహీ చలేగీ' అని ఐదువందల మంది ప్రతినిధులతో నినదించాడు. ఆయన చదివిన కవిత అయినా, కబీర్ కళామంచ్ కళాకారులు పాడిన పాటలు, ఆడిన ప్రదర్శనలు నారాయణ సుర్వే–

'పోగుపడిన సాహితీసంపదను
మెరిసే కత్తితో ఛేదిస్తాను! వణకకండి' అని సారస్వతులను హెచ్చరించిన కవిత్వంకన్నా తీవ్రమైనవి కావు. అయినా కార్మిక వర్గం కోసం ఆయన రాసిన కవిత్వంతో ప్రభావితుడైన దొంగ ఆయన వస్తువులను పశ్చాత్తాపంతో తిరిగి ఇచ్చాడు.

కవిత్వం రాసినందుకే ఎన్ఐఎ పోలీసులు 6, 4 సంవత్సరాల కింద ఎత్తుకుపోయి నిర్బంధించిన కవులను, కళాకారులనయినా తిరిగి వాళ్ల కుటుంబాలకు, సమాజానికి అప్పగిస్తుందా ఈ రాజ్యం?

ఏమో! కార్ల్‌మార్క్స్ అన్నా, మార్క్సిజమన్నా ఎంతో ఇష్టపడే నారాయణ సుర్వే "మనుషుల నైపుణ్యాలు పెరగడం పెట్టుబడికి దుర్వార్త. అందుకే పెట్టుబడిదారీ వ్యవస్థ కవులను ఇష్టపడదు" అంటాడు.

■ ఫెలో ట్రావెలర్



బదిలీలు సరే.. భర్తీ ఏదీ?

బల్దియాకు తలనొప్పులు తెచ్చిన ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు

- సాధారణ బదిలీల్లో 70 మందికి స్థానచలనం
- ఆ ఖాళీలను భర్తీ చేయని ప్రభుత్వం
- పోస్టింగ్ ఇచ్చినా రిపోర్టు చేయని కొందరు
- ఫలితంగా సిబ్బందిపై పెరిగిన పనిభారం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5 : 'మూలిగే నక్కపై తాటి పండు పడిన' చందంగా ఉంది వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిస్థితి. చాలా ఏళ్ల తర్వాత జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీలు బల్దియాకు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టాయి. బదిలీలు మాత్రం పెద్ద ఎత్తున జరిగి.. అధికారులకు స్థానచలనం కాగా.. వారి స్థానాలను భర్తీ చేసేవారు మాత్రం ఇక్కడికి రావడం లేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది.


రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 80 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విభాగాల్లో సాధారణ బదిలీల ప్రక్రియను నిర్వహించింది. ఒకే స్థానంలో మూడేళ్ల కంటే ఎక్కువకాలం పని చేసిన సిబ్బందిని గుర్తించి స్థానచలనం కల్పించారు. ఈ క్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. గత నెల 20వతేదీ వరకు బల్దియాలో పనిచేస్తున్న 70 మంది నాలుగో తరగతి నుంచి గెజిటెడ్ ఎస్‌ఈ, సిటీప్లానర్ వరకు బదిలీల ప్రక్రియ జరిగింది. కొందరికి ఆర్‌డీఎంఏ పరిధిలో బదిలీలు నిర్వహించగా, మరి కొందరు అధికారులకు ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బదిలీ చేసిన వారి స్థానాల్లో రెండు, మూడు స్థానాల్లో ఉద్యోగులను నియమిస్తూ పోస్టింగ్ ఇచ్చినా ఇంత వరకు వచ్చి రిపోర్టు చేయలేదు. కొందరు ఇక్కడకు వచ్చేందుకు మీమాంసలో ఉండగా, మరికొందరు రావడానికి వెనకాడుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో పనులు నిలిచి పోకుండా ఉండేందుకు ఎస్‌ఈ కృష్ణారెడ్డి స్థానంలో అదే విభాగంలో పని చేసే ఈఈ రాజయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించగా.. సిటీ ప్లానర్ వెంకన్న స్థానంలో ఎంశైలజకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ ఇంకా విధుల్లో చేరలేదు. శానిటేషన్‌లో ఎస్‌ఐలకు అదనపు బాధ్యతలు అప్పగించగా తల మునకలవుతున్నారు. అదే విధంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగంలో ఆరుగురు బదిలీ కాగా, ఇంకా విధుల నుంచి రిలీవ్ కాకుండా ఒక్క ఆశతో బదిలీలో మార్పు చేసుకునేందుకు కొందరు అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

సిబ్బందిపై అధిక పని భారం

బల్దియా పరిధిలో శానిటేషన్ విభాగంలో పనిచేసే సిబ్బందితో పాటు కాలనీల వారిగా పనిచేసే ప్రభుత్వ, దినసరి కార్మికులు ఇప్పటికే ఉండవలసిన సిబ్బంది కంటే చాలా తక్కువగా ఉన్నారు. జనాభా నిష్పత్తి పెరిగిన కొద్దీ సిబ్బందిని పెంచాల్సి ఉండగా, తక్కువ సిబ్బందితో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో శానిటేషన్ విభాగం నుంచి 50 మంది సిబ్బందిని బదిలీ చేయడం వారి స్థానాల్లో ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో ఉన్న సిబ్బందికి పనిభారంగా మారుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా టౌన్ ప్లానింగ్‌లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాల్సిన సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించపోవడం వల్ల పనులు స్తంభించి పోయారు. అరకొర ఇంజనీరింగ్ సిబ్బంది ఉండడంవల్ల రోడ్లు, డ్రెయినేజీలు, తదితర అభివృద్ధి పనులు నిలిచి పోతున్నాయి. అదేవిధంగా ప్రజలకు సమయానికి తాగునీటి సరఫరా చేయాల్సిన ఫిల్టర్ బెడ్ల సిబ్బంది, అధికారులు తక్కువగా ఉండడంతో తాగునీరు ప్రజలకు అందకుండా పోతోంది. వరంగల్ ట్రైసిటీలో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు(ఎంహెచ్‌వో)లు ఉండాల్సింది పోయి.. ఒక్కరే పని చేస్తుండడంతో తలకు విఎంచిన భారంగా మారింది. ఇంకా బాలసముద్రంలోని బల్దియా వాహనాల రిపేరు షెడ్డుకు వచ్చిన వాహనాలు ఈఈతో పాటు డీఈ అంబుబాటులో లేకపోవడంతో చిన్నపాటి రిపేరుకు వస్తే నెలల తరబడి షెడ్డులోనే ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. అలాగే బల్దియా సమాచార విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి.. అటు కలెక్టర్ కార్యాలయంలో ఇటు బల్దియాలో పనిచేస్తూ భారంతో సతమతమవుతున్నట్లు తెలిసింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి బల్దియాకు వెంటనే సిబ్బందిని భర్తీ చేస్తే అదనపు బాధ్యతలు నిర్వర్తించే సిబ్బంది, అధికారులకు కొంత ఉప శమనంగా కలుగుతుందని ఉద్యోగులు భావిస్తున్నారు.

70మంది సిబ్బంది బదిలీ..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఇటీవల అన్ని విభాగాలను కలుపుకొని 70 మంది వరకు ఉద్యోగులు, అధికారులు బదిలీ అయ్యారు. ఒక సీనియర్ అసిస్టెంట్, పది మంది వార్డు ఆఫీసర్లు, ఒక శానిటరీ సూపర్‌వైజర్, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎనిమిది మంది హెల్త్ అసిస్టెంట్లు, ముగ్గురు శానిటరీ జవాన్లు, ఆరుగురు అటెండర్లు, ఒక లైన్‌మెన్, ఒక వాచ్‌మెన్, ఇద్దరు పంప్ ఆపరేటర్లు, 13మంది పబ్లిక్ హెల్త్ (పీహెచ్)వర్కర్లు, వీరితో పాటు ఒక సిటీ ప్లానర్, నలుగురు టీపీపీవోలు, ఒక ఎస్‌ఈ, ఒక ఈఈ, ముగ్గురు డీఈలు, ముగ్గురు బర్త్ అండ్ డెత్ విభాగం అధికారులు, ముగ్గురు పరిపాలనా విభాగం, నలుగురు క్లర్కులు బదిలీ అయ్యారు. మొత్తంగా బల్దియా నుంచి ఖమ్మం, మహబూబాబాద్, పరకాల, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల మున్సిపల్ కార్పొరేషన్‌లకు సుమారు 70మంది బదిలీ అయ్యారు. కొందరు ఇక్కడి నుంచి నిష్క్రమించగా, ఇంకా కొందరు స్థానచలనం కాకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లి రిపోర్టు చేసిన తర్వాత తిరిగి బల్దియాకు డిప్యూటేషన్ వచ్చేందుకు, లేదంటే ఒకరికి బదులు మరొకరు అనే అవకాశం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.





జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి మరింత కృషి

'శ్రావణ' వేడుకలను ప్రారంభించిన ఎంపీ కడియం కావ్య

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 5: నగరంలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయ అభివృద్ధికి మరింత కృషిచేస్తానని ఎంపీ కడియం కావ్య చెప్పారు. శ్రావణమాసం సందర్భంగా వేయిస్తంభాల ఆలయంలో నెలరోజులపాటు జరిగే వేడుకలను ఆమె శివుడికి ప్రీతికరమైన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీగా తొలిసారి ఆలయాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కల్యాణమండపాన్ని పరిశీలించి.. మిలిగిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న గార్డెన్‌కు అవసరమైతే ఎంపీ నిధులను కేటాయిస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఇతర అర్చకులు ఆమెతో రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి శేషవస్త్రాలు బహూకరించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా కూడా ఎంపీ వెంట వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవ అనంతరం ఉత్తిష్ట గణపతికి హరిద్రా కుంకుమ లేపనంతో అఘోర పాశుపద మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహింపజేశారు. 200 మంది దంపతులతో సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 51 కిలోల పెరుగన్నంతో అన్నసూక్త మంత్ర పఠనంతో అపమృత్యు రుద్రుడిగా అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. శివ భక్తుడు మామిడాల గణపతి దంపతులు మహాన్నదానం నిర్వహించారు. మణి కంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మలతోపాటు ఆలయ ఈవో వెంకటయ్య వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ తోట వెంకన్న, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి, హనుమకొండ సీఐ సంతోష్ తదితరులు కూడా పాల్గొన్నారు.

మెడికల్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ

కోటా టెన్షన్

- 2023-24నుంచి ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లలో వాటా కట్
- 1 శాతం రిజర్వేషన్‌ను తొలిగించిన గత ప్రభుత్వం
- ప్రొఫెషనల్ కోర్సుల్లో అమలవుతున్న కోటా విధానం
- గత ప్రభుత్వం నిర్ణయంతో కేడెట్స్‌పై ప్రభావం



వివరాలు : 7లో..

ఆపరేషన్ కరెంట్ పోల్
- విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి
- ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు
7



అభివృద్ధి పనులపై మాట్లాడుతున్న మంత్రి సురేఖ

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తిచేయండి

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- నగరాభివృద్ధిపై అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5: గ్రేటర్ వరంగల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. సోమవారం 'స్వచ్ఛదనం.. పచ్చదనం.' కార్యక్రమాల అనంతరం సాయంత్రం హనుమకొండ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బల్దియా, కుడా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధారణ నిధు లు, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్, స్మార్ట్ సిటీ మిషన్ కింద 15వ ఫైనాన్స్ తదితర అంశాలపై సమీక్షించారు. అభివృద్ధి పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న పనులలో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. మిగిలిన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్‌సిటీ మిషన్ కింద భద్రకాళి బండ్, వడ్డెపల్లి బండ్ అభివృద్ధి పనులతో పాటు 4 స్టేడియాలు, రంగసముద్రం బండ్ సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు ఆర్టీవో ఆఫీస్ ఖమ్మం రోడ్డు నుంచి ఆరెపల్లి వరకు 13 కిలోమీటర్ల ఇన్నర్ రింగు రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఇంకా కాళోజీ కళాక్షేత్రం పనులు ఇప్పటివరకు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు సెప్టెంబరు 9లోగా పూర్తి చేయాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.11.69కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందులో హనుమకొండ జిల్లాకు రూ.5.60కోట్లు కేటాయించారని చెప్పారు. సెప్టెంబరు 9న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, బల్దియా ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సిటీ ప్లానర్ శైలజ, హనుమకొండ ఆర్డీవో రమేష్, కుడా పీవో అజిత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం'లో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- బల్దియా పరిధిలో మొక్కలు నాటిన ప్రముఖులు



మాట్లాడుతున్న మంత్రి సురేఖ



బల్దియా ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, కలెక్టర్లు, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమంలో ప్రజలు, ప్రభుత్వ అధికారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర అటవీ పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'స్వచ్ఛదనం.. పచ్చదనం..' కార్యక్రమాన్ని సోమవారం బల్దియా కార్యాలయ ఆవరణలో మంత్రి సురేఖ, ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు లాంఛనంగా ప్రారంభించారు. బల్దియాలో శ్రమదానం చేస్తూ చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. తర్వాత సంయుక్తంగా జెండా ఊపి శాంతి ర్యాలీని ప్రారంభించారు. బల్దియా నుంచి కేఎంసీ వరకు ఈ ర్యాలీ పండగ వాతావరణంలో సాగింది.

ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. కరోనా ముగిసిన తర్వాత వయసుతో సంబంధం లేని వ్యాధులు వస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారం, పరిసరాల విషయంలో అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా వాతావరణంలో కాలుష్యం వల్ల డెంగీ చికెన్ గున్యా, మలేరియా జ్వరాలు సోకి చాలామంది పేదలు ఆస్పత్రుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు జబ్బులు రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రంతో పాటు పచ్చని చెట్లను పెంచాలని సూచించారు. ఇంకా ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఐదు రోజులుగా జరిగే స్వచ్ఛదనం.. పచ్చదనం.. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ మాట్లాడుతూ.. ప్రధానంగా పల్లెలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం కోసమే సీఎం ప్రత్యేక చొరవతో ఐదు రోజుల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. బల్దియాలో మంత్రి చేతుల మీదుగా తొలిసారిగా మొక్కలు నాటడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఇన్‌చార్జి ఏసీ కృష్ణారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సిటీప్లానర్ ఎంశైలజ, ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేష్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌లో కోల రాజేశ్‌లు పాల్గొన్నారు.

20లోపు కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్



కళాక్షేత్రం నిర్మాణపనులు పరిశీలిస్తున్న పురపాలక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, అధికారులు

బాలసముద్రం, ఆగస్టు 5: బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఆగస్టు 20లోపు పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ నిర్మాణ సంస్థల ప్రతినిధుల ను ఆదేశించారు. సోమవారం మే యర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిష నర్ అశ్విని తానాజీవాకడే అధికారులతో కలిసి కాళోజీ కళాక్షేత్రంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ.. ఆగస్టు 20లోపు పనులు పూర్తి చేయాలన్నారు. కళాక్షేత్రంలో ఏఏ పనులు ఎప్పటివరకు పూర్తి చేస్తారో నిర్మాణసంస్థ ప్రతినిధులు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అన్నారు. అదనంగా పనివారిని నియమించి షిఫ్టుల వారీగా పని చేయించాలని అధికారులను, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. బాల్కనీ, సీటింగులపై నిర్మాణ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను ప్రతీరోజు తనిఖీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కొనసాగింపునకు ఆమోదం

వరంగల్ నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ అభివృద్ధి పనులు కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ అన్నారు. సోమవారం కుడా కార్యాలయంలో 27వ స్మార్ట్‌సిటీ బోర్డు నిర్వహించారు. ఈ బోర్డు సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, ఇంజనీర్ ఇన్ చీఫ్ జియాఉద్దీన్, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, బల్ది యా కమిషనర్, కుడా వీసీ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు సం ధ్యారాణి, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వరంగల్ నగరంలో జరుగుతున్న పనుల వివరాలను దానకిశోర్ అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్‌సిటీ పథకం ఎజెండాలో రూపొందించిన బయో మైనిగ్, స్మార్ట్‌సిటీ ఫేజ్ 1, 2 పనులు, నాలాల పునరుద్ధరణ, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, దసరా రోడ్డు, గవిచర్ల రోడ్డు, వడ్డెపల్లి బండ్, భద్రకాళీ బండ్ జోన్, నయీంనగర్ హైవే లెవల్ బ్రిడ్జీ పనులు జరుగుతున్నాయని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ఇక్కడ జరుగుతున్న పనులకు 2025 వరకు బోర్డు ఆమోదం తెలిపిందని చెప్పారు. గతంలో మంజూరు చేసిన 4 అభివృద్ధి పనులను రద్దుచేస్తూ వాటి స్థానంలో మరో నాలుగు పనులకు ప్రతిపాదనలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, బల్దియా ఎస్‌ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈ శ్రీనివాస్‌రావు, స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆనంద్ ఓలేటీ పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా సుభాషిణికి

అదనపు బాధ్యతలు

రాంనగర్, ఆగష్టు 5: హనుమకొండ జిల్లా రిజిస్ట్రార్‌గా స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సుభాషిణి సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్‌లు, కింది స్థాయి సిబ్బంది పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. కాగా, హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని కింది స్థాయి సిబ్బంది మూడు రోజుల కిందటే వారికి కేటాయించిన స్థానాలకు వెళ్లారు. బదిలీ అయిన రిజిస్ట్రార్ రవితో పాటు సబ్ రిజిస్ట్రార్‌లు రాజు, అమ్జద్‌లు సోమవారం రిలీవ్ అయ్యారు. కాగా, డీఐజీ సుభాషిణి జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించగా బదిలీ అయిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్‌ల స్థానంలో రాంనర్సింహరావు, ఆనంద్‌లు వచ్చారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొత్త అధికారులు విధుల్లో చేరారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ప్రజా ప్రభుత్వంలో విద్యార్థుల సమస్యలు పట్టవా?

- పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు నాగేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు5: ప్రజా ప్రభుత్వంలో విద్యార్థుల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వర్‌రావు అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట కలిసి ధర్నా చేశారు. ఈ సం దర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బీనరసింహారావు, జిల్లా నాయకులు వంశీ, పృథ్వీ, అఖిల్, అజారుద్దీన్, చరణ్, నిఖిల్, శ్రీదత్తతోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలి

జిల్లాలోని అర్హులైన పేదలకు పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషినల్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణిలు ఉన్నారు.



రెండు రోజులపాటు కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, ఆగస్టు 5 కాజీపేట - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ మధ్య ఉన్న కోమటిపల్లి రైల్వే గేటును మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.




నర్సరీలో మొక్కను నాటుతున్న జంగా రాఘవరెడ్డి

ఆయిల్‌పామ్ సాగు పెంపుపై దృష్టి


తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింతగా పెంచేందుకు ప్రభుత్వం సారించిందని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతుల కు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉన్నందున రైతులు ఈ సాగుపై మొగ్గుచూపాలన్నారు. సాగుకు నాణ్యమైన మొక్కలను అందించేందుకు గానూ నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంపునకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలో జంగా మొక్కను నాటారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ రావు, అధికారులు రవికాంత్, రామకృష్ణ, రవళి, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.


























ఇంటర్ విద్యార్థి అదృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: మండలంలోని శివునిపల్లి గ్రామానికి ఎస్. యశ్వంత్‌రెడ్డి అనే ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రు లు మహేశ్వరి - అమరేందర్‌రెడ్డి తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. యశ్వంత్‌రెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో డివిజన్ కేంద్రంలోని హోలీక్రాస్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ హనుమకొండలోని ఓ ప్రయివేటు కళాశాలలో బైపీసీ గ్రూపులో చేరి హస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం యశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులతో ఫోన్‌లో బాగానే మాట్లాడాడని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున హాస్టల్ వార్డెన్ విద్యార్థులను నిద్రలేపే క్రమంలో యశ్వంత్‌రెడ్డి కనిపించలేదు. వార్డెన్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వగా.. ప్రిన్సిపాల్ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వెంటనే తల్లిదండ్రులు బంధువలకు, తెలిసినవారికి ఫోన్ చేసి అడిగి పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి వెతికినప్పటికీ యశ్వంత్‌రెడ్డి జాడ దొరకలేదు. దీంతో సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి మిస్సింగ్ పై ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి అచూకీ తెలుసుకొని అప్పగించాలని పోలీసులను వేడుకున్నారు. ఎవరికైనా అచూకీ తెలిస్తే 8897224045, 986650916

గర్భిణీపై దాడి.. గర్భస్థ శిశువు మృతి

పోలీసులను ఆశ్రయించిన మహిళ భర్త

మడికొండ, ఆగస్టు 5: నిండు గర్భిణీ పై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో సదరు మహిళ గాయపడి గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిందని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళ భర్త పోలీసులను ఆశ్రయించాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మసాగర్ మండలం శాయిపేటకు చెందిన చేపూరి శ్రీధర్ కాజీపేట మండలం రాంపేటకు చెందిన అనూషను కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొంతకాలం కాపురం చేసిన తర్వాత కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాలపల్లికి చెందిన మెడుదల అమిత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా, కొంతకాలంగా శ్రీధర్ తిరిగి తన మొదటి భార్య అయిన అనూషతో కలిసి ఉంటూ తన రెండో భార్య వద్దకు వెళ్లడంలేదు. ఈక్రమంలోనే మొదటి భార్య గర్భం దాల్చింది. ఆమె తన తల్లిగారింటి వద్ద ఉండగా నిండు గర్భిణీగా ఉన్న భార్య అనూషను ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి శ్రీధర్ రాంపేటకు చేరుకున్నాడు. ఆదివారం తన రెండో భార్య అమిత.. మరికొందరితో కలిసి రాంపేటకు చేరుకొని తన భర్త శ్రీధర్, అతడి మొదటి భార్య అనూషపై దాడి చేశారు. దీంతో గాయపడిన అనూషను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీసి గర్భంలోనే చనిపోయిందని తెలిపారు. దీంతో తన భార్యపై దాడి చేసి గర్భంలో ఉన్న శిశువు మృతికి కారణమైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సోమవారం శ్రీధర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మెడికల్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ కోటా టెన్షన్

2023-24నుంచి ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లలో వాటా కట్ ● ఈ మెడికల్ కౌన్సెలింగ్‌కైనా కోటా అమలు చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాపై విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. త్వరలోనే మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టేందుకు వరంగల్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఎన్‌సీసీ కోటాను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుం దా? లేదా? అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. రాష్ట్రం లో 5జూలై 2017లో జీవో నెం.114ద్వారా మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. ఇంటర్మీడియేట్ కంటే ముందు ఎన్‌సీసీలో ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో పాటు 75శాతం ఎన్‌సీసీ తరగతులకు హాజరైన వారికి మెరిట్ ఆధారంగా మెడికల్ ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పించారు. కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లలో ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీటు లభించేంది. ప్రతి ఏటా మెడికల్ సీట్ల ఆధారంగా 50 నుంచి 60మంది వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించేవి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 4జూలై 2023న జీవో నెం.75ను జారీ చేసింది. ఎన్‌సీసీ కేడెట్స్‌కు కల్పిస్తున్న 1శాతం రిజర్వేషన్ తొలిగించి, పీడబ్ల్యూడీ కోటాను పెంచుతున్నట్లు పేర్కొంది. వరంగల్‌లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఈ మేరకు ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో గత ఏడాది మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ పని చేయకుండా పోయింది. గత నాలుగైదేళ్లగా మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో ప్రవేశం పొందాలని శిక్షణ పొందిన విద్యార్థులకు నిరాశ మిగిలింది. ఈ ఎన్‌సీసీ కోటాలో ప్రవేశాలు పొందే వారిలో అత్యధికంగా పేదలే ఉన్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఎన్‌సీసీ కోటా ద్వారా మెడికల్ కల నేరవేరుతుందనే ఆశలు గల్లంతయ్యాయని విద్యార్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వందలాది మంది ఎన్‌సీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరించేనా?

దేశభక్తిని పెంచే ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తొలిగించిన 1శాతం రిజర్వేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక గత పద్ధతినే పాటిస్తుందా అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10వేల ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటాలో 6వేల సీట్లు కేటాయిస్తారని, ఎన్‌సీసీ విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్ కల్పించిన సుమారు 60మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు మెడికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఉన్నారు. ప్రొఫెషనల్ కోర్సులైనా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, వెటర్నరీ తదితర అన్ని కోర్సుల్లో ఎన్‌సీసీ కోటా అమలు చేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కోర్సుల్లో కూడా ఎన్‌సీసీ కోటాను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆపరేషన్ 'కరెంట్ పోల్'

విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి ● అధికారుల చొరవతో మారుతున్న పనితీరు ● అర్జీలు పెట్టకముందే ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం ● ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు ● పోల్స్‌కు నెంబరింగ్‌తో సులభంగా సమస్యల గుర్తింపు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు మారుతోంది. ఉన్నతాధికారుల చొరవతో కొత్త ఒరవడి కనిపిస్తోంది. ఒకప్పుడు అర్జీలు పెట్టుకుని, కాళ్ల చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు కూడా సమాధానం దొరుకుతోంది. వరిగిపోయి, తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తెగిన, వదులుగా మారిన స్టేవైర్లు, పోల్‌కు పోల్‌కు మధ్య సాగి వేలాడుతున్న లైన్లను సరిచేయడంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులతో పాటు గృహ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ స్తంభాలకు నెంబరింగ్ వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ నెంబరింగ్‌తో సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్స్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు సమస్య ఉన్న ప్రాంతాన్ని విద్యుత్‌శాఖ దగ్గర ఉన్న మ్యాప్ ద్వారా గుర్తించేందుకు వీలు కలుగుతుంది. పసుపు రంగుపై ఎరుపు రంగుతో ఏరియా, పోల్ వరుసక్రమాన్ని స్పష్టంగా కనిపించేలా రాయిస్తున్నారు. దీని ద్వారా విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకుంటారు. గతంలో ఈ విధానం ఉన్నప్పటికీ స్పష్టంగా లేకపోవడంతో కొంత మార్పులు చేసి కొత్తగా విద్యుత్ స్తంభాలకు నెంబరింగ్ వేస్తున్నారు. అలాగే వర్షాలు పెరగనున్న నేపథ్యంలో తుప్పుపట్టిన స్తంభాల స్థానంలో కొత్తవి, వంగిన స్తంభాలను నిటారుగా నిలబెట్టే పనులను ఇప్పటికే పూర్తి చేశారు.





మహబూబాబాద్ సర్కిల్‌లో వంగిన తర్వాత, నిటారుగా నిలబెట్టిన తర్వాత విద్యుత్‌స్తంభాల దృశ్యం

సరిచేసినవి, కొత్తవి స్తంభాలు

హనుమకొండ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	941
కొత్తవి స్తంభాలు	109
స్టే వైర్లు	158
సరిచేసిన లూజ్‌లైన్‌లు	37 కి.మీ
వరంగల్ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	634
కొత్తవి (తుప్పు స్థానం)లో	35
స్టే వైర్లు	245
సరిచేసిన లూజ్ లైన్లు	34 కి.మీ
భూపాలపల్లి, ములుగులో..	
నిటారుగా చేసినవి	507
సరిచేసిన లూజ్ లైన్	5.28 కి.మీ
జనగామలో..	
నిటారుగా చేసిన స్తంభాలు	175

లూజ్‌లైన్లకు మోక్షం

గ్రామాల్లోని చెలకలు, పొలాల వద్ద లూజ్‌లైన్‌ల వద్ద పశువులు, మనుషులు విద్యుత్ వైర్లకు తాకి ఉమ్మడి జిల్లాలో మృత్యువాతపడ్డ ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు విద్యుత్‌శాఖ అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కార మార్గం చూపలేదు. ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటీ వరుణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఈ 7 నెలల వ్యవధిలో ఎన్పీడీసీఎల్ పరిధిలో లూజ్ లైన్‌లు ఉన్న ప్రతీ చోట మిడిల్ పోల్ ఏర్పాటు చేయడం, సరిపోను స్తంభాలుంటే విద్యుత్ వైర్లను గట్టిగా లాగి సరిచేయడం లాంటివి చేశారు. విద్యుత్ స్తంభాలు వంగకుండా సపోర్ట్‌గా స్టేవైర్లు ఏర్పాటు చేశారు.

తెలుగులో స్వామికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 5: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి స్వామికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలంగాణ గిరిజన కథా సంపుటాలు' అనే అంశంపై కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో బానోతు స్వామి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దేవుని తండాకు చెందిన స్వామి గిరిజన సాహిత్యంలో కథా సాహిత్యంపై ప్రామాణికమైన పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. జాతీయ గిరిజన ఫెల్లోషిప్ సాధించా రు. కర్ణాటక మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థకు ఎంపికయ్యారు. 11 అంతర్జాతీయ, మరో 20 జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. గిరిజన సాహిత్యంపై మళావ్ అనే పుస్తకాన్ని ముద్రించారు. డాక్టరేట్ సాధించిన స్వామిని పలువురు అభినందించారు.

బీఈడీ కళాశాలలో దివ్యాంగులకు రేపు ప్రత్యేక శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: సమగ్ర శిక్ష, అల్మికో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బుధవారం హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎం.డి.అబ్దుల్ హై సోమవారం ఒకప్రటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు వారి ఆధార్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికేట్, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని పేర్కొన్నారు.

ఐటీఐలో మూడో దఫా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం నిర్వహిస్తున్న మూడో దఫా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా విద్యార్థులు సైతం దరఖాస్తులు చేసుకోవచ్చునని, వారికి ప్రవేశాల్లో 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సోమవారంతో ముగశాయి. గత నెల 18 నుంచి సోమవారం వరకు 13 రోజులుగా జిల్లా కేంద్రంలోని 5 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సజావుగా ముగిశాయి. మొత్తం 23,467 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 21,305 మంది పరీక్షకు హాజరు కాగా 2,162 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 90.79 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

9న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 9న హెచ్‌సీఎల్ సహకారంతో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ (కో-ఎడ్) కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 75 శాతంతో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్ సైన్స్ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ఈజాబ్ మేళాలలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. జాబ్ మేళాలలో ఉద్యోగం సాధించిన వారికి వేతనంతో పాటు ప్రముఖ వర్సిటీల్లో డిగ్రీ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు నరేష్ (7569177071)ను సంప్రదించాలని వారు సూచించారు.

20న ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 20న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ సూపరింటెండెంట్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల12 నుంచి 14 వరకు కొత్తగా ఏర్పాటు కాబోయే కౌన్సిల్ నందు సభ్యత్వం కోసం హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ క్రీడాకారుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 17న దాఖలు చేసిన నామినేషన్లు ఉపసంహారణకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. 20న ఎన్నిక నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

నియోజకవర్గంలో అవినీతి అంతమే నా లక్ష్యం

అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించడమే తన లక్ష్యమని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు ప్రక్రియలో ఎవరూ అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏ అధికారైన దరఖాస్తును ముందుకు తీసుకెళ్లడానికి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 35మంది లబ్ధిదారులకు రూ 35,04,060 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 140మందికి రూ. 40,50,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నెల రోజుల లోపే లబ్ధిదారులకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల కోసం ఎల్‌ఓసీలు ఇప్పించేలా సహకరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే అయితే పనులు జరుగుతాయని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని, అవినీతి ఉండదనే నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని వంద పడలక ఆస్పత్రి నిర్మాణానికి నిధులు, వైద్య సిబ్బంది, ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి వెంటనే అమలు చేసేలా చూస్తానని హమీ ఇచ్చారని తెలిపారు. ఈ నెలలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు.



కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

డివిజన్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.24కోట్ల నిధులతో అంచనాలు రూపొందించి సీఎంకు అందజేశామని, దాంతో సీఎం స్పందించి ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రాంభిద్దామని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. డివిజన్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానికి, రెండెకరాల విస్తీర్ణంలో పబ్లిక్ గార్డెన్ అందులో వాకింగ్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వ స్థలాలను అధికారులు వెంటనే గుర్తించాలని సూచించారు. రోడ్ల విస్తరణ పనులను చేపట్టబోతున్నామని, తాటికొండ క్రాస్ రోడ్డు నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు, పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి గార్లగడ్డతండా వరకు, విశ్వనాథపురం నుంచి జఫర్‌గడ్ మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వరకు, ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రవీందర్, ఎంపీడీవో మధుసూధన్, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూధన్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, చాడ రాజ్‌కుమార్, చల్లా రాజిరెడ్డి, నాగరబోయిన యాదగిరి, కోతి రాములు, రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, తోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీతక్క



ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వాజేడు, ఆగస్టు 5: వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లి కొత్తురులో నూతనంగా మంజూరైన కంటైనర్ ఆస్పత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం ప్రారంభించారు. సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. కంటైనర్ ఆస్పత్రిలో బీపీని చెక్ చేయించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాజేడు మండలంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని, ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. జిల్లాలో రెండో కంటైనర్ ఆస్పత్రిని వాజేడు మండలంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈకంటైనర్ ఆస్పత్రిలో ప్రతి వారంలో రెండు రోజులపాటు వైద్యుడు అందుబాటులో ఉండాలన్నారు. నిత్యం ఏఎన్ఎం విధులు నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో పలు స్వచ్ఛందసంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు జరుపుతున్నామని, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, ఇందులో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఐటీఐల ద్వారా స్కిల్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ విధంగా పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉన్న మహిళలకు ప్రమాద బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. త్వరలోనే భద్రాచలం నియోజకవర్గంలో ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాలలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

గుంతల రోడ్డులో సీతక్క కాన్వాయ్ ప్రయాణం

ఏడ్జర్లపల్లికి వచ్చేందుకు మంత్రి సీతక్క ఇబ్బందులు పడ్డారు. పూసూరు నుంచి ఏడ్జర్లపల్లికి సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండటంతో ఆమె కాన్వాయ్ వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు స్థితిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీతక్క తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తన శాఖ ద్వారా మరిన్ని నిధులు ఇచ్చి రోడ్లను బాగు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడ్జర్లపల్లి చుట్టు పక్కల గ్రామాల ఇబ్బందుల స్వయంగా చూశానని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు అధికారులతో మాట్లాడతానన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి రెండు మండలాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జడ్పీటీసీలు తల్లడి పుష్పలత, పాయం రమణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, ప్రసాదబాబు రాజు, కల్యాణ్, తదితరులు ఉన్నారు.



సోషల్ మీడియా సభ్యులకు ఇన్సూరెన్స్

హనుమకొండ సిటీ, ఆగస్టు 5: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్‌రెడ్డి గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన వరంగల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మొహమ్మద్ నేహాల్ ఆధ్వర్యంలో ప్రమాదబీమా చేయించారు. సోమవారం పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, టీపీసీసీ కార్యదర్శి ఇవి.శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ టి.అశోక్‌రావు చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో శ్రమించిన సోషల్ మీడియా సోదరులకు చిరు కానుకగా ఈ ఇన్సూరెన్స్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరమైన పథకాలను సోషల్ మీడియాలో చురుకుగా పాల్గొన్న ప్రతి సభ్యుడికి అందేలా చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు కేతిడి దీపక్ రెడ్డి, ఇందిరా ఫెలోషిప్ ఇవి.సాత్విక, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావుల ధనుంజయ్, రమేశ్, నవీన్ యాదవ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం - పచ్చదనం’లో భాగస్వామ్యం కావాలి

- జిల్లాలో 17 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రావీణ్య



పంథిని పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాగరాజు తదితరులు

ఐనవోలు, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం విజయవంతంలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపునిచ్చారు. పంథినిలో సోమవారం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరు పాటించడంతో ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించవచ్చన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఐదు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు ప్రజలు సామాజిక బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంతే కాదు తమ గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయతీ, ప్రభుత్వ ప్రైవేటు భవనాలు, నివాసాలలో పారిశుధ్య పనులు చేపట్టి తమ ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పచ్చదనాన్ని పెంచేందుకు జిల్లాలో 17 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా నిర్దేశించామని, పూర్తిస్థాయిలో మొక్కలు నాటి లక్ష్య సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను పరిశీలించాలని, ఇప్పటి వరకు నాటిన మొక్కలు ఎదుగుదల లేని ప్రదేశాల్లో మళ్లీ నాటాలన్నారు. ఇంటింటికీ సరఫరా అయ్యే తాగునీటిలో క్లోరిన్ శాతం పరిశీలించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల భారీన పడకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. గ్రామాల స్వరూపాన్ని మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలనే లక్ష్యంగా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రధానంగా యువతపై ఉందన్నారు. మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని నీటి నిల్వలు లేకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోలీసులు మొక్కలు నాటి వారి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమావేశం అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు విద్యార్థులు, గ్రామస్థులు, అధికారులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు డిక్షనరీలను బహుకరించారు. అంతకు ముందు గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పంచాయతీ కార్యదర్శి మాలతి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రమాకాంత్, డీఎల్‌పీవో గంగాభవాని, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో రఘుపతి, హెచ్‌ఎం అనంద్, మాజీ సర్పంచ్ ప్రేమలతపూర్ణచందర్, మహిళా సంఘాలు ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.

సందడిగా ‘స్వచ్ఛదనం - పచ్చదనం’

మడికొండ, ఆగస్టు 5 : గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనంపై స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలో తిరిగి పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

- న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. న్యూశాయంపేటలో సోమవారం కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ఐదు రోజుల పాటు జరుగుతుందన్నారు. డివిజన్ స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్ ఇంద్రసేన, జవాన్లు, ఆర్పీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.
- కాజీపేట: ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవిందర్ యాదవ్ అన్నారు. కాజీపేట సోమిడిలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవిందర్ యాదవ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. డివిజన్‌లో విరివిగా మెక్కలు నాటాలని స్థానికులకు సూచించారు. ఐదురోజుల వరకు ప్రతీ ఒక్కరు పరిసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ సోమిడిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఏఈ రామన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, పీఏసీఎస్ డైరెక్టర్ మెరుగు రాజయ్య యాదవ్ తోపాటు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.
- హనుమకొండ చౌరస్తా : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయ వంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. 10వ డివిజన్‌లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు సోమవారం స్థానిక డివిజన్ పరిధిలోని పద్మాక్షికాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని రాజ్‌పుత్‌వాడ, బెస్తవాడలో జీడబ్ల్యూఎంసీ అధికారులతో కలిసి పర్యటించి పలు సమస్యల పట్ల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఎంసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శోభనబోయిన కుమార్‌యాదవ్, రాకేష్, ఆశా వర్కర్లు, ఆర్పీలు, మునిసిపల్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 5: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయం ఆవణలో నిర్మాణం జరుగుతున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. ఐసీసీసీలో ఏర్పాటు చేస్తున్న మాడ్యూల్స్ గురించి అక్కడి ఏజెన్సీ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాని వారు చెప్పడంలో సంతృప్తి వ్యక్తం చేశారు. దానకిశోర్ వెంట బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సిబ్బంది ఉన్నారు.

మెట్టు రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మడికొండ, ఆగస్టు 5: శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై గల స్వయంభూ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మొదటి సోమవారం స్వామి వారికి అర్చకులు, భక్తులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం మహాన్నపూజ జరిపారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది భాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వార్షికోత్సవం

మడికొండ, ఆగస్టు 5: కాజీపేట మండలం మడికొండ, అయోధ్యపురం, తరాలపల్లి గ్రామాలలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం 21వ వార్షికోత్సవాన్ని కార్మికులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కాళేశ్వరపు రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఎగురవేసి మాట్లాడారు. అర్హులైన భవన నిర్మాణకార్మికులకే ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుడి కుటుంబ సభ్యులకు అందించే ఎక్స్‌గ్రేషియాను రూ.6లక్షల నుంచి రూ.10 లక్షలు పెంచాలన్నారు. అలాగే సహజ మరణం పొందిన కార్మికుడికి రూ. 5 లక్షలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి జెరిపోతుల సారంగపాణి, చిక్కుడు సాయిలు, గోనేల సతీష్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ ద్వారా క్యాడెట్లకు ఉజ్వల భవిష్యత్



ఎన్‌సీసీ క్యాడెట్లతో కల్నల్ రవికుమార్, ప్రిన్సిపాల్ చంద్రమౌళిగౌడ్

వడ్డెపల్లి, ఆగస్టు 5: ఎన్‌సీసీ శిక్షణ ద్వారా క్యాడెట్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవికుమార్ అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్)లో కల్నల్ రవికుమార్ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఆర్మీ యూనిఫామ్ వేసుకునే అదృష్టం లభించినందుకు మనమంతా గర్వపడాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళిగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ డాక్టర్ కల్పన, మేజర్ రమణారావు పాల్గొన్నారు.

దళితులకు రుణాలు మంజూరు చేయాలి



వినతి పత్రం సమర్పించిన కొండేటి శ్రీధర్

కాజీపేట, ఆగస్టు 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అంబేద్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు స్వయం ఉపాధి రుణాలు మంజూరుచేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ కాజీపేట తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రంలో ఎస్సీలకు శాశ్వత ఇళ్లు మంజూరుచేయాలి, ఏడాదికి వెయ్యి కోట్లు రుణాలు స్వయం ఉపాధికి ఇవ్వాలని, వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు బన్న ప్రభాకర్, నార్లగిరి రామలింగం, చాంద్‌పాష, కోవెల జీవన్, కాయిత రాజ్ కుమార్, మేకల శ్రావన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని టెక్నికల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మేకల అక్షయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించేలా కృషి చేయాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో నెలకొన్న విద్యార్థుల సమస్యల పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి..

కేయూ క్యాంపస్, ఆగస్టు 5: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ న్యూఢిల్లీ నుంచి ఈనెల 8న గురువారం హైదరాబాద్‌కు రానున్న సందర్భంగా ఎస్సీ, ఎస్టీ నేతలు, ఉద్యోగులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలుకుతామని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌లు తెలిపారు. సోమవారం కేయూ కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేశాయని చెప్పారు. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలోనే వర్గీకరణ సాధ్యమైందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ త్వరగా అమలు చేస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో కేయూ కో ఎడ్యుకేషన్ కళాశాల సూపరింటెం డెంట్ బొల్లెపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, నమిండ్ల కిరణ్‌కుమార్, సంగాల దయాకర్, బొక్క మొగిలి, దామెర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్.. స్టేషనరీ పంపిణీ

ఐనవోలు, ఆగస్టు 5: పున్నేలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ స్టేషనరీని అందజేశారు. దాత ముక్కెర అనిల్‌రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్(విజయ బయో ఫర్టిలైజర్స్) సోదరుడైన సురేష్‌రెడ్డి ద్వారా 120 మంది విద్యార్థులకు సుమారు రూ.15వేల విలువచేసే బుక్స్, స్టేషనరీని పంపిణీ చేయడంపై హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మాధవి, కార్యదర్శి అశోక్, కారోబార్ నిరంజన్, జన్ను రాజు, ఇల్లందుల రాజు, ఉపాధ్యాయులు యాకయ్య, అన్నారెడ్డి, ఇందిరా, వెంకటయ్య, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, సుభద్ర, విమల తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రవీందర్‌రావు, దళిత సంఘాల నాయకులు

ఐనవోలు, ఆగస్టు 5: టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఐనవోలులో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన సానుకూల తీర్పుపై ఆయన ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిందు కళాకారుల సంఘం నాయకులు గజ్వేల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్ ఆగస్టు 5: ఇటీవల ధర్మసాగర్ మండల కేంద్రంలో గుండె పోటుతో మృతిచెందిన గంగారపు ఆశీర్వాదం(53) కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం పరామర్శించారు. ఆశీర్వాదం మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రాజు, సత్యనారాయణ, ప్రదీప్ కుమార్, హిమాన్, లెనిల్, రమేష్, మండల మహిళా నాయకురాలు యామిని, మాజీ జడ్పీటీసీ వాసుదేవ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 5: ఇటీవల వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలలో హనుమకొండకు చెందిన అక్క చెల్లెలు అనపురం హాసిని స్వర్ణం, మిథునల కాంస్య పతకాలను కొల్లగొట్టారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీలలో అండర్-12 బాలికల కటాస్ విభాగంలో హాసిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించింది. అదే విధంగా అండర్-12 బాలికల కటాస్ విభాగంలో మిథున తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకంతో రాణించింది. ఈ మేరకు సోమవారం స్వర్ణ, కాంస్య పథకాలు సాధించిన వారిని వరల్డ్ ఫునకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజింగ్ ఇండియా ప్రెసిడెంట్ హసన్ ఇస్మాయిల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, అసోసియేషన్ బాధ్యులు, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.

సీఐ రాంరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్



మాట్లాడుతున్న చుంచు రాజేందర్

వడ్డెపల్లి, ఆగస్టు 5: హైదరాబాద్‌లోని సైబరాబాద్ పరిధి షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన దళిత మహిళ సునితపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ సీఐ రాంరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా తగిన చర్య తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన డీబీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబరాబాద్ పరిధి షాద్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన సునిత - భీమయ్య దంపతులను పోలీసులు ఓ దొంగతనం ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నారని అన్నారు. అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న నాగేందర్ అనే వ్యక్తి వీరిపై గత నెల 24న 26 తులాల బంగారం, రూ.2లక్షల నగదు పోయాయని షాద్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. నాగేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానం వ్యక్తం చేస్తూ సునిత అనే దళిత మహిళపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి శిక్షించారని, ఇందుకు బాధ్యులైన ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితోపాటు రఫీ, మోహన్‌లాల్, కరుణాకర్, అఖిలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

కేయూ క్యాంపస్, ఆగస్టు 5: ఈనెల 11న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవ పోస్టర్‌ను సోమవారం కేయూ రెండో గేటు వద్ద జై గౌడ్ ఉద్యమ నేతలు ఆవిష్కరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జై గౌడ్ ఉద్యమ వర్కింగ్ ప్రెసిడెంట్ సొల్తి కిరణ్‌గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మార్క రవిగౌడ్ హాజరై మాట్లాడారు. తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 జయంతి ఉత్సవాలను దిగ్విజయంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొనగాని యాదగిరి, జిల్లా అధ్యక్షుడు నకరికంటి మోహన్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగామ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి మోహన్, గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు, బీసీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, బుర్రా వెంకటనర్సయ్య, గిరికత్తుల సాయిబాబా, బలగాని రవీందర్, పంజాల జ్ఞానేశ్వర్, చిర్రరాజేశ్, చిర్ర రమేశ్, బొమ్మగాని వెంకటేశ్, శ్రీకాంత్, విప్లవ్, హరికృష్ణ, రాహుల్, రాజశేఖర్, సురేందర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతి ఉత్సవాలు నిర్వహించాలి

ఐనవోలు, ఆగస్టు 5: గీత కార్మికులు గ్రామ గ్రామాన పాపన్న జయంతి ఉత్సవాలు నిర్వహించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్యగౌడ్ అన్నారు. అమరుల యాదిలో చేపట్టిన గీతన్న చైతన్య యాత్రలో సోమవారం వనమాల కనపర్తి గ్రామంలో బాధిత కుటుంబాన్ని సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా మడ్డి నారాయణగౌడ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి స్మరించుకున్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. అమరుల యాదిలో భాగంగా యేటా ఆగస్టు 2నుంచి 18వరకు పాపన్న జయంతి ఉత్సవాలు నిర్వహిస్తూ అమరులను స్మరిస్తూ గీతన్న చైతన్య యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. బాధిత కుటుంబ సభ్యులైన ఎల్లేంద్ర, రాజుగౌడ్, ప్రవీణ్‌గౌడ్‌లను పరామర్శించగా ఈ కార్యక్రమంలో కాజీపేట అధ్యక్షుడు మోడెం రాజేందర్, ఐనవోలు అధ్యక్షుడు బత్తిని నాగరాజుగౌడ్, మాజీ సర్పంచ్ స్వర్ణరవి, కృష్ణమూర్తిగౌడ్, శేఖర్‌గౌడ్, భిక్షపతిగౌడ్, శ్రీనివాస్, దేవేందర్, గీత కార్మికులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

బాలసముద్రం, ఆగస్టు 5: హనుమకొండ బాలసముద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ప్రయివేటు కళాశాల యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కళాశాల యజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా డిగ్రీ కళాశాల అడ్మిషన్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు యజమాన్యంతో కుమ్మక్కై పట్టించుకోవడంలేదని అధికారులపై మండిపడ్డారు. తక్షణమే యజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కళాశాల నేంబోర్డులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, పీడీఎస్‌యూ టౌన్ కమిటీ సెక్రటరీ రాచకొండ రంజిత్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్, వేల్పుల చరణ్, కుమార్, జక్కుల భాను, మహేష్, శివ, వంశీకృష్ణ, కిరణ్, రాజేష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో ఐ బ్యాంక్‌కు చర్యలు

- సమయం పాటించని వారిపై చర్యలకు ఆదేశం
- రోగులకు భోజనం కోసం మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



ఆస్పత్రిలో తనిఖీ నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ మెడికల్, ఆగస్టు 5: ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో ఐ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ నగరంలోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిని సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగా లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి పరిశీలించారు. అనంతరం పేషెంట్లతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అలాంటప్పుడే వాటిని సులభంగా పరిష్కరించవచ్చని మంత్రి అన్నారు. ఫార్మసీ స్టాక్ గదిలో ఔషధ వివరాలను మంత్రి పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రిలో అవసరమైన అన్ని రకాల మందులు అందజేస్తున్నదని, ఎక్కడైనా సమన్వయ లోపం వల్ల మందులు సరైన సమయానికి పేషంట్లకు అందుతున్నాయా లేదా అన్న వివరాలు సైతం కనుక్కున్నారు.

సమయం పాటించని వారిపై చర్యలకు ఆదేశం

మంత్రి ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న సమయంలో డాక్టర్, ఇద్దరు సిబ్బంది లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో లేని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. డాక్టర్లు అందుబాటులో ఉండి సమయపాలన పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రోగులతో మర్యాదగా మెలగాలని సూచించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, బయో మెట్రిక్ అటెండెన్స్‌ను మంత్రి పరిశీలించారు. ఆస్పత్రి మొదటి అంతస్తును పరిశీలించి ఖాళీగా ఉంచకుండా రోగులకు వైద్య సేవలు అందించేందుకు వినియోగించాలని మంత్రి ఆదేశించారు.ఆస్పత్రిలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి వారానికోసారి కలెక్టర్ కంప్లెంట్ బాక్స్‌లో అందించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు పాత భవనం అయినందున వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గుడ్ ఫుడ్

అరటి ఆకుల్లో ఆరోగ్యం

అరిటాకులో భోంచేస్తాం. అరిటాకులో చుట్టి ఆవిరి మీద ఉడికించుకుంటాం. ఈ అలవాటులో ఎన్నో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. మరీ ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోని సంప్రదాయ వంటకాల్లో, పాకశాస్త్రంలో అరటి ఆకులు ప్రధాన పాత్రను పోషిస్తూ ఉంటాయి. ఇందుకు కారణం అరటిఆకుల్లో ఆరోగ్యాన్ని పెంచే పోషకాలు దాగి ఉండడమే! అయితే అరటిఆకుల్లోని సుగంధభరితమైన పాలిఫినాల్స్ మన శరీరానికి అందాలంటే అరటి ఆకుల్లో భోజనం చేస్తే సరిపోదు. ఆ ఆకుల్లో పదార్థాలను ఉంచి, ఆవిరి మీద ఉడికించాలి. అరటి ఆకులు కలిగి ఉండే మైనపు ఆకృతి, నిర్దిష్టమైన రుచి, అత్యధిక పీచు వల్ల అవి తినడానికి పనికిరాకపోవచ్చు. ఒకవేళ తిన్నా మన శరీరంలో సెల్యులోజ్ ఉండదు కాబట్టి ఆ ఆకులు జీర్ణం కావు. కాబట్టి అరటిఆకుల్లోని ఆరోగ్యకరమైన పోషకాలను పొందడం కోసం ఆ ఆకుల్లో పదార్థాలను వండుకునే విధానాన్ని అలవాటు చేసుకోవాలి. మోమోస్, మోదక్స్, చేపలు



మొదలైన పదార్థాలను ఆవిరి మీద వండి తినడానికి అరటి ఆకులు వీలుగా ఉంటాయి. గోవా, పార్సీ వంటకాలు ఎక్కువగా ఈ విధంగానే తయారవుతూ ఉంటాయి. చైనీస్ వంటకాల్లో కూడా కొన్ని మాంసపు రెసిపీలను అరటి ఆకుల్లోనే వండుతూ ఉంటారు. అయితే వంట కోసం ఉపయోగించే ఆకులు తాజాగా, లేతగా ఉండాలి. వాటిని శుభ్రం చేసి ఉపయోగించుకోవాలి.

ఆరోగ్య ప్రయోజనాలు

అరటి ఆకుల్లో వండిన వంటకాలకు మధుమేహంతో పోరాడే గుణాలు సమకూరతాయని పరిశోధనల్లో తేలింది. అలాగే అరటి ఆకుల్లో వండడం వల్ల ఆ ఆకుల నుంచి విడుదలయ్యే పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఆహారంలో కలుస్తాయి. దాంతో యాంటీఆక్సిడెంట్ ప్రయోజనాలను పొందవచ్చు. వీటి వల్ల మధుమేహం, కేన్సర్, గుండె జబ్బులకు కొంత మేరకు అడ్డుకట్ట వేయవచ్చు.

ఇలా వండుకోవచ్చు

అరటి ఆకుల్లో చుట్టిన పదార్థాలను గ్రిల్ చేసుకోవచ్చు. స్టీమ్, డీప్ ఫ్రై కూడా చేసుకోవచ్చు. కూరలు, అన్నం, కూరగాయలు వీటన్నిటినీ అరటి ఆకుల్లో చుట్టి వండుకోవచ్చు. ఇడ్లీ పాత్రల్లో అడుగున అరటి ఆకులను ఉంచి, పిండి నింపి ఇడ్లీలను వండుకోవచ్చు. ఇలా ఇడ్లీల కోసమే కాకుండా, ఢోక్లాలను కూడా ఆవిరి మీద వండుకోవచ్చు. గుజరాతి వంటకమైన పాంకి కోసం, అరటి ఆకుల మీద పాంకి పిండి పోసి, వేడి పెనం మీద నూనె వేసి కాల్చుకుంటారు. గ్రిల్ చేసిన తర్వాత ఆకులను తీసేసి పాల్కిలను తినొచ్చు. ఇలా గ్రిల్ చేయడం వల్ల అరటిఆకుల్లోని పోషకాలు వంటకంలోని చేరతాయి. వియత్నాంలో కూరగాయలు, బియ్యం, మాంసం వంటకాల తయారీ కోసం ఆయా పదార్థాలను అరటి ఆకుల్లో ఉంచి ఉడికిస్తారు. అలాగే బార్బిక్యూలో తయారీలో మ్యాట్‌గా కూడా అరటి ఆకులను వాడుకోవచ్చు.

థ్రాంబోసిస్

కాళ్లు నొప్పులు, వాపులు కనిపిస్తే, కాళ్లకు రెస్ట్ ఇవ్వాలి అనుకుంటాం. కానీ ఇవే లక్షణాలు రక్తనాళాల్లో రక్తపు గడ్డలకు కూడా సూచనలే! ఊహాకందని విషమ పరిస్థితికి దారితీసే ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు వైద్యులు.

ఆ వాపులు విషమం కావచ్చు



కాళ్లు వాస్తూ ఉంటాయి. నొప్పులు కూడా వేధిస్తూ ఉంటాయి. సాధారణంగా ఇలాంటి పరిస్థితిలో ఎక్కువ దూరం నడిచాం లేదంటే ఎక్కువ సేపు నిలబడి ఉన్నాం కాబట్టి కాళ్లు అలసిపోయి వాచి ఉంటాయనో, నొప్పి పెడుతున్నాయనో సరిపెట్టుకుంటూ ఉంటాం! వేడి నీళ్లలో కాళ్లను ముంచి ఉంచడం, కాపడం పెట్టడం లేదా నొప్పి మందులు వేసుకోవడం లాంటివి చేస్తూ ఉంటాం. కానీ ఈ సమస్యను 'థ్రాంబోసిస్'గా అనుమానించి వెంటనే వైద్యులను సంప్రతించాలి. కాళ్లలోని రక్తనాళాల్లో రక్తపు గడ్డలు ఏర్పడే పరిస్థితి ఇది. ఈ సమస్య నొప్పి, వాపుతో మొదలైనా పరిస్థితి తీవ్రమయ్యే కొద్దీ నడక కష్టమవుతుంది. కాలు నీలం రంగులోకి మారిపోతుంది. మరింత ఆలస్యం చేస్తే, రక్తనాళంలో ఏర్పడిన రక్తపు గడ్డ పగిలి, ఊపిరితిత్తులకు చేరుకుని 'పల్మొనరీ ఎంబాలిజం' అనే ప్రాణాంతక పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో ఊపిరితీసుకోలేకపోవడం, వేగంగా ఊపిరితీసుకుంటూ ఉండడం, గుండెవేగం పెరగడం, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.



అపోహలు - వాస్తవాలు

థ్రాంబోసిస్‌కు గురైనవాళ్లు పూర్తిగా బెడ్‌రెస్ట్‌కే పరిమితం కావాలని అనుకుంటూ ఉంటారు. కానీ ఇది అపోహ మాత్రమే! ఎక్కువ వాపు ఉంటే రెండు మూడు రోజుల పాటు విశ్రాంతి తీసుకుని, చికిత్స పూర్తయిన వెంటనే నడవడం మొదలుపెట్టాలి. నడవడం వల్ల రక్తపు గడ్డ ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుందని అనుకుంటారు. కానీ నిజానికి రక్తపు గడ్డ కాలికే పరిమితం కావాలంటే బెడ్‌రెస్ట్ తగ్గించి, నడుస్తూ ఉండాలి.

వీళ్లకే ముప్పు ఎక్కువ

రక్తపు గడ్డలు ఏర్పడే లక్షణం వంశపారంపర్యంగా సంక్రమించిన వ్యక్తులు, ఊబకాయులు, గర్భంతో ఉన్నప్పుడు బరువు పెరిగే మహిళలు, తుంటి, మోకీళ్ల మార్పిడి చేయించుకున్న వ్యక్తులు, కేన్సర్ రోగులు, తీవ్ర గాయాల బారిన పడినవాళ్లు, గుండెపోటు లాంటి ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిపాలైనవాళ్లు డీప్ వెయిన్ థ్రాంబోసిస్‌కు గురవుతూ ఉంటారు.

చికిత్స తీవ్రత ఆధారంగా...

కాళ్లు, చేతుల్లో థ్రాంబోసిస్‌లను అల్ట్రాసౌండ్, కలర్ డాప్లర్‌తో నిర్ధారించుకోవచ్చు. డీడైమర్ అనే రక్తపరీక్షతో కూడా ఈ సమస్యను నిర్ధారించుకోవచ్చు. మెదడులో రక్తపు గడ్డలను ఎమ్మారైతో, పొట్టలో ఏర్పడిన రక్తపు గడ్డను సిటి స్కాన్‌తో, ఒకవేళ రక్తపు గడ్డ ఊపిరితిత్తుల్లో చేరుకుందని అనుమానం వస్తే సిటి యాంజియోతో వైద్యులు నిర్ధారించుకుంటారు. థ్రాంబోసిస్ ఉన్నవాళ్లకు యాంటీ కాగ్యులెంట్(రక్తాన్ని పలుచన చేసే మందులు) మందుల వాడకం వెంటనే మొదలుపెట్టవలసి ఉంటుంది. తర్వాత అందించే చికిత్స రోగి వ్యక్తి, సమస్య తీవ్రతల ఆధారంగా కొనసాగించవలసి ఉంటుంది.

- స్వల్ప సమస్య: కాళ్లలో థ్రాంబోసిస్ సమస్య స్వల్పంగా ఉండే, యాంటీ కాగ్యులెంట్స్‌తో పాటు స్టాకింగ్స్ వాడుకోవలసి ఉంటుంది.
- తీవ్ర సమస్య: రక్తపు గడ్డను తొలగించే సర్జరీ చేయవలసి ఉంటుంది. వెయిన్‌లోకి చేరుకుని, రక్తపు గడ్డను కరిగించే మందును ఇంజెక్ట్ చేయడం, క్యాథెటర్ ద్వారా రక్తపు గడ్డను పీల్చి బయటకు రప్పించడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చు. సర్జరీ తర్వాత కూడా ఆరు నెలల పాటు యాంటీ కాగ్యులెంట్స్ వాడుకోవలసి ఉంటుంది. స్టాకింగ్స్ కూడా వాడుకోవలసి ఉంటుంది. సర్జరీ తర్వాత, పోస్ట్ థ్రాంబాటిక్ సింద్రోమ్ సమస్య తలెత్తదు.
- సర్జరీ తర్వాత: వైద్యులు సూచించినంత కాలం యాంటీ కాగ్యులెంట్స్, స్టాకింగ్స్ వాడుకోవాలి. ఇతరత్రా వైద్య సమస్యల కోసం వైద్యులను కలిసినప్పుడు థ్రాంబోసిస్ సమస్యను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.

ముందుచూపుతో...

అప్పటికే థ్రాంబోసిస్ సమస్య ఉండి, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో ఐసియులో చేరవలసి వచ్చినవాళ్లు, సర్జరీ చేయించుకోబోతున్నవాళ్లు, ఊబకాయులు, కుటుంబ చరిత్రలో థ్రాంబోసిస్ ఉన్నవాళ్లు ముందస్తుగానే వైద్యులకు ఆ విషయాన్ని తెలియపరచాలి. ఇలా చేయడం వల్ల తర్వాతి కాలంలో థ్రాంబోసిస్ తలెత్తకుండా వైద్యులు అవసరమైన నివారణ చర్యలను చేపడతారు. ఈ కోవకు చెందిన వాళ్లు థ్రాంబోసిస్ బారిన పడకుండా ఉండడం కోసం సరిపడా నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. డయేరియాకు గురి కాకుండా చూసుకోవాలి.

నివారణ మన చేతుల్లోనే

- బరువును నియంత్రణలో ఉంచుకోవడం
- కుటుంబ చరిత్రలో థ్రాంబోసిస్ ఉన్నవాళ్లు ఆ సమస్యను వైద్యుల దృష్టికి తీసుకువెళ్లడం
- డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవడం
- కాళ్ల వాపులు, నొప్పులను నిర్లక్ష్యం చేయకపోవడం

విమాన ప్రయాణాల్లో...

థ్రాంబోసిస్ సమస్య ఉన్నవాళ్లు నాలుగు గంటలకు మించి విమాన ప్రయాణాలు చేసే సమయాల్లో థ్రాంబోసిస్ తలెత్తే అవకాశాలుంటాయి. కాబట్టి 60 ఏళ్ల వయసున్న థ్రాంబోసిస్ ముప్పు ఉన్న వ్యక్తులు ట్రావెల్ స్టాకింగ్స్ వాడుకోవడం తప్పనిసరి. మద్యం తీసుకోకూడదు. నీళ్లు ఎక్కువగా తాగుతూ ఉండాలి. అలాగే విమాన ప్రయాణం చేస్తున్నంత కాలం తరచూ లేచి నడుస్తూ ఉండాలి.

పోస్ట్ థ్రాంబాటిక్ సింద్రోమ్

థ్రాంబోసిస్ సమస్యను చికిత్సతో సరిదిద్దిన తర్వాత కాళ్లలో తలెత్తే వీలున్న సమస్య ఇది. కాళ్లలో వాపు, రంగు మారడం, కాలిగిలకలు నల్లబడడం, పుండు ఏర్పడడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య తలెత్తకుండా ఉండడం కోసం వైద్యులు సూచించినంత కాలం స్టాకింగ్స్ వాడుకోవాలి.

కాళ్లతో పాటు చేతుల్లో కూడా థ్రాంబోసిస్ తలెత్తవచ్చు. అప్పుడు కూడా వాపు, నొప్పి ఉంటాయి. ఇదే సమస్య పొట్టలో ఏర్పడితే పొట్టలో నొప్పి, వాపు కనిపిస్తాయి. ఇదే సమస్య మెదడులో కూడా ఏర్పడవచ్చు. ఇలాంటప్పుడు తీవ్రమైన తలనొప్పి ప్రధాన లక్షణంగా ఉంటుంది.



• డాక్టర్ పి.సి. గుప్తా,
- క్లినికల్ డైరెక్టర్,
హెచ్ఓడి వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ,
కేర్ హాస్పిటల్స్, హైదరాబాద్.

కాంటాక్ట్ లెన్సెస్ ఇలా...

కాంటాక్ట్ లెన్స్ వాడకం పెరుగుతోంది. అయితే తగిన జాగ్రత్తలు పాటించకపోతే కార్నియా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటినెలా సురక్షితంగా వాడుకోవాలో తెలుసుకుందాం!



- **చేతుల శుభ్రత** : కాంటాక్స్ లెన్స్ పెట్టుకోబోయే ముందు, తొలగించే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. కాంటాక్ట్ లెన్స్‌లను కళ్లలో ఉంచేసుకుని నిద్రపోకూడదు.
- **లెన్స్ శుభ్రత**: కాంటాక్ట్ లెన్సెస్ తొలగించిన తర్వాత, వాటిని కాంటాక్ట్ లెన్స్ సొల్యూషన్‌తో శుభ్రం చేసుకోవాలి. ఆ సొల్యూషన్‌ను ప్రతి రోజూ మారుస్తూ ఉండాలి. కాంటాక్ట్ లెన్స్‌లను ప్రతిరోజూ వాడినా, వాడకపోయినా, వాటిని శుభ్రపరిచే సొల్యూషన్‌ను ప్రతి రోజూ మారుస్తూనే ఉండాలి.
- **మేకప్‌కు ముందు**: మేకప్‌ను అప్లై చేయక ముందే కాంటాక్ట్ లెన్స్ పెట్టుకోవాలి. అలాగే మేకప్ తొలగించిన తర్వాతే లెన్స్‌ను తొలగించాలి. కనుకొలకల్లో గ్లిట్టర్, ఐలైనర్‌లను వాడుకోకూడదు.
- **పరిమితి మేరకే**: వైద్యులు సూచించినంత సమయం మేరకే కాంటాక్ట్ లెన్స్ ధరించాలి. అలాగే ఒక జత కళ్లజోడును ఎప్పుడూ వెంట ఉంచుకోవాలి.
- **కళ్ల ఇరిటేషన్**: కళ్లు మండుతున్నా, దురదలుగా ఉన్నా కాంటాక్ట్ లెన్స్ పెట్టుకోకూడదు. కాంటాక్ట్ లెన్స్ పెట్టుకున్న వెంటనే కళ్లు ఎర్రబడి, చూపు మసకబారితే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.



బ్లాక్ మండే

రూ.15.32 లక్షల కోట్ల సంపద ఉఫ్

చిన్న, మధ్య స్థాయి షేర్లు విలవిల

ప్రపంచ మార్కెట్లతో పాటు కుప్పకూలిన దేశీయ స్టాక్ సూచీలు

- సెన్సెక్స్ 2,222 పాయింట్లు పతనం
- 79,000 దిగువ స్థాయికి సూచీ
- 662 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- 24,000 స్థాయికి ఇండెక్స్



- 4.21% క్షీణించిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ 3.6 శాతం డౌన్
- 2 రోజుల్లో రూ.19 లక్షల కోట్లు ఫట్
- అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు, జపాన్ వడ్డీ పోటే ప్రధాన కారణాలు
- 12.4 శాతం పడిన జపాన్ నిక్కీ ఇండెక్స్

మహోత్పాతానికి కారణాలు

- గత వారం అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల కల్పన గణాంకాలు అత్యంత నిరాశాజనకంగా ఉండటంతో పాటు ఆ దేశ తయారీ రంగ పనితీరు భారీగా క్షీణించడం వంటి అంశాలు, అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నదన్న ఆందోళనలు ఈక్విటీ ఇన్వెస్టర్లను కుదిపేశాయి. దాంతో గత శుక్రవారం నుంచే ప్రపంచ మార్కెట్లలో అమ్మకాలు పెరిగాయి.
- జపాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రామాణిక వడ్డీ రేట్లను 0.25 పెంచడం అక్కడి యెన్ క్యారీ ట్రేడింగ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్వెస్టర్లు యెన్ క్యారీ ట్రేడ్‌లను పెద్దఎత్తున ఉపసంహరించుకోవడంతో జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ సోమవారం ఏకంగా 12.40 శాతం క్షీణించింది. నిక్కీ ఈ స్థాయిలో పతనమవడం 1987 నాటి బ్లాక్ మండే తర్వాత మళ్లీ ఇదే తొలిసారి. క్యారీ ట్రేడ్‌లో తక్కువ వడ్డీకి లభించే దేశంలో లేదా కరెన్సీలో రుణం తీసుకుని ఇతర మార్కెట్లలో అధిక రిటర్నులు పంచే ఆర్థిక సాధనాల్లో (ఈక్విటీలు, బాండ్లు, కమోడిటీలు) పెట్టుబడులు పెడుతుంటారు. ప్రపంచంలో క్యారీ ట్రేడ్‌కు అత్యంత ప్రాచుర్య కరెన్సీ యెన్. ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేటు పెంచడంతో పెట్టుబడులు గిట్టుబాటు కాని పరిస్థితి. దాంతో క్యారీ ట్రేడ్‌లను ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున రద్దు చేసుకుంటుండటం జపాన్‌తో పాటు ప్రపంచ మార్కెట్లపై ఒత్తిడిని మరింత పెంచింది.
- పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కూడా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లను కలవర పెడుతున్నాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ యుద్ధానికి సిద్ధమవుతుండటం కూడా మార్కెట్లకు ప్రతికూలంగా పరిణమించింది.
- భారత మార్కెట్లు జీవితకాల గరిష్ఠ స్థాయిలో ట్రేడవుతున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్త చర్యగా పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.

ముంబై: ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ ప్రామాణిక సూచీలు సోమవారం భారీ పతనాన్ని చవిచూశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 79,000 దిగువ స్థాయికి జారుకోగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 24,000 వద్దకు పడిపోయింది. ఒక దశలో సెన్సెక్స్ 2,686.09 పాయింట్లు (3.31 శాతం) క్షీణించి 78,295.86 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 2,222.55 పాయింట్ల (2.74 శాతం) నష్టంతో 78,759.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒక సమయంలో 824 పాయింట్లు (3.33 శాతం) పతనమై 23,893.70 వద్దకు జారుకుంది. చివర్లో కాస్త తేరుకుని 662.10 పాయింట్ల (2.68 శాతం) నష్టంతో 24,055.60 వద్ద క్లోజైంది. సూచీలకిది నెల రోజులకు పైగా కనిష్ఠ ముగింపు స్థాయి. అంతేకాదు, ఈ జూన్ 4 తర్వాత అతిపెద్ద ఒక్కరోజు నష్టమిది. గత శుక్రవారం కూడా సూచీలు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. గడిచిన రెండు సెషన్లలో దాదాపు 4 శాతం క్షీణించాయి. అన్ని రంగాలు, విభాగాల షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు తగ్గి రూ.441.84 లక్షల కోట్లకు పడిపోయింది. గడిచిన రెండు సెషన్లలో రూ.19 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా మినహా అన్నీ నేలచూపులు చూశాయి. టాటా మోటార్స్ షేరు ఏకంగా 7.32 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అదానీ పోర్ట్స్ 5.93 శాతం, టాటా స్టీల్ 5.31 శాతం నష్టపోగా.. ఎస్‌బీఐ, పవర్‌గ్రిడ్, మారుతి సుజుకీ, జేఎస్ డబ్ల్యూ స్టీల్ షేర్లు 4 శాతానికి పైగా పతనమయ్యాయి.
- బ్లూచిప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని మిడ్‌క్యాప్ సూచీ 3.60 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 4.21 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలూ నష్టాలు చవిచూశాయి. సర్వీసెస్ ఇండెక్స్ అత్యధికంగా 4.56 శాతం తగ్గింది. యుటిలిటీస్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్ సైతం 4 శాతానికి పైగా నష్టపోయాయి. పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్ 3 శాతానికి పైగా పతనమయ్యాయి.
- మార్కెట్ ఊగిసలాటల తీవ్రతకు సంకేతమైన ఇండియా వీఐఎక్స్ సూచీ 42 శాతం పెరిగి 20.37కు చేరింది. ఒక దశలో సూచీ తొమ్మిదేళ్ల గరిష్ఠ స్థాయి 52 శాతం వరకు పెరిగింది.
- బీఎస్ఈలో 4,189 షేర్లు ట్రేడవగా.. 3,446 నష్టపోయాయి. 638 లాభపడగా.. 105 యథాతథంగా ముగిశాయి. 64 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠ స్థాయిని, 4 లోయర్ సర్క్యూట్‌ను తాకాయి.

మార్కెట్ దారెటు..?

అంతర్జాతీయ ప్రతికూలతల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్లలో ఒడుదొడుకులు స్వల్పకాలం పాటు కొనసాగవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దీర్ఘకాలికంగా చూస్తే మాత్రం భవిష్యత్ సానుకూలంగానే కన్పిస్తోందన్నారు. ఆర్‌బీఐ పరపతి సమీక్ష, అమెరికా ఐఎస్ఎం సర్వీసెస్ ఇండెక్స్, జపాన్ యెన్ క్యారీ ట్రేడ్ అన్‌వైండింగ్ అంశాలు మార్కెట్లను ప్రభావితం చేయవచ్చన్నారు. ప్రస్తుతం ఆకర్షణీయ ధరలకు లభించే స్టాక్స్‌లో దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులకు ప్రస్తుత కరెక్షన్ ఉపయోగపడనుందని వారు అభిప్రాయపడ్డారు.

ప్రపంచ మార్కెట్ల నష్టాలు

ఖండం	ప్రామాణిక సూచీ	నష్టం(%)
అమెరికా	డోజోన్స్	2.28
	ఎస్ అండ్ పీ 500	2.71
	నాస్‌డాక్	3.28
యూరప్	ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	2.04
	సీఏసీ (ఫ్రాన్స్)	1.42
	డాక్స్ (జర్మనీ)	1.82
ఆసియా	షాంఘై కాంపొజిట్ (చైనా)	1.54
	నిక్కీ 225 (జపాన్)	12.40
	హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	1.46
	కోస్పీ (ద.కొరియా)	8.77
	తైవాన్ వెయిటెడ్ (తైవాన్)	8.35

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికా డాలర్‌తో రూపీ మారకం విలువ ఒక్కరోజే 37 పైసలు క్షీణించింది. దాంతో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 84.09కు ఎగబాకింది. అంటే, ఒక డాలర్ విలువ మన కరెన్సీలో రూ.84.09కి పెరిగిందన్నమాట. డాలర్ విలువ రూ.84 స్థాయిని దాటడం ఇదే తొలిసారి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో భారీ నష్టాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో పాటు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా ఆర్థిక మాంద్య భయాలు ఇందుకు కారణమయ్యాయి.

బోనస్ షేర్లకు టీ+2 విధానం: సెబీ

న్యూఢిల్లీ: బోనస్ షేర్ల జారీ, ట్రేడింగ్ సమయాన్ని సంస్కరించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం బోనస్ షేర్ల రికార్డు తేదీ నుంచి రెండు రోజుల్లో (టీ+2) ఆ షేర్లు మదుపరుల ఖాతాల్లో పడి ట్రేడింగ్‌కు అనువుగా ఉండాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై మార్కెట్ వర్గాలు ఈ నెల 26లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. ప్రస్తుతం బోనస్ షేర్లు ప్రకటించిన తర్వాత అవి వాటాదారుల ఖాతాల్లో పడేందుకు రెండు నుంచి వారం రోజుల సమయం పడుతోంది. దీన్ని రెండు రోజులకు కుదించాలని సెబీ భావిస్తోంది.

ఎంఎఫ్‌ల ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లో జరిగే ఫ్రంట్ రన్నింగ్, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు చెక్ పెట్టేందుకూ సెబీ చర్యలు చేపట్టింది. ఇందుకోసం అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) స్పష్టమైన వ్యవస్థీకృత విధానం ఏర్పాటు చేసుకోవాలని కోరింది. దీనికి తోడు ఏఎంసీల్లో జరిగే ఇన్‌సైడర్ ట్రేడింగ్, ఫ్రంట్ రన్నింగ్‌లను బహిర్గతం చేసే విజిల్ బ్లోయర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరింది. ఇందుకు ఏఎంసీల సీఈఓలు లేదా ఎండీలు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేసింది. యాక్సిస్ ఏఎంసీ, ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఫ్రంట్ రన్నింగ్ జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో సెబీ ఈ చర్యలు తీసుకుందని భావిస్తున్నారు. ఈ రెండు విధానాలు ఈ ఏడాది నవంబరు 1 నుంచి అమల్లోకి వస్తాయని సెబీ తెలిపింది.

బిజినెస్

నవంబరు 14 నుంచి ఇండిగోలో బిజినెస్ క్లాస్

న్యూఢిల్లీ: ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానాల్లో నవంబరు 14 నుంచి బిజినెస్ క్లాస్ అందుబాటులోకి రానుంది. 12 దేశీయ రూట్లలో ఈ క్లాస్‌ను ప్రవేశపెడతారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ 18వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం ఈ ప్రకటన చేసింది. చౌక ధరల విమానయాన సంస్థ అనే పేరు నుంచి బయటపడడం, లాయల్టీ కార్యక్రమం ప్రవేశపెట్టడం, 2027 నుంచి ఏ350 వైడ్ బాడీ విమానాలు ప్రవేశపెట్టడం వైపు అడుగులు వేస్తున్నట్టు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ చెప్పారు. మంగళవారం నుంచి బిజినెస్ క్లాస్ సీట్ల బుకింగ్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు ప్రత్యేక స్పెషల్ మీల్స్ కూడా అందచేయనున్నామన్నారు. ఏ321 నియో విమానాల్లో 12 సీట్లను బిజినెస్ క్లాస్‌కు కేటాయిస్తామని, 3 వరుసల్లో 4 సీట్ల వంతున ఆ క్లాస్‌కు ప్రత్యేకంగా ఉంచుతామని ఎల్బర్స్ తెలిపారు. బిజినెస్ క్లాస్‌లో ఒక వైపు ప్రయాణ చార్జీ రూ.18,018 నుంచి ప్రారంభమవుతుందని పీటర్ వెల్లడించారు.

ఎయిర్‌టెల్ లాభం రూ.4,160 కోట్లు

న్యూఢిల్లీ: టెలికాం ఆపరేటర్ భారతి ఎయిర్‌టెల్ కన్సాలిడేటెడ్ లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (క్యూ1)లో రెండింతలు పెరిగి రూ.4,160 కోట్లకు చేరింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఆర్పు) పెరగడంతో పాటు రూ.735 కోట్ల అసాధారణ లాభం జత కావడం ఇందుకు దోహదపడినట్టు కంపెనీ వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.1,612.5 కోట్లు. అలాగే కన్సాలిడేటెడ్ ఆదాయం 2.8 శాతం పెరిగి రూ.37,440 కోట్ల నుంచి 38,506.4 కోట్లకు చేరింది. అయితే కన్సాలిడేటెడ్ వ్యయం 23.44 శాతం క్షీణించి రూ.8,007 కోట్లకు పరిమితమైంది. కాగా భారత్‌లో పెట్టుబడి వ్యయం 27 శాతం క్షీణతతో రూ.9,327 కోట్ల నుంచి రూ.6,781 కోట్లకు తగ్గిందని పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,380 ▼	64,500 ▼	91,000 ▲
ముంబై	69,117 ▼	63,311 ▼	78,950 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	430
వరంగల్	422	గోదావరి	423
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	80	విజయవాడ	92
వరంగల్	80	గుంటూరు	92
కరీంనగర్	80	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	87
కర్నూలు	80	నెల్లూరు	87
విశాఖపట్నం	86	అనంతపురం	92
గోదావరి	92		

దిక్సూచి DIKSUCHI

కాళోజీ అనుబంధ కళాశాలల్లో / అడ్మిషన్స్

ఎంబీబీఎస్, బీడీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)- అనుబంధ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ యూజీ 2024 స్కోర్, వెబ్ ఆప్షన్స్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు తెలంగాణ పరిధిలో చదువుకున్నవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; ఓసీ దివ్యాంగులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు తప్పనిసరి.

- నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకుగాను జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127; ఓసీ దివ్యాంగులకు 144 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. లేనిపక్షంలో కౌన్సెలింగ్‌కు అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.3500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2900
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 13
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in, tsmedadm.tsche.in

ఎండీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)-ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ డెంటల్ కళాశాలలు, ఆర్మీ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ ఎండీఎస్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కళాశాలలు, సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు.

అర్హత: తెలంగాణ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన డెంటల్ కళాశాల నుంచి బీడీఎస్/తత్సమాన డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ)/స్టేట్ డెంటల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. నీట్-ఎండీఎస్ 2024లో అర్హత పొంది ఉండాలి.

- నీట్ ఎండీఎస్ 2024 కటాఫ్: మొత్తం 800 మార్కులకుగాను జనరల్ అభ్యర్థులకు 263; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 230; ఓసీ దివ్యాంగులకు 246 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/xGuay9kలో చదవండి.

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్



ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అర్హతలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్థ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ ఆఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.

స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

నవ్య | చిత్రజ్యోతి



అద్భుతమైన విజువల్స్‌తో 'చుట్టమల్లే'

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారస్థాయిలో పెంచాయి. సోమవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. 'చుట్టమల్లే' అంటూ సాగే ఈ రొమాంటిక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, అద్భుతమైన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, శిల్పా రావ్ ఆలపించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం, బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీ అందించారు. కాగా, 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది.

పతాక సన్నివేశాల చిత్రీకరణ




అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పుష్ప 2'. డైరెక్టర్ సుకుమార్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సీక్వెల్‌ను 'పుష్ప పార్ట్ 1'ను మించి ఉండేలా ప్రతీ విషయంలో జాగ్రత్త పడుతున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, రెండు పాటలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. చిత్రీకరణను దాదాపు పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం, ఈ సినిమాకు సంబంధించిన క్లైమాక్స్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన ఓ భారీ సెట్‌లో జరుగుతోంది. ఈ సెట్‌లో అల్లు అర్జున్‌తో పాటు ఇతర కీలక తారాగణం పాల్గొంది. ఈ క్లైమాక్స్ ఎపిసోడ్ థియేటర్స్‌లో గూస్‌బంప్స్ తెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. డిసెంబరు 6న సినిమా విడుదల కానుంది.

మళ్లీ కలసి నటిస్తారా?



ప్రభాస్, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపుదిద్దుకోనున్న 'స్పిరిట్' చిత్రం స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది చివరిలో షూటింగ్ మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరా అనే చర్చ చాలా రోజులుగా జరుగుతోంది. తాజాగా త్రిష పేరు వినిపిస్తోంది. ఆమెతో దర్శకుడు సందీప్ మాట్లాడారనీ, ఆమె కూడా ఓకే చెప్పారనీ సమాచారం. ప్రభాస్, త్రిష కాంబినేషన్‌లో 'వర్షం', 'పౌర్ణమి', 'బుజ్జిగాడు' చిత్రాలు వచ్చాయి. 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ జంట 'స్పిరిట్‌'లో కలసి నటించనున్నారన్నమాట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో త్రిష నటిస్తున్నారు.

రెండు భాగాలుగా విజయ్ సినిమా




విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'వీడీ 12'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని సూర్య దేవరనాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాలో విజయ్ లుక్‌ను రిలీజ్ చేశారు. కంప్లీట్ రఫ్ లుక్‌లో ఉన్న విజయ్‌ను చూసి బ్లాక్‌బస్టర్ హిట్ ఖాయం అని అభిమానులు సినిమాపై అంచనాలు పెంచేసుకున్నారు. తాజాగా, జరిగిన ఓ మీడియా సమావేశంలో చిత్ర నిర్మాత ఈ సినిమా ఓ గురించి ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. "గౌతమ్ తిన్ననూరి, విజయ్ కలియకలో తెరకెక్కే సినిమా కోసం దర్శకుడు అద్భుతమైన కథను రాసుకున్నారు. రెండు భాగాలకూ సరిపడా కంటెంట్ ఆయన రాసిన కథలో ఉంది . మొదటి భాగం ఫలితాన్ని బట్టి రెండో భాగం తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తాం" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 28న విడుదల కానుంది.



సినిమా చెట్టు నేలకు ఒరిగింది

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది.' అంటూ అక్కినేని,సావిత్రి జంటగా నటించిన మూగ మనసులు' (1964) చిత్రంలో జమున పాడిన పాట మీకు గుర్తుంది కదూ. ఆ పాట ఎక్కడ తీశారో తెలుసా? తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఏటిగట్టుపై ఉన్న చెట్టు, పరిసర ప్రాంతాల్లో. అప్పటినుంచి దశాబ్దాలుగా ఈ వృక్షరాజం నీడన ఎన్నో చిత్రాల షూటింగ్స్ జరిగాయి. హీరో కృష్ణ నటించిన 'పాడిపంటలు', చిత్రంలో 'ఇరుసులేని బండి.. ఈశ్వరుని బండి' పాటలోనూ ఈ చెట్టు ప్రముఖంగా కనిపిస్తుంది. అక్కినేని నటించిన 'సీతారామయ్య గారి మనవరాలు' చిత్రంలో 'సమయానికి తగు మాటలాడి' పాటను కూడా ఈ చెట్టు దగ్గరే చిత్రీకరించారు. కళాతపస్వి విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' నుంచి లేటెస్ట్‌గా రామ్‌చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' చిత్రం వరకూ మొత్తం 108 చిత్రాల్లోనూ కనిపించి, తనదైన పాత్ర పోషించింది. అగ్ర దర్శకులు, దాసరి, కె.రాఘవేంద్రరావు, జంధ్యాల, ఈవీవీ.. ఈ చెట్టు చుట్టూ తిరిగిన వారే. తమ సినిమాల్లో ఒక్క సీన్ అన్నా అక్కడ తీసేవారు. ఇక దర్శకుడు వంశీ సంగతి చెప్పనక్కర్లేదు. మొత్తం 18 చిత్రాల షూటింగ్స్‌ను ఆయన ఈ చెట్టు దగ్గరే తీశారు. ఈ ప్రాంతానికి వస్తే వంశీ తన మిత్రులతో కలిసి ఈ చెట్టు కింద కూర్చుని భోజనం కూడా చేసేవారని గ్రామస్తులు చెబుతున్నారు. అలా కాలక్రమంలో ఈ చెట్టుకు 'సినిమా చెట్టు' అనే పేరు వచ్చింది. ఈ చెట్టు వద్ద సినిమాలో ఒక్క షాట్ తీసినా సినిమా హిట్ అవుతుందనే నమ్మకం సినీ పరిశ్రమలో ఉంది అందుకే అగ్ర హీరోలు, దర్శకులు ఇక్కడి వచ్చి తమ సినిమాల్లో ఏదో ఒక సన్నివేశంలో 'సినిమా చెట్టు' కనిపించాలని ప్లాన్ చేసేవారు. మధ్యాహ్నం వేళలో ఈ చెట్టు కొమ్మలకు ఊయల కట్టి ఊగుతుంటే కింద గలగల పారే గోదావరి, చుట్టూ ప్రశాంత వాతావరణం... తన్మయత్వంతో శరీరం పులకరించిపోతుంది.



ఇంత చరిత్ర కలిగిన ఈ చెట్టు ఇప్పుడు నేలకొరిగింది. గోదావరి వరదలు, అధిక వర్షాలకు చెట్టు రెండుగా చీలి నేలకూలింది. గోదావరి వరద ఉధృతి వల్ల సినిమా చెట్టుకు ప్రమాదం పొంచి ఉందని, రక్షణ వలయం ఏర్పాటు చేసి పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు ఎన్నో సార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చివరకు అందరూ ఊహించినట్లుగానే జరిగింది. సోమవారం తెల్లవారుజామున సినిమా చెట్టు నేలకు ఒరిగిపోయింది.

నూట యాభై సంవత్సరాల చరిత్ర

ఈ సినిమా చెట్టు చరిత్ర, సెంటిమెంటు మాటల్లో చెప్పలేనిది. 150 సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన శింగలూరి తాతబ్బాయి అనే వ్యక్తి నిద్ర గన్నేరు చెట్టు (సినిమా చెట్టు) నాటినట్లు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ చెట్టును కుమారదేవం గ్రామ ప్రజలు సంరక్షించుకుంటూ వస్తున్నారు. గోదావరి వరదలు వచ్చినప్పుడల్లా ఏటిగట్టు కోతకు గురవుతుంది. ఆ కోత చెట్టుకు ముప్పుగా మారింది. గత జూలై నెల 19వ తేదీ నుంచి గోదావరి నదికి వచ్చిన వరదలు, అధిక వర్షాలకు ఏటిగట్టు నానిపోయి ఉంది. దీంతో సోమవారం తెల్లవారు జామున సినిమా చెట్టు రెండు ముక్కలుగా వీడి కూలిపోయింది. ఇది నిద్ర గన్నేరు చెట్టు అయినప్పటికీ దీని కొమ్మలు గోదావరిలోకి పెరిగి ఉంటాయి. గోదావరి వరద పోటు, అధిక వర్షాలవల్లే ఈ చెట్టు కూలిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సినిమావాళ్లకు సెంటిమెంటుగా మారి గ్రామానికి పేరు తెచ్చిన ఈ చెట్టును కాపాడుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్నో వరదల్ని, తుఫానుల్ని తట్టుకుని తరతరాలను చూసుకుంటూ కుమారదేవం గ్రామానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఈ సినిమా చెట్టు కూలిపోవడం ప్రకృతి ప్రేమికులను, గ్రామస్తులను ఆవేదనకు గురిచేస్తోంది.

కొవ్వూరు, (ఆంధ్రజ్యోతి)

స్వేచ్ఛ కోసం చేసే పోరాటం



తమిళ నటుడు విక్రమ్ నటించిన పీరియాడికల్ యాక్షన్ చిత్రం 'తంగలాన్'. పా.రంజిత్ దర్శకత్వంలో కే.ఈ.జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విక్రమ్, మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు మీడియాతో ముచ్చటించారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా కథ ప్రపంచంలో ప్రతీ ఒక్కరికీ రిలేట్ అవుతుంది. ఈ సినిమా కథ బంగారం వేట చుట్టూ తిరిగినా.. ఇందులో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం కూడా కీలకమే. ఈ సినిమా థియేటర్లలో చూసే వాళ్లని కచ్చితంగా ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు. హీరోయిన్ మాళవిక మోహనన్ మాట్లాడుతూ "నటిగా నన్ను ప్రూవ్ చేసుకునే పాత్రల కోసం వెతికేప్పుడు ఈ సినిమా కథ నా దగ్గరికి వచ్చింది. ఇందులో ఆరతి అనే అమ్మాయిగా కనిపిస్తాను. ఇలాంటి నేపథ్యం ఉన్న సినిమా మేకింగ్ చాలా టఫ్. ఈ సినిమాలో నటించిన ప్రతీ ఒక్కరీ పాత్ర అందరికీ గుర్తుండిపోతుంది. విక్రమ్ యాక్టింగ్, డైరెక్టర్ రంజిత్ మేకింగ్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని అన్నారు. పార్వతి తిరువోతి మాట్లాడుతూ "ఈ సినిమాలో డైరెక్టర్ రంజిత్ ఓ నూతన ప్రపంచాన్ని సృష్టించాడు. అది తెరపై చూసిన వారంతా థ్రిల్‌కు గురవుతారు" అని చెప్పారు.

రూ.రెండు కోట్లు కాదు.. రూ.అరవై లక్షలే



మలయాళ సూపర్ హిట్ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్'. అందులో తన అనుమతి లేకుండా 'గుణ' సినిమాలోని పాటను వాడారని సంగీత దర్శకుడు ఇళయరాజా కోర్టులో చిత్ర బృందంపై కేసు వేసిన సంగతి తెలిసిందే. అనుమతి లేకుండా పాటను వాడుకున్నందుకు ఇళయరాజా, 'మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర నిర్మాతలు రూ.రెండు కోట్లు ఇవ్వాలని లేదా సినిమాలో ఆ పాటను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన మేకర్స్.. దీనికి పరిష్కారంగా ఇళయరాజాకు రూ.60 లక్షలు చెల్లించడానికి అంగీకరించినట్లు సమాచారం.

ఇన్ ప్రోగ్రెస్

ఎరుకల తెగ నాయకుడు



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి కన్నడ నటుడు దేవరాజ్ పోషించిన ఎరుకల తెగ నాయకుడు 'ముండడు' లుక్‌ను సోమవారం విడుదల చేశారు. డాక్టర్ మోహన్‌బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటులు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. చిత్రాన్ని విజువల్ వండర్‌గా ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

పక్కా గోదావరి జిల్లాల సినిమా



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన 'ఆయ్' చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించారు. అంజి కె. మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నారు.ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం పిఠాపురంలో చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా బన్నీ వాసు మాట్లాడుతూ 'ఇది పక్కా గోదావరి జిల్లాల సినిమా. కడుపుబ్బా నవ్విస్తుంది. పిఠాపురంలో సినీ వేడుక నిర్వహించి కొత్త అడుగు వేశాం' అన్నారు. 'ఈ సినిమా కోసం దర్శకుడు మమ్మల్ని చెట్టు ఎక్కించి, బురదలో పడేశారు. ఆయన మీద కోపాన్ని మళ్లీ తీర్చుకుంటాను. మా కష్టానికి ప్రతిఫలం విజయం రూపంలో మీరు అందించాలి' అని హీరో నార్నే నితిన్ కోరారు.

సర్దార్ కోసం ఆషిక



తెలుగు, తమిళ భాషల్లో హిట్ అయిన 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా 'సర్దార్ 2' చిత్రం ఇప్పుడు తయారవుతోంది. కార్తి హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో మాళవిక మోహన్ ఒక హీరోయిన్‌గా నటిస్తున్నారు. మరో హీరోయిన్‌గా ఆషికా రంగనాథ్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాత ఎస్.లక్ష్మణ్‌కుమార్ చెప్పారు. ఎస్.జె.సూర్య మరో పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలో వేసిన భారీ సెట్‌లో షూటింగ్ జరుగుతున్నట్లు దర్శకుడు పి.ఎస్.మిత్రన్ చెప్పారు.

ఒక సినిమా... ఐదు అవార్డులు



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రలు పోషించిన 'బేబి' చిత్రం ఐదు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు గెలుచుక్న సందర్భంగా సోమవారం యూనిట్ సభ్యులు మీడియాతో మాట్లాడారు.ఈ కార్యక్రమానికి దర్శకుడు మారుతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'అవార్డ్స్ అంటే స్టార్స్ సినిమాలకే వస్తాయనే అపోహ తొలగిపోయిన సందర్భం ఇది. మా సినిమాకు ఐదు అవార్డులు రావడం ఆనందంగా ఉంది' అన్నారు నిర్మాత ఎస్.కె.ఎన్. ఎనిమిది నామినేషన్స్‌కు ఐదు అవార్డులు రావడం సంతోషంగా ఉందని దర్శకుడు సాయిరాజేశ్ చెప్పారు. రచయిత అనంత్ శ్రీరామ్‌కు తప్ప తమ అందరికీ ఇదే మొదటి ఫిల్మ్‌ఫేర్ అవార్డు అని ఆయన చెప్పారు. 'ఉత్తమ నటిగా అవార్డ్ అందుకోవడం, మా 'బేబి' చిత్రానికి ఐదు అవార్డులు రావడం చాలా హ్యాపీగా ఉంది' అన్నారు హీరోయిన్ వైష్ణవి చైతన్య.

పాటలో అద్భుతమైన కథ చూపించారు



దీపు జాను, వైశాలిరాజ్ లీడ్ రోల్స్‌లో కనిపించిన 'ఫస్ట్ లవ్' మ్యూజికల్ ఆల్బమ్‌ను సంగీత దర్శకుడు ఎస్.ఎస్.తమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' వీడియో చాలా బాగుంది. అద్భుతమైన కథను ఒక పాటలో చూపించారు. మంచి సినిమా చూసిన అనుభూతి కలిగింది' అన్నారు. హీరోయిన్, నిర్మాత వైశాలిరాజ్ మాట్లాడుతూ 'ఎంతో కష్టపడి ఈ పాట చేశాం. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. అందరూ సెలబ్రేట్ చేసుకొనే స్పెషల్ ఆల్బమ్ ఇదని దర్శకుడు బాలరాజు చెప్పారు.

జర్మనీని జయించేనా?

హాకీలో భారత్ సెమీస్ పోరు నేడు

రాత్రి 10.30 నుంచి



పారిస్: నరాలు తెగే ఉత్కంఠ మధ్య అద్భుత విజయం సాధించిన భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్ పతకంపై గురిపెట్టింది. మంగళవారం జరిగే సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి వరల్డ్ చాంపియన్ జర్మనీతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. టోక్యో క్రీడల్లో కాంస్యం అందుకున్న టీమిండియా.. ఈసారి ఎలాగైనా పతకం రంగు మార్చాలనే పట్టుదలతో ఉంది. 1980 మాస్కో క్రీడల్లో భారత్ చివరిసారి స్వర్ణం నెగ్గింది. ఫైనల్ చేరి చాంపియన్‌గా నిలవడానికి హర్మన్‌ప్రీత్ సింగ్ సేనకు ఇదో సువర్ణావకాశం. బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్స్ పోరులో భారత జట్టు గొప్ప పోరాట ప్రతిభను ప్రదర్శించింది. అమిత్ రోహిదాస్ రెడ్‌కార్డ్‌కు గురవడంతో.. 40 నిమిషాలపాటు 10 మందితోనే ఆడినా బ్రిటన్‌ను 1-1తో నిలువరించింది. పెనాల్టీ షూటౌట్‌లో 4-2తో గెలిచింది. వెటరన్ గోల్ కీపర్ శ్రీజేష్ గోల్ పోస్టుకు అడ్డుగోడలా నిలిచాడు. 10 పెనాల్టీ కార్నర్‌లను సమర్థంగా అడ్డుకోవడమే కాకుండా షూటౌట్‌లో రెండు గోల్స్ ఆపి భారత్‌ను ఫైనల్-4కు చేర్చాడు. మరోవైపు వరల్డ్ నెం.4 జర్మనీ సెమీస్‌లో అర్జెంటీనాపై గెలిచింది. మైదానంలో మెరుపు వేగంతో కదిలే జర్మన్ ప్లేయర్ల నుంచి భారత్‌కు ఎప్పుడూ ప్రమాదమే. గత క్రీడల్లో కాంస్య పోరులో టీమిండియా చేతిలో 4-5తో ఓడిన జర్మనీ.. ఈసారి బదులు తీర్చుకోవాలనే కసితో ఉంది. అయితే, క్వార్టర్స్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొని ముందంజ వేసిన భారత్ పూర్తి ఆత్మ విశ్వాసంతో కనిపిస్తోంది.

అమిత్ అవుట్

భారత జట్టు కీలక డిఫెండర్ అమిత్ రోహిదాస్‌పై ఒక మ్యాచ్ వేటు పడింది. దీంతో సెమీస్‌కు అతడు దూరమయ్యాడు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని హాకీ ఇండియా చేసిన విజ్ఞప్తిని అంతర్జాతీయ హాకీ సమాఖ్య తోసిపుచ్చింది. బ్రిటన్‌తో మ్యాచ్‌లో అమిత్ స్టిక్.. ప్రత్యర్థి ఆటగాడి ముఖంపై తగలడంతో అతడికి రెడ్ కార్డ్ చూపించి బయటకు పంపారు. ఆ తర్వాత వీడియోను పరిశీలించిన జ్యూరీ.. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రోహిదాస్‌పై ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు వేసింది.



ఇక.. నీరజ్ వేట

నేడే జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్

స్వర్ణ ఆశలు ఒక్కొక్కటిగా కొడిగడుతున్న వేళ.. భారత అభిమానుల కళ్లు వెదుకుతున్నది ఒక్కడినే. అతడే టోక్యో జావెలిన్ త్రో చాంపియన్ నీరజ్ చోప్రా. మంగళవారం జరిగే క్వాలిఫికేషన్ రౌండ్‌లో చోప్రా బరిలోకి దిగనున్నాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన చోప్రాపై భారీ అంచనాలున్నాయి. అర్హత రౌండ్ దాటితే గురువారం జరిగే ఫైనల్లో నీరజ్ స్వర్ణం కోసం తలపడనున్నాడు. ఒలింపిక్స్ జావెలిన్ త్రో ఈవెంట్ చరిత్రలో ఐదుగురు మాత్రమే టైటిల్ నిలబెట్టుకొన్నారు. మరి నీరజ్ వారి సరసన చేరతాడో? లేదో చూడాలి. జాకబ్ వాడ్లెచ్ (చెక్), జూలియన్ వెబర్ (జర్మనీ), మాజీ వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ నుంచి చోప్రాకు గట్టిపోటీ ఎదురయ్యే చాన్సుంది. మరో భారత త్రోయర్ కిశోర్ జెనా కూడా బరిలో ఉన్నాడు. ఆసియాడ్‌లో 87.54 మీటర్ల దూరం త్రో చేసి నేరుగా మెగా క్రీడలకు అర్హత సాధించిన కిశోర్.. ఆ తర్వాత 80 మీటర్ల మార్క్‌ను కూడా దాటలేకపోవడం ఆందోళన కలిగించే విషయం.



టీటీ క్వార్టర్స్‌లో శ్రీజ బృందం

వ్యక్తిగత విభాగాల్లో నిరాశపరిచిన భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఇప్పుడు టీమ్ ఈవెంట్లలో రాణించేందుకు సిద్ధమయ్యారు. మనికా బత్రా, తెలుగమ్మాయి ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌లతో కూడిన భారత మహిళల జట్టు టీమ్ విభాగంలో క్వార్టర్‌ఫైనల్ చేరింది. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో భారత్ 3-2తో రొమేనియాను ఓడించింది. మొదట డబుల్స్‌లో శ్రీజ-అర్చన జోడీ.. తర్వాత సింగిల్స్ మనికా నెగ్గారు. ఆ తర్వాత వరుస సింగిల్స్‌లో శ్రీజ, అర్చన ప్రత్యర్థుల చేతిలో ఓడారు. దీంతో నిర్ణాయక ఆఖరి సింగిల్స్‌లో మనికా మ్యాచ్ గెలిచి భారత్‌కు క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసింది. క్వార్టర్స్‌లో అమెరికా లేదా జర్మనీతో భారత్ తలపడనుంది.

400 మీటర్లలో రెపిచేజ్‌కు కిరణ్



భారత అథ్లెట్ కిరణ్ పాహల్ మహిళల 400 మీటర్ల రేసులో నేరుగా సెమీఫైనల్ చేరడంలో విఫలమైంది. సోమవారం జరిగిన తన హీట్‌లో కిరణ్ 52.51 సెకన్లలో గమ్యం చేరి ఏడోస్థానానికి పరిమితమైంది. మొత్తం ఆరు హీట్స్ నుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన మొత్తం 18 మంది అథ్లెట్లు సెమీస్ చేరతారు. అయితే, నేరుగా సెమీస్ చేరకపోయినా తమ హీట్స్‌లో రేసు పూర్తి చేసిన మిగతా అథ్లెట్లకు రెపిచేజ్ రూపంలో పోటీపడే రెండో చాన్స్ ఉంటుంది. దీంతో రేసు పూర్తి చేయడంతో కిరణ్ రెపిచేజ్ హీట్స్ రౌండ్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగే రెపిచేజ్ రౌండ్‌లో విజయం సాధిస్తే కిరణ్‌కు సెమీస్ బెర్త్ ఖరారవుతుంది.

అయ్యో.. నిషా!

గాయంతో క్వార్టర్స్‌లో ఓటమి



పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ పోటీల తొలిరోజే భారత్‌కు ఊహించని పరిణామం ఎదురైంది. మహిళల 68 ఫ్రీస్టయిల్ విభాగంలో నిషా దహియా పురోగమనానికి గాయం గండి కొట్టింది. సోమవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో నార్త్‌కొరియాకు చెందిన పాక్ సోల్ గమ్‌తో నిషా తలపడింది. ఆదినుంచి ప్రత్యర్థిని ఉడుంపట్టు పట్టిన దహియా ఓ దశలో 8-1తో బౌట్‌ను గెలుచుకొనే స్థితిలో నిలిచింది. మరో 90 సెకన్లలో పోటీ ముగుస్తుందనగా నిషా కుడి చేతికి తీవ్ర గాయం అయ్యింది. నొప్పిని తట్టుకోలేక ఆమె విలవిలాడింది. 'మెడికల్ బ్రేక్' తీసుకొని మళ్లీ ఆటలోకి అడుగు పెట్టింది కానీ..గాయం కారణంగా దహియా సరైన పట్టు పట్టలేకపోయింది. ఇదే అదనుగా విజృంభించిన కొరియా అమ్మాయి వరుసగా తొమ్మిది పాయింట్లు రాబట్టింది. నిజానికి బౌట్ ముగియడానికి 10 సెకన్ల ముందు స్కోరు 8-8తో సమంగా ఉంది. ఈ దశలో నిషా పెద్దగా ప్రతిఘటించలేకపోవడంతో సోల్ గమ్ బౌట్‌లో విజయం సాధించింది. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో దహియా 6-4తో సోవా రిజ్కో (ఉక్రెయిన్)ను చిత్తు చేసి శుభారంభం అందుకుంది.

'లక్ష్య'ం దూరంగానే..

కాంస్య పోరులో లక్ష్య సేన్ ఓటమి

స్కీట్ మిక్స్‌డ్ టీమ్‌లో మహేశ్వరి-అనంత్ కూడా



పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో తొలి ఒలింపిక్ పతకం ఊరిస్తూనే ఉంది. విక్టర్ అక్సెల్సెన్‌తో సెమీస్‌లో ఓడినా.. కాంస్య పోరులో లక్ష్య సేన్ పోడియం సాధిస్తాడని, తద్వారా మరో పతకం ఖాయమని క్రీడాభిమానులంతా ఆశ పడ్డారు. దీనికి తగ్గట్టుగానే తొలి గేమ్‌లో అదుర్స్ అనిపించుకోవడంతో కమాన్.. లక్ష్య అంటూ ఫ్యాన్స్ టీవీల ముందే అతుక్కుపోయారు. కానీ ప్రత్యర్థి లీ జి జియా పట్టు వదల్లేదు. తిరుగులేని స్మాష్‌లతో విరుచుకుపడి సేన్‌ను కట్టడి చేశాడు. ఇక, చేతి గాయం కూడా ప్రభావం చూపడంతో లక్ష్యకు పరాజయం తప్పలేదు. అటు షూటింగ్‌లోనూ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పోరులో మహేశ్వరి-అనంత్ జోడీ తృటిలో పతకం చేజార్చుకుంది.



విక్టర్ కున్లావుట్ లీ జి జియా



అన్ సే యంగ్

పారిస్: ఒలింపిక్స్‌లో పదో రోజూ భారత్ పతకం లేకుండానే ముగించింది. సోమవారం భారత్ బ్యాడ్మింటన్, షూటింగ్‌లలో రెండు కాంస్యాలపై గురి పెట్టింది. అయితే మెడల్ కోసం మన అథ్లెట్లు శక్తివంచన లేకుండా పోరాడినా ఫలితం దక్కలేదు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో సంచలన ప్రదర్శన కనబర్చిన లక్ష్యసేన్ కాంస్య పతక ప్లేఆఫ్‌లోనూ వెనుకబడ్డాడు. మలేసియా షట్లర్ లీ జి జియా చేతిలో 21-13, 16-21, 11-21 తేడాతో ఓడాడు. దీంతో బ్యాడ్మింటన్‌లో 12 ఏళ్లుగా పతకం సాధిస్తూ వస్తున్న భారత్.. ఈసారి మాత్రం రిక్తహస్తాలతో వెనుదిరిగింది. గతంలో సైనా (2012), సింధు (2016, 2021) వరుసగా మెడల్స్ సాధించారు. మరోవైపు పురుషుల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంప్ విక్టర్ అక్సెల్సెన్ (డెన్మార్క్) 21-11, 21-11తో కున్లావుట్ విటిడ్‌సర్న్ (థాయ్‌లాండ్)ను ఓడించి తన స్వర్ణాన్ని నిలబెట్టుకున్నాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో అన్ సే యంగ్ (కొరియా) 21-13, 21-16తో హే బింగ్‌జావో (చైనా)పై నెగ్గి స్వర్ణం అందుకుంది.

అవకాశం దక్కినా..

పురుషుల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు తొలి ఒలింపిక్ పతకం అందించే అవకాశాన్ని యువ షట్లర్ లక్ష్య సేన్ చేజార్చుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో కాంస్య పతక మ్యాచ్‌ను ఆరంభించిన సేన్ తొలి గేమ్‌లో సుదీర్ఘ ర్యాలీలు, డ్రాప్ షాట్లతో ఆధిక్యం చూపాడు. చివరకు 20 నిమిషాల్లోనే ఈ గేమ్‌ను 21-13తో ముగించాడు. ఆ తర్వాత గేమ్‌లోనూ సేన్ ఎలాంటి తడబాటు లేకుండా 8-3తో దూసుకెళ్లాడు. ఇక గెలుపే తరువాయి అనుకున్న తరుణంలో.. ఈ భారీ తేడాను లీ జిన్ అద్భుతంగా అధిగమించాడు. పవర్‌ఫుల్ రిటర్న్, బాడీ స్మాష్‌లతో పాటు సేన్‌ను కోర్టుకు ఇరువైపులా ఆడించడంతో వరుసగా 9 పాయింట్లతో 12-8తో నిలిచాడు. దీంతో డీలా పడిన సేన్ తిరిగి కోలుకోలేకపోయాడు. ఇక చివరి గేమ్‌లోనూ లక్ష్య 2-8తో వెనుకబడడంతో ఒత్తిడికి లోనయ్యాడు. చూస్తుండగానే ప్రత్యర్థి ఆధిక్యం 15-7కు వెళ్లడంతో చేసేదేమీ లేకపోయింది. చివరకు బాడీ స్మాష్‌ను రిటర్న్ చేయలేక మ్యాచ్‌ను సైతం కోల్పోయాడు. మరోవైపు ఈ పోరులో సేన్ మూడుసార్లు తన కుడి చేతి గాయానికి బ్యాండేజీ వేసుకోవాల్సి వచ్చింది. రెండో గేమ్‌లో అతడి మోచేతి నుంచి రక్తం కారడంతో చికిత్స చేసుకోవాల్సి వచ్చింది. ఇదంతా అతడి లయపై ప్రభావం పడింది.

స్కీట్‌లో ఒక్క పాయింట్‌తో..





స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కు ఒక్క పాయింట్ తేడాతో కాంస్యం చేజారింది. షూటర్లు మహేశ్వరి చౌహాన్-అనంత్ జీత్ సింగ్ జోడీ 43-44 తేడాతో నాలుగో స్థానంలో నిలిచింది. చైనా ద్వయం యిటింగ్ జియాంగ్-జియాన్లిన్ కాంస్యం గెల్చుకుంది. అలాగే ఈ గేమ్స్‌లో భారత షూటింగ్ ప్రస్థానం కూడా ముగిసింది. మెడల్ రౌండ్ తొలి స్టేషన్‌లో చైనా షూటర్లు ఇద్దరూ నాలుగుకి నాలుగు షాట్లతో 8 పాయింట్లు సాధించగా, భారత్ ఏడు మాత్రమే సాధించింది. అయితే మూడో స్టేషన్ వరకు స్కోరు 20-20గా మారడంతో పోటీ ఉత్కంఠకు చేరింది. కానీ ఆ తర్వాత మహేశ్వరి ఒక షాట్ మిస్ కావడంతో స్కోరు 27-28తో చైనాకు అనుకూలంగా మారింది. ఇక చివరి రెండు స్టేషన్లలోనూ ఇరు దేశాల షూటర్లు అన్ని షాట్లను గురి చూసి కొట్టినప్పటికీ ఆ పాయింట్ తేడా అలాగే ఉండిపోయి భారత్ ఓడింది. అంతకుముందు రెండు రోజుల పాటు సాగిన క్వాలిఫికేషన్ పోటీల్లో ఐదు రౌండ్ల అనంతరం భారత్, చైనా 146 స్కోరు చేయడంతో షూటాఫ్ అనివార్యమైంది. ఇందులో 4-3తో గెలిచిన చైనా మూడో స్థానం, భారత్‌కు నాలుగో స్థానం దక్కడంతో కాంస్యం కోసం పోటీపడ్డాయి.

స్టీపుల్ చేజ్ ఫైనల్లో అవినాశ్ సబ్లే

పారిస్: వ్యక్తిగత విభాగాలలో నిరాశాజనక ప్రదర్శనతో భారత అథ్లెట్లంతా ఉసూరుమనిపిస్తున్న వేళ..అవినాశ్ సబ్లే పతకంపై ఆశలు రేపాడు. పురుషుల మూడువేల మీటర్ల స్టీపుల్ చేజ్‌లో సబ్లే ఫైనల్‌కు దూసుకు పోయాడు. తద్వారా ఈ విభాగంలో ఫైనల్‌కు చేరిన తొలి భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. సోమవారం జరిగిన హీట్స్‌లో..11 మంది తలపడిన రెండో హీట్‌లో అవినాశ్ బరిలో దిగాడు. ఎనిమిది నిమిషాల 15.43 సెకన్ల టైమింగ్‌తో గమ్యం చేరాడు. ఐదో స్థానంలో నిలవడం ద్వారా ఫైనల్‌కు అర్హత సాధించాడు. మొత్తం మూడు హీట్స్‌లో..ఒక్కో హీట్‌లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు క్వాలిఫై అయ్యారు. ఫైనల్ ఈనెల ఎనిమిదిన జరగనుంది.



అవినాశ్

పారిస్‌లో నేటి భారతం



టేబుల్ టెన్నిస్: పురుషుల టీమ్ ప్రీక్వార్టర్‌ఫైనల్ - భారత్ x చైనా (మ. 1.30).
అథ్లెటిక్స్: పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్ - కిషోర్ జెనా (మ. 1.50), నీరజ్ చోప్రా (మ. 3.20), మహిళల 400మీ. రెపిచేజ్: కిరణ్ పాహల్ (మ. 2.50).
రెజ్లింగ్: మహిళల 50 కిలోల ప్రీక్వార్టర్స్-వినేశ్ ఫొగట్ x యు సుసాకి(జపాన్) (మ. 2.30).
హాకీ సెమీఫైనల్: భారత్ x జర్మనీ (రా. 10.30).

ముగింపు వేడుకల్లో పతాకధారిగా మను భాకర్



పారిస్: ఈ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు కొల్లగొట్టి చరిత్ర సృష్టించిన యువ షూటర్ మను భాకర్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. వచ్చే ఆదివారం జరిగే విశ్వక్రీడల ముగింపు వేడుకల్లో భారత అథ్లెట్ల మహిళల బృందానికి ఆమె పతాకధారిగా వ్యవహరించనుంది. ఫ్లాగ్ బేరర్‌గా మనును ఎంపిక చేసినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారి సోమవారం వెల్లడించారు. అయితే, పురుషుల బృందానికి పతాకధారి ఎవరన్నది ఐఓఏ త్వరలోనే ప్రకటించనుంది. ఆరంభ వేడుకల్లో భారత పతాకధారులుగా షట్లర్ పీవీ సింధు, టీటీ వెటరన్ స్టార్ శరత్ కమల్ వ్యవహరించిన సంగతి తెలిసిందే.

బైల్స్‌కు షాకిచ్చిన రెబెకా

నాలుగు పతకాలతో ముగించిన సిమోన్



సిమోన్ బైల్స్



రెబెకా అండ్రాడే

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌ను స్వర్ణ పతకంతో ముగించాలన్న అమెరికా సూపర్ స్టార్ జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ ఆశ నెరవేరలేదు. పోటీలలో చివరిదైన ఫ్లోర్‌ఎక్సర్‌సైజ్ ఫైనల్లో సిమోన్ రజతానికే పరిమితమైంది. బ్రెజిల్ జిమ్నాస్ట్ రెబెకా అండ్రాడే (14.166) స్వర్ణం ఎగరేసుకుపోయింది. తద్వారా ప్రధాన అంతర్జాతీయ టోర్నమెంట్ల ఫ్లోర్‌ఎక్సర్‌సైజ్ విభాగంలో బైల్స్‌ను ఓడించిన జిమ్నాస్ట్‌గా అండ్రాడే నిలిచింది. అయితే కొద్ది తేడాతో (14.133 పాయింట్లు) బైల్స్ రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పోటీలో బైల్స్ ఒకటి రెండు తప్పులు చేయడం ఆమె స్వర్ణ పతక అవకాశాలకు గండి కొట్టింది.. బైల్స్ సహచరి జోర్డాన్ చైల్స్ (13.766) కాంస్య పతకం అందుకుంది అయితే తొలుత జరిగిన బ్యాలెన్స్‌బీమ్ ఫైనల్లో 27 ఏళ్ల సిమోన్ విన్యాసాలు చేసే క్రమంలో కిందపడిపోయింది. దాంతో పోటీని తిలకిస్తున్న వారంతా ఖిన్నులయ్యారు. ఫలితంగా 13.100 పాయింట్లతో సహచరి సునిసా లీతో సమంగా బైల్స్ నాలుగో స్థానంలో నిలిచింది. దరిమిలా ఈ విభాగంలో బైల్స్‌కు పతకం మిస్సయింది. ఇటలీకి చెందిన అలైస్ డి అమాటో (14.366) స్వర్ణం, ఝౌ యాక్విన్ (చైనా, 14.100) రజతం, మనీలా ఎస్పోసిటో (ఇటలీ, 14.000) కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇక..బైల్స్ పారిస్ ఒలింపిక్స్‌ను నాలుగు పతకాలతో ఘనంగా ముగించింది. ఇందులో ఆర్టిస్టిక్ టీమ్, వ్యక్తిగత ఆల్‌రౌండ్, వాల్ట్ విభాగాల్లో బైల్స్ స్వర్ణ పతకాలు సాధించింది. కాగా..ఈ క్రీడల్లో గెలుపొందిన నాలుగింటితో కలిపి ఒలింపిక్స్‌లో బైల్స్ ఓవరాల్ పతకాల సంఖ్య 11కి చేరింది.

క్లైంబింగ్‌లో మిరోస్లావా ప్రపంచ రికార్డు

మహిళల క్లైంబింగ్ స్పీడ్ ఈవెంట్‌లో అలెగ్జాండ్రా మిరోస్లావ్ (పోలెండ్) తన ప్రపంచ రికార్డును తానే అధిగమించింది. తొలి క్వాలిఫికేష్ రౌండ్‌ను మిరోస్లావ్ 6.21 సెకన్ల టైమింగ్‌తో పూర్తి చేసి నయా రికార్డును నెలకొల్పింది. గతేడాది రోమ్‌లో యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో తాను నెలకొల్పిన వరల్డ్ రికార్డును 0.03 సెకన్ల తేడాతో బద్దలుకొట్టింది.



అలెగ్జాండ్రా మిరోస్లావ్

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	21	17	14	52
అమెరికా	19	29	27	75
ఆస్ట్రేలియా	13	11	8	32
ఫ్రాన్స్	12	15	18	45
బ్రిటన్	11	13	17	41
కొరియా	11	8	7	26
జపాన్	10	5	11	26
ఇటలీ	9	10	6	25
జర్మనీ	6	5	4	15
నెదర్లాండ్స్	6	5	4	15
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

'డబుల్'పై నోవా నజర్



సెయింట్ డెనిస్ (ఫ్రాన్స్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల 100 మీ. స్ప్రింట్ టైటిల్ సొంతం చేసుకున్న అమెరికా స్టార్ నోవా లైల్స్ ఇప్పుడు 200 మీ. పరుగుపైనా కన్నేశాడు. సోమవారం రాత్రి జరిగిన 200 మీటర్ల హీట్‌లో లైల్స్ 20.19 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని సెమీస్‌కు క్వాలిఫై అయ్యాడు. బుధవారం రాత్రి 11.30కు సెమీస్, గురువారం అర్ధరాత్రి 12 గంటలకు ఫైనల్ జరగనుంది.

బిడ్డను మోస్తూనే.. బాణాలు సంధించా



రమజనోవా

చాలా మంది అథ్లెట్లు.. పారిస్ ఒలింపిక్స్‌లో తాము చేసిన ఫీట్లు, సాధించిన విజయాలతోపాటు పలు ఆసక్తికర వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఈజిప్ట్ ఫెన్సర్ నాడా హఫీజ్ ఏడు నెలల గర్భంతోనే బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. 'పోటీలో ఇద్దరు కాదు.. వాస్తవంగా ముగ్గురున్నారు. నేను, నా ప్రత్యర్థితోపాటు.. ఇంకా లోకం చూడని నా బిడ్డ' అని తన మ్యాచ్ ఫొటోను ఆమె షేర్ చేసింది. కాగా, నాడాతో పాటు మరో గర్భిణి కూడా పారిస్ క్రీడల బరిలోకి దిగింది. ఆమే అజర్‌బైజాన్‌కు చెందిన ఆర్చర్ రమజనోవా. ఆరున్నర నెలల గర్భంతో తాను బాణాలను సంధించానని రమజనోవా వెల్లడించింది. 'ఓ షాట్ కొట్టేటప్పుడు.. పొట్టలో బిడ్డ చిన్నగా తన్నినట్టనిపించింది. అయితే, అప్పుడు 10 పాయింట్లు సాధించా' అని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో పోటీపడ్డ రజనోవా ప్రీక్వార్టర్స్‌లో ఓడింది. ఫెన్సర్ నాడా హఫీజ్ రెండోరౌండ్లోనే వెనుదిరిగింది. అయితే, పతకం గెలవకపోయినా.. తమ ఆటతీరుతో, అంకిత భావంతో ఈ అథ్లెట్లు క్రీడాలోకం ప్రశంసలందుకుంటున్నారు. బిడ్డను మోస్తున్నా.. ఎంతో ధైర్యంగా హద్దులను చెరిపేస్తున్నారని ఓ నిపుణుడు అభిప్రాయపడ్డాడు. గర్భంతో ఉంటే కఠినమైన పనులు చేయకూడదనే భయాలను వీరు దూరం చేస్తున్నారని అన్నాడు.

ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ థోర్ప్ మృతి



లండన్: ఇంగ్లండ్, సర్రే మాజీ బ్యాటర్ గ్రాహమ్ థోర్ప్ సోమవారం మరణించాడు. 55 ఏళ్ల థోర్ప్ 2022 నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అయితే ఆ సమస్య ఏమిటనేదిమాత్రం తెలియరాలేదు. ఆ ఏడాది అతడు అఫ్ఘానిస్థాన్ జట్టు కోచ్‌గా నియమితుడయ్యాడు. కానీ హఠాత్తుగా అనారోగ్యం పాలవడంతో ఆ బాధ్యతలు చేపట్టలేదు. స్టయిలిష్ బ్యాటర్‌గా పేరు గాంచిన గ్రాహమ్ 1993 నుంచి 2005 మధ్య ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడాడు. 16 సెంచరీలతో 6744 రన్స్ చేశాడు. 82 వన్డేలలో 2380 రన్స్ చేశాడు. రిటైర్మెంట్ అనంతరం అతడు ఇంగ్లండ్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా పని చేశాడు.

జమ్మూ కశ్మీర్ అభివృద్ధి కాంగ్రెస్‌కు కనిపించట్లేదా?: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో బీజేపీ పాలనలో జరిగిన జమ్మూ కశ్మీర్ అభివృద్ధి కాంగ్రెస్ కనిపించడం లేదా అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, జమ్మూ కశ్మీర్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ కిషన్ రెడ్డి ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి అడ్డుగా ఉండి, అక్కడి ప్రజల స్వేచ్ఛకు సంకెళ్లుగా మారిన ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని కాంగ్రెస్ 'బ్లాక్ డే'గా పరిగణించడంపై మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2019 వరకు కశ్మీర్‌లో అశాంతికి, అభివృద్ధి జరగకపోవడానికి కాంగ్రెస్సే కారణమన్నారు. వెనుకబాటు, కుటుంబ రాజకీయాల నుంచి జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్రత కల్పించినందుకు 'బ్లాక్ డే' నిర్వహిస్తున్నారా అంటూ కాంగ్రెస్‌ను నిలదీశారు. కాగా, ఎన్నికల హామీ మేరకు రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండు దఫాలుగా రుణమాఫీ అమలు చేసినట్లు ప్రకటించినా, ఇప్పటికీ వేలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తాము ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రానికి పెద్ద సంఖ్యలో రైతులు ఫోన్లు చేసి రుణమాఫీ అమలు కాలేదని వాపోతున్నారని వివరించారు.

పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు సరికాదు

» తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ

ఖైరతాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రస్తుతమున్న పొట్టి శ్రీరాములు పేరును మార్చాలని చేస్తున్న ప్రయత్నాలు అర్ధరహితమని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పేర్కొంది. ఈ విషయమై తెలుగువారందరూ ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారని తెలిపింది. తెలుగు విశ్వవిద్యాలయానికి పేరు మార్చాలని వచ్చిన ప్రతిపాదనపై ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు తెలిసిన విషయమై ఆర్యవైశ్య మహాసభ నేతలు స్పందించారు. సోమవారం చింతలబస్తీలోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో సభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యదర్శి రేణుకుంట్ల గణేష్ గుప్త, కోశాధికారి కొండ్లె మల్లిఖార్జున్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోని అందరికీ పొట్టి శ్రీరాములు ఆరాధ్యుడేనని, ఆయనను ఒక ప్రాంతానికి చెందిన వారిగా చూడడం సరికాదని వారు అన్నారు. పేరు మార్పిడి విషయం తెలిసినప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ జిల్లాలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై ఉపముఖ్యమంత్రి భట్టికి వినతి పత్రం సమర్పిస్తామని తెలిపారు.

విద్యుత్తు ఒప్పందాలపై జస్టిస్ లోకూర్ నజర్

» ఏయే తప్పిదాలు జరిగాయనే దానిపై అధ్యయనం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తు కొనుగోళ్లు, ఒప్పందాలు, విద్యుత్కేంద్రాల నిర్మాణాల్లో అవకతవకలపై విచారణకు నియమించిన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ మదన్ భీంరావు లోకూర్.. సంబంధిత దస్త్రాలను జల్లెడ పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందంలో జరిగిన తప్పిదాలేంటి? 2000 మెగావాట్ల కోసం కారిడార్‌ను బుక్ చేసుకొని, ఆ మేరకు కరెంట్ తీసుకోకుండా పవర్ గ్రిడ్‌కు జరిమానాల రూపంలో కట్టినదెంత? బొగ్గు గనులకు సుదూరంలో యాదాద్రి విద్యుత్కేంద్రం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్న కారణంగా దీర్ఘకాలంగా తెలంగాణ ప్రజలపై ఏ మేరకు భారం పడనుంది? కాలం చెల్లిన టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల కలిగిన నష్టమేంటి? ఈ ఒప్పందంలో ఏ మేరకు తప్పిదాలు చోటుచేసుకున్నాయి? నామినేషన్ ప్రాతిపదికన యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్‌లను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించడం వల్ల జరిగిన నష్టాలేంటి? అనే అంశాలపై జస్టిస్ లోకూర్ దృష్టి సారించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో గత నెల 16న కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకోవడంతో 29న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బీ లోకూర్‌ను ఛైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ నెల 2న బాధ్యతలు స్వీకరించిన ఆయన.. దస్త్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం చేసుకోవడం, నామినేషన్ ప్రాతిపదికన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంపై విచారణ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి 3 నెలల్లో నివేదిక అందించాలని ప్రభుత్వం ఆయన్ను కోరింది.

గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే డబ్బు సేఫ్!

» 85.5కోట్ల అప్పగింత.. సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎంత అప్రమత్తంగా ఉంటున్నా.. సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో ప్రజల్ని మోసం చేస్తూనే ఉన్నారు. సామాన్య ప్రజలు, నిరక్షరాస్యులతో పోలిస్తే సైబర్ బాధితుల్లో చదువుకున్నవారు, ఐటీ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి డబ్బులు పోగొట్టుకున్నవాళ్లు... గోల్డెన్ అవర్(తక్షణ ఫిర్యాదు)లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీ సీఎస్‌బీ)కి ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి పొందవచ్చని అధికారులు భరోసా కల్పిస్తున్నారు. సరైన సమయంలో ఫిర్యాదు చేసిన బాధితులకు రూ. 85.5 కోట్లు తిరిగి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కమిషనరేట్లు, ఎస్పీ కార్యాలయాల పరిధిలో గత మార్చి నుంచి జూలై వరకు సైబర్ మోసాల బారినపడ్డ బాధితులకు రికవరీ సొమ్మును అప్పగించినట్లు బ్యూరో డైరెక్టర్ శిఖాగోయెల్ తెలిపారు. తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ(టీజీ ఎల్ఎస్ఏ), టీజీ సీఎస్‌బీ సంయుక్త కృషితో ఇది సాధ్యమైందన్నారు. ఆయా కేసుల్లో బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసిన నగదు ఎక్కువ కాలం నిల్వ ఉంచడం, బాధితులకు తిరిగి చెల్లించడంలో ఎదురయ్యే ఇబ్బందులపై ప్రధానంగా దృష్టి సారించమని, 6,449 కేసులకు సంబంధించి రూ. 85.5కోట్లు వాపసు చేశామని పేర్కొన్నారు. అత్యధికంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ. 36.8 కోట్లు బాధితులకు రీఫండ్ చేసినట్లు గోయెల్ వివరించారు. బాధితులు టోల్ ఫ్రీ నెంబరు 1930, లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాకు మామూళ్లు..

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సూర్యాపేట క్రైం, ఆగస్టు 5: సూర్యాపేట జిల్లా కేంద్రంలో మామూళ్లు తీసుకుని ఇసుక అక్రమ రవాణాకు సహకరించిన ముగ్గురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట, అర్వపల్లి, పెన్‌పహాడ్ మండలాల పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతంలో స్థానికులు ఇసుక తవ్వుతుండగా, ట్రాక్టర్ యజమానులు సూర్యాపేటలోని ఇంటి నిర్మాణదారులకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోకి వచ్చే క్రమంలో విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది వారిని ఆపి మామూళ్లు తీసుకుని వారికి సహకరిస్తున్నారు. సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు బాలకృష్ణ, పూర్ణచందర్, రాంబాబు ఇసుక ట్రాక్టర్ల యజమానుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులు అందడంతో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విచారణ చేయించారు. వారు డబ్బులు వసూలు చేసింది నిజమేనని నిర్ధారణ కావడంతో వారిని సస్పెండ్ చేశారు.

జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల నిరాకరణ చెల్లదు

» అక్రిడిటేషన్ రూల్స్‌లో కొంతభాగాన్ని కొట్టిసిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చిన్న పత్రికల్లో పనిచేసే జిల్లా, నియోజకవర్గ స్థాయి జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు కార్డు) ఇవ్వకుండా దూరం పెట్టడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ - 2016లోని షెడ్యూల్ 'ఈ' ని కొట్టేస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది. చిన్న వార్తాపత్రికలను నాలుగు విభాగాలుగా విభజించడం చెల్లదని పేర్కొంది. 2016లో జీవో 239 ద్వారా అప్పటి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సవాల్ చేస్తూ మహబూబ్‌నగర్‌కు చెందిన తాటికొండ కృష్ణ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. 'చిన్నపత్రికల్లో పనిచేసే జర్నలిస్టులను ఏ,బీ,సీ,డీ కేటగిరీలుగా ఎందుకు విభజించారో సరైన వివరణ లేదు. తగిన వివరణ, సమర్థన లేకుండా మిగతావారితో సమానంగా గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం చెల్లదు. రెండు నెలల్లో పారదర్శక, హేతుబద్ధమైన ప్రాతిపదికన మార్గదర్శకాలు రూపొందించాలి' అని ఆదేశించింది.

ఆల్మట్టి నుంచి సాగర్ దాకా!

(మొదటిపేజీ తరువాయి)

స్విచ్చాన్ చేసి మరో 4 గేట్లను ఎత్తారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో 10 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 73,630 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువనుంచి వరద రాక స్థిరంగా కొనసాగుతుండటంతో సాయంత్రం 5 గంటలకు మరో 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు మరో రెండు గేట్లు, రాత్రి 10 గంటలకు మరో 4 గేట్లు ఎత్తారు. దీంతో మొత్తం 20 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,50,580 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, సోమవారం రాత్రి 10 గంటలకు 584.80 అడుగులుగా ఉంది. కుడికాల్వ ద్వారా 8,221 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6.325 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,501 క్యూసెక్కులు, 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,50,590 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ నుంచి మొత్తం 1,96,027 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. కాగా, ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టు రెండు గేట్లనుంచి 32,390 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 131.88 అడుగులుగా (7.10 టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టుకు 67,112 క్యూసెక్కుల వరద వస్తోంది.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద తగ్గుతున్నది. సోమవారం డ్యాం సైట్ వద్ద 3,44,218 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతుండగా సోర్స్ ప్రాజెక్టులైన జూరాల, సుంకేశుల నుంచి 3,69,067 క్యూసెక్కుల వరద విడుదలవుతోంది. వరద తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం జలాశయం గేట్ల ఎత్తును కూడా తగ్గించారు. పది గేట్లు 12 ఫీట్ల మేరకు ఎత్తి 3,10,840 క్యూసెక్కులను, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,857 క్యూసెక్కులు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26,481 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల పెంపు..

ఎగువన ఉన్న జలాశయాలకు వరద తగ్గుముఖం పడుతుండటంతో ఖాళీ చేసిన జలాశయాల్లో క్రమంగా నిల్వలను పెంచుకుంటున్నారు. ఈ నెల 3న ఆల్మట్టిలో 72.89 టీఎంసీలుండగా... సోమవారం 83.91 టీఎంసీలకు చేర్చారు. నారాయణపూర్‌లో 28.88 టీఎంసీలుండగా.. 31.93 టీఎంసీలకు చేర్చారు. తుంగభద్రలో 98.26 టీఎంసీలుండగా.. 100.52 టీఎంసీలకు పెంచుకున్నారు. కృష్ణా క్యాచ్‌మెంట్ ఏరియాలో కృష్ణా ఉపనది ఘటప్రభకు భారీగా వరద వస్తుండగా, పంచగంగా నుంచీ భారీగానే వరద వచ్చిచేరుతోంది. మహారాష్ట్ర భీమానదిపై ఉజ్జయిని ప్రాజెక్టుకు 2.05 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.27 లక్షల క్యూసెక్కులను కిందకు వదిలారు. పుణె, కొల్హాపూర్‌లో వర్షాలతో ఈ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది.



నిండు కుండను తలపిస్తున్న సాగర్ జలాశయం



సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లను ఎత్తి నీటి విడుదల చేసేందుకు స్విచ్ఆన్ చేస్తున్న ప్రాజెక్టు సీఈ నాగేశ్వర్‌రావు

శ్రీరాంసాగర్‌కు జలకళ

నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.5టీఎంసీ)లు కాగా.. సోమవారం సాయంత్రానికి 1080 అడుగుల (45 టీఎంసీల) మేర నీటి నిల్వ ఉంది. మొత్తమ్మీద వరుస వర్షాలతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. మరోవైపు పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టులోకి 7,822 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల నుంచి మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.091 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి ఒక మోటార్ నిలిపి వేసి 3 మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	83.91	291028	210000
నారాయణపూర్	37.64	31.93	210000	189700
తుంగభద్ర	100.86	100.52	82772	149202
జూరాల	9.66	8.45	290000	50152
శ్రీశైలం	215.81	204.79	344218	375178
నాగార్జునసాగర్	312.05	294.55	374713	196027
సింగూరు	29.91	14.71	391	391
శ్రీరాంసాగర్	80.5	45.16	16229	743
కడెం	7.6	6.67	1433	957
ఎల్లంపల్లి	20.18	14.11	8917	13047
మేడిగడ్డ	16.17	6.07	373500	373500
సమ్మక్క	6.94	6.94	558200	558200
సీతమ్మ	36.57	0.2	604823	604823

టీఎంసీలు | క్యూసెక్కులు

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభం

సిరిసిల్ల జిల్లాలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు సోమవారం ప్రారంభయయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యమున్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.76 టీఎంసీలే ఉన్నాయి. యాసంగి సీజన్‌లో అన్నపూర్ణలో నీరు లేకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వందలాది ఎకరాల విస్తీర్ణంలో పంటలు ఎండిపోయాయి. దీంతో రైతుల విజ్ఞప్తి మేరకు ప్రస్తుత ప్రభుత్వం స్పందించి మధ్య మానేరులో 10.03 టీఎంసీల నీరు ఉండడంతో ఎత్తిపోతలను ప్రారంభించింది. రెండు మోటార్ల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని ప్రతీ రోజు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయడం ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వైద్యుల బదిలీలు ఆపండి

వైద్యశాఖ మంత్రి రాజనర్సింహ ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యుల బదిలీలను నిలిపివేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గాంధీ, ఉస్మానియాల్లో వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారమిక్కడ మంత్రి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'డాక్టర్లు ఏరీ' కథనం చర్చకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 80 ప్రకారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో నాలుగేళ్ల సర్వీసు పైబడి, ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలను 40 శాతం మించకుండా చేపట్టినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. బదిలీల కారణంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 7 ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషాలిటీ సేవలు అందించేందుకు సగటున 4-5 విభాగాల్లో నిపుణులైన వైద్యుల ఖాళీలున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీగా ఉన్న పోస్టులను ఈ నెల 10లోగా భర్తీ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇటు నగరంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 407 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు.

4 ఏళ్లు దాటిన వారే బదిలీ: డీఎంఈ

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల బదిలీలపై డీఎంఈ స్పందించారు. ఒకేచోట నాలుగేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేస్తున్న వారినే బదిలీ చేశామని తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డాక్టర్లు ఏరీ' వార్తకు డీఎంఈ ఈ మేరకు వివరణ ఇచ్చారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా ఉండడానికి కొంత మంది సూపర్ స్పెషాలిటీ వైద్యులు, సీనియర్ సర్జన్లను బదిలీ చేయలేదని పేర్కొన్నారు.

బది'లీలలు' చూడండి సారూ!

వైద్యశాఖ బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు

వైద్యమంత్రి, సీఎంకు ఫిర్యాదులు..

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సాధారణ బదిలీల్లో చోటుచేసుకున్న అక్రమాలు, వసూళ్ల పర్వం, మోడిఫికేషన్ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలంటూ సర్కారును తెలంగాణ మెడికల్ జేఏసీ ప్రతినిధి మహేలా డిమాండ్ చేశారు. సంఘాల పేరుతో సాధారణ బదిలీల నుంచి కొంతమంది డాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా మినహాయింపు పొందారని, దీనిపై విజిలెన్స్ విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబురావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై పలు వైద్య సంఘాలు, టీ మెడికల్ జేఏసీతో పాటు కొందరు వైద్యులు, స్టాఫ్ నర్సులు, ప్రొఫెసర్లు కూడా ఫిర్యాదు చేశారు. తమ ఫిర్యాదులను వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కర్ణన్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చోంగ్తూలతో పాటు వైద్య మంత్రి దామోదర, సీఎం రేవంత్‌కు కూడా ఇచ్చినట్లు సమాచారం.

స్పీకర్ నిర్ణయం తీసుకునేదెప్పుడు?

» ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను ఎన్ని రోజులు పెండింగ్ పెట్టాలి?: హైకోర్టు

» తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం: ఏజీ

» విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభ స్పీకర్ ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారని హైకోర్టు ప్రశ్నించింది. ఆరు నెలలా? ఏడాదా? రెండేళ్లా? మూడేళ్లా? ఎంత సమయం పడుతుంది? అని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించింది. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేలా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్లను ఎన్నిరోజులు పెండింగ్‌లో ఉంచాలని అడిగింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ కొనసాగించారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు కొనసాగిస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున న్యాయవాదులు ప్రస్తావించిన కైశం మేఘచంద్రసింగ్, రాజేంద్రసింగ్ రాణా, కిహోటో హోలోహన్ కేసులు ప్రస్తుత సందర్భానికి వర్తించవని తెలిపారు. అత్యంత తాజాగా జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన మహారాష్ట్రకు సంబంధించిన 'సుభాష్ దేశాయ్ వర్సెస్ మహారాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ' కేసును ప్రస్తావించారు. అందులో సుప్రీంకోర్టు 'తగిన సమయం (రీజనబుల్ టైం)' అని ప్రస్తావించిందే తప్ప.. కచ్చితమైన సమయాన్ని నిర్దేశించలేదని పేర్కొన్నారు. గతంలో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన 'ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్సెస్ తలసాని శ్రీనివాస్‌యాదవ్' కేసు ఇప్పటికీ అమలులో ఉందని గుర్తుచేశారు. స్పీకర్ అధికారాల్లో జోక్యానికి హైకోర్టు నిరాకరించిందని వెల్లడించారు. స్పీకర్ అధికారాలకు సంబంధించి 'ఎస్ఏ సంపత్‌కుమార్ వర్సెస్ కాలె యాదయ్య' కేసును సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేశారని తెలిపారు. ఈ మొత్తం తీర్పుల నేపథ్యంలో స్పీకర్ 'తగిన సమయంలో' నిర్ణయం తీసుకుంటారని అన్నారు. స్పీకర్ ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోక ముందే కోర్టు జోక్యం చేసుకోవడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత వ్యవహారంలో పిటిషనర్లు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దురుద్దేశంతో వ్యవహరించారని, అనర్హత పిటిషన్‌లు సమర్పించి పట్టుమని పదిరోజులు కూడా కాకముందే కోర్టుకు వచ్చారని తెలిపారు. దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదిస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫు న్యాయవాదులు ప్రస్తావించిన కేసుల సందర్భాలు, ప్రస్తుత విషయం వేర్వేరని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ ఏజీ ఆరోపణలను తోసిపుచ్చారు. నెల రోజుల తర్వాత అనర్హత పిటిషన్‌లు దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా, తదుపరి వాదనలు మంగళవారానికి వాయిదా పడ్డాయి.

పాల్వంచ కేటీపీఎస్ కూలింగ్ టవర్ల కూల్చివేత

» కాలం చెల్లిన విద్యుత్తు కేంద్రాల తొలగింపులో భాగంగా జెన్‌కో చర్యలు

» 58 ఏళ్ల నాటి నిర్మాణాలు నేలమట్టం

పాల్వంచ, ఆగస్టు 5: అవి 58 ఏళ్ల నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన గుర్తులు.. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలి విద్యుత్తు వెలుగులు అందింది అక్కడి నుంచే.. తొలి తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకుంది అక్కడే.. 100 మీటర్లపైన పొడువుతో ఎంతో గంభీరంగా కనపడే పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) కూలింగ్ టవర్లు క్షణాల్లో నేలమట్టమయ్యాయి. పాల్వంచ కేటీపీఎస్ కార్యకలాపాలు, నిర్వహణ (ఓ అండ్ ఎం) కూలింగ్ టవర్ల కూల్చివేత పనులు ఎట్టకేలకు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. కాలం చెల్లిన విద్యుత్తు కేంద్రాలను కూల్చేయాలని కేంద్రం ఆదేశాలివ్వడంతో.. కేటీపీఎస్ పాత ప్లాంట్‌ను తొలగించేందుకు జెన్‌కో యాజమాన్యం చర్యలు చేపట్టింది. 2020లోనే కర్మాగారాన్ని మూసేసింది. కర్మాగారంలోని తుక్కు సామగ్రిని తీసుకోని, కూల్చేందుకు ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్టు అప్పగించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ కంపెనీ.. సుమారు 30 మంది సిబ్బందితో పేలుడు పదార్థాలను ఉపయోగించి సాంకేతికత సాయంతో 8 భారీ కూలింగ్ టవర్లను క్షణాల్లో నేలమట్టం చేసింది. 1966లో ఏపీఎస్ఈబీ పాల్వంచలో విద్యుదుత్పత్తి కోసం కేటీపీఎస్ కర్మాగారాన్ని (ఏ, బీ, సీ యూనిట్లను) ప్రారంభించింది. మొత్తం 3 యూనిట్ల ద్వారా 720 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించింది. అప్పట్నుంచి నిరంతరాయంగా విద్యుదుత్పత్తి చేస్తూ పాల్వంచ కేటీపీఎస్ ఎన్నో మైలురాళ్లను చేరుకుంది. ఖమ్మం, కొత్తగూడెం పేరు తెలియని రోజుల్లోనే పాల్వంచ పేరును కేటీపీఎస్ దేశానికి పరిచయం చేసింది. గత చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన కేటీపీఎస్ కూలింగ్ టవర్లను కూల్చడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.



కూలుతున్న కేటీపీఎస్ కూలింగ్ టవర్లు

తెలంగాణలో త్వరలోనే ఉప ఎన్నికలు!

» పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు తప్పదు

» వారికి ప్రజా క్షేత్రంలోనే బుద్ధి చెబుతాం: కేటీఆర్



న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఆ పార్టీ అధినాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తెలంగాణలో త్వరలోనే ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెబుతామన్నారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో మకాం వేశారు. గతంలో ఒకసారి హరీశ్‌రావుతో కలిసి ఢిల్లీకి వచ్చి మూడు రోజులు న్యాయ నిపుణులతో చర్చించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఢిల్లీ వేదికగానే న్యాయ పోరాటం చేస్తామని గత నెల 9న మీడియాతో చెప్పారు. త్వరలోనే మళ్లీ ఢిల్లీ వచ్చి రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌ను కలిసి పరిస్థితిని వివరిస్తామని కేటీఆర్ తెలిపారు. చెప్పినట్లుగానే నెల రోజులు తిరక్కముందే మరోసారి ఢిల్లీ వచ్చారు. ఈ సారి కేటీఆర్‌తోపాటు హరీశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, న్యాయవాది మోహిత్‌రావు ఉన్నారు. శనివారం సాయంత్రమే ఢిల్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలు ఆది, సోమవారాలు పూర్తిగా ఎమ్మెల్యేల ఫిరాయింపులపైనే దృష్టి కేంద్రీకరించారు. అందులో భాగంగానే సోమవారం రాజ్యాంగ నిపుణులు చెట్పట్ ఆర్యమా సుందరాన్ని కలిశారు. మణిపూర్‌కు సంబంధించిన ఎమ్మెల్యేల ఫిరాయింపులు సహా సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని ఆర్యమా సుందరం బీఆర్ఎస్ బృందానికి తెలిపారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఎక్కువకాలం నాన్చలేరని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తో పాటు స్పీకర్‌కు చేసిన ఫిర్యాదు, సంబంధిత పత్రాలను బీఆర్ఎస్ నేతలు న్యాయ నిపుణులకు అందించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు తెలిపారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు చెబుతున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణలో తప్పనిసరిగా ఉప ఎన్నికలు వస్తాయన్నారు. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ద్వారా నెల రోజుల్లో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తేలిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెబుతామన్నారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా పడింది. తనను అక్రమంగా అరెస్టు చేశారని, చార్జిషీటే సరిగా లేదని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం సీబీఐ ప్రత్యేక జడ్జి కావేరి బవేజా విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరని, తమకు సమయం కావాలని కవిత తరఫున న్యాయవాది కోరగా.. బుధవారం తుది వాదనలు వినిపించాలని జడ్జి ఆదేశించారు. గతంలోనే రెండుసార్లు బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ట్రయల్ కోర్టు ఈ సారి ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. కాగా, మంగళవారం ఉదయం కవితను తిహాడ్ జైలులో ఆమె సోదరుడు కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్యే హరీశ్‌రావు కలిసే అవకాశం ఉంది.

నీళ్లివ్వడం చేతకాక కాళేశ్వరంపై నెపం

» పంటలు ఎండుతున్నా స్పందన లేదు: జగదీశ్ రెడ్డి

» ప్రజల గొంతెండుతున్నా స్పందించరా?: గంగుల

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వ్యవసాయానికి నీళ్లివ్వడం చేతకాక కాళేశ్వరంపై నెపం వేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఎనిమిది నెలలుగా పాలన పడకేసిందని, ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలు, దాడులు తప్ప రేవంత్ సర్కారు చేసిందేమీ లేదని మండిపడ్డారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో యాసంగిలోనే భారీగా దిగుబడి వచ్చేదని, కానీ ఈసారి యాసంగి (రబీ) పంటకు నీళ్లివ్వలేదని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి లక్షలాది టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని తెలిపారు. ఆ నీటిని కాలువల ద్వారా చెరువులు నింపే అవకాశమున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. ఉద్దేశ పూర్వకంగానే సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల గొంతెండుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గోదావరి నీరు వృథాగా పోతున్నా.. కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఇకనైనా కన్నెపల్లి పంప్ ఆన్ చేసి మిడ్ మానేరు నింపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పంటలు ఎండిపోతుంటే రైతులను గాలికొదిలేసి సీఎం, మంత్రులు విదేశీ పర్యటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు.

15న సీతారామ పంపుహౌస్‌ల ప్రారంభం

» వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ సభ: తుమ్మల



వైరా, ఆగస్టు 5: దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఆగస్టు 15న ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను జాతికి అంకితం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా వైరాలో లక్ష మంది రైతులతో బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. సభా స్థలాన్ని ఖమ్మం కలెక్టర్ ముజ్మమిల్‌ఖాన్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ తదితరులతో కలిసి సోమవారం తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 5న సాగర్ జలాలను విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఒకవైపు కృష్ణా జలాలు, మరోవైపు గోదావరి జలాలు వైరా రిజర్వాయర్ సహా ఖమ్మం జిల్లాలో ఆగస్టు 15 నాటికి ప్రవహించనున్నాయని తెలిపారు. అలాగే రైతు రుణమాఫీకి సంబంధించి కూడా సీఎం రేవంత్‌రెడ్డి వైరా సభలో స్పష్టమైన ప్రకటన చేస్తారని చెప్పారు. ఆగస్టు 15న రైతు దినోత్సవంగా జరుపుకోబోతున్నామని వెల్లడించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత ప్రాంతంలో సీఎం బహిరంగ సభ నిర్వహించేందుకు ఆయన కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

పరిశ్రమలు స్థాపించే యువతకు రుణాలు: భట్టి

» మధిరలో ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన



మధిరరూరల్, ఆగస్టు 5: యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు ఇప్పించి, వసతులు కల్పిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు సమాజంలో అన్ని వర్గాలను ప్రోత్సహించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలం యండపల్లి గ్రామంలో 84 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రీయల్ పార్క్‌కు సోమవారం భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... అందరూ వ్యవసాయ రంగంపైనే ఆధారపడితే క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఇబ్బందిపడతామని హితవు పలికారు. బాగా చదువుకున్న యువత పరిశ్రమల వైపు మళ్లితే ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. గ్రామాల్లో వ్యాపారం చేసేవారు కాలనుగుణంగా తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాంటి వారికి ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌కు రూ.44కోట్ల నిధులు కేటాయించామని, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

» అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోం: ఉత్తమ్

కోదాడ, ఆగస్టు 5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతులు చెరువులు, కుంటలు నింపుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాగర్ ఎడమ కాల్వకు ఇప్పటికే నీటిని విడుదల చేశామని, క్రమంగా నీటి విడుదల స్థాయిని పెంచుతున్నట్లు తెలిపారు. నీటి పారుదల శాఖ అధికారులు చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఆర్‌అండ్‌బీ, పీఆర్‌ల శాఖల పరిధిలో రహదారుల విస్తరణకు రూ.323 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ 'ఓటర్ల జాబితా'కు త్వరలో షెడ్యూల్

» గతంలో పేరున్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి: సీఈవో

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న మూడు శాసన మండలి స్థానాల ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. వచ్చే ఏడాది మార్చి 29న పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం ముగియనుంది. ఈ మేరకు సెప్టెంబర్ 9 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడతామని అందుకోసం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలతోపాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీకి కూడా త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సీఈవో తెలిపారు. నవంబరు 6 వరకు ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని, అదే నెల 23న ముసాయిదా ప్రకటిస్తామని చెప్పారు. డిసెంబర్ 25 వరకు అభ్యంతరాలను స్వీకరించి 30వ తేదిన తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అయితే గతంలో ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే చేతికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు!

మిర్యాలగూడ, ఆగస్టు 5: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కుల పంపిణీకి మాజీ ఎమ్మెల్యే రంగం సిద్ధం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా రూ. 13.76 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 44 మంది లబ్ధిదారులకు మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు అందజేయనున్నట్లు ఆ పార్టీ నేతలు సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం వెలుగుచూసింది. ప్రస్తుత ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వద్దకు 515 చెక్కులు రావల్సి ఉండగా, 471 చెక్కులు అందాయి. స్థానిక ప్రజాప్రతినిధికి తెలియకుండా చెక్కులు బీఆర్‌ఎస్ నేతలకు అందడంపై ఎవరి ప్రమేయం ఉందన్న విషయమై అధికార పార్టీ నేతలు అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావును వివరణ కోరగా... ఎమ్మెల్సీ కోటాలో మంజూరైన చెక్కులుగా బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయని, వాటిని పార్టీ కార్యాలయంలో కాకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి దృష్టికి తెచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

రుణమాఫీ దక్కనివారి వివరాలు పంపండి

» రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పోరాడుతుంది: నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంక్షలుపెట్టి అరకొరగా రుణమాఫీ చేసి అంతా అయిపోయినట్లు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రమింపచేస్తోందని, అన్నదాతలు బ్యాంకులచుట్టూ తిరుగుతూ పడిగాపులు గాస్తున్నారని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ దక్కని వారి తరఫున బీఆర్‌ఎస్ పోరాటం చేయనుందని, నష్టపోయిన రైతులు తమ వివరాలను వెల్లడించాలని కోరారు. ఇందుకోసం ప్రత్యేకసెల్ ఏర్పాటుచేశామని పట్టాదారు పాస్‌బుక్ ఉండి రూ. లక్షన్నర వరకు రుణమాఫీ దక్కని. రైతులు తమ వివరాలను 8374852619 వాట్సప్ నంబర్‌కు పంపాలన్నారు. వారికి రుణమాఫీ దక్కేలా ఉద్యమిస్తామని తెలిపారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

» జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు ఆర్ కృష్ణయ్య వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంసరాజ్ గంగారాంను రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ కార్యాలయంలో హంసరాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి 2 లక్షల కోట్లు కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ భారీ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

పరిజ్ఞానంలో మరింత విస్తరించాలన్న కంపెనీ లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్‌లో కొత్త క్యాంపస్ నెలకొల్పనున్నట్లు సీఈవో రవికుమార్ వెల్లడించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారుల బృందం న్యూజెర్సీలోని కాగ్నిజెంట్ ప్రధాన కార్యాలయంలో సీఈవో రవికుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో కంపెనీ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయు) కుదుర్చుకుంది.

ఐటీకి మరింత అనుకూల వాతావరణం..

ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కాగ్నిజెంట్‌తో ఎంవోయూ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు. కంపెనీకి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని, ఈ విస్తరణతో రాష్ట్రంలో వేలాది మంది యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఐటీ సేవలను విస్తరించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు కంపెనీ ప్రతినిధులు సానుకూలత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రముఖ టెక్ కంపెనీలన్నీ హైదరాబాద్ వైపు చూస్తున్నాయని, ఇక్కడ కొత్త కేంద్రాన్ని స్థాపించాలనే కాగ్నిజెంట్ నిర్ణయం హైదరాబాద్ వృద్ధికి మరింతగా దోహదపడుతుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ, ఐటీ, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించింది.

పెట్టుబడులతో తెలంగాణకు రండి..

ప్రవాస భారతీయులు తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పది రోజుల అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం సోమవారం అమెరికా చేరుకున్నారు. న్యూజెర్సీలో ప్రవాస తెలంగాణ వాసులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలివచ్చారు. అంతకుముందు దారి పొడవునా భారీ ర్యాలీతో రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికీ తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్‌గా లభిస్తుంది. మీ నైపుణ్యాలు, ప్రతిభాపాటవాలతో అమెరికాను ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా మార్చారు. అత్యంత పటిష్ట, సంపన్న దేశంగా అభివృద్ధి చెందడంలో మీ పాత్ర అత్యంత కీలకం. ఇప్పుడు సొంత రాష్ట్రానికి మీ అవసరం ఉంది. ఇక మీ ప్రతిభ, నైపుణ్యాలు తోడైతే హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేయవచ్చు" అని రేవంత్ అన్నారు. గతేడాది టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో అమెరికాకు వచ్చానని, పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పానని గుర్తు చేశారు. తాను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడా తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు.

అబద్దాలకోరు మాటలు తప్పు అని నిరూపిస్తాం

"ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది. గిట్టని వాళ్లందరూ కాంగ్రెస్ అధికారంలోకే రాదన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అభివృద్ధి మందగిస్తుందంటూ లేనిపోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్దాలకోరుల మాటలు తప్పు అని నిరూపిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకువస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ఎన్నారైలు అభినందించారు. హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యేకంగా ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే పాటలు, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎన్నారైలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హోల్డింగ్స్ రాబోయే ఐదేళ్లలో తెలంగాణలో నెలకొల్పే స్టార్టప్‌లలో దాదాపు రూ.839 కోట్ల (వంద మిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. అలాగే మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నెలకొల్పిన వి-హబ్‌లో రూ.42 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో వాల్ష్ కర్రా కంపెనీకి చెందిన ఫణి కర్రా, గ్రేగ్ వాల్ష్, వి-హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.



న్యూజెర్సీలో తెలంగాణ ప్రవాసీలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి

జయశంకర్ సార్.. నిన్ను మరువం: సీఎం రేవంత్

ప్రత్యేక రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా జీవితాంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్‌సార్‌ను తెలంగాణ సమాజం సదా గుర్తుంచుకుంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్రాన్ని, ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని, అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనంతో తెలంగాణ ప్రాంతం, ప్రజలు ఏ విధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత జయశంకర్‌దేనని కొనియాడారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని, ఆయన ఆశయ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రేవంత్ తెలిపారు.

అమెరికా వెళ్లిన కోమటిరెడ్డి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం అమెరికా వెళ్లారు. అక్కడి పలు కంపెనీల సీఈవోలతో ఆయన భేటీ కానున్నారు. నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం.. బేరింగ్, ఇతర మరమ్మతుల కారణంగా ఏళ్ల తరబడి ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన అధునాతన బేరింగ్ యంత్రాలను సమకూర్చే కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశం కానున్నారు. ఇందులో భాగంగానే ఆగస్టు 12న ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ ఉత్పత్తి కంపెనీ సీఈవో లాక్‌హోమ్‌తో భేటీ కానున్నారు. కాగా, 7న అమెరికాలోని ప్రవాస భారతీయ నేతలతో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌తో కలిసి కోమటిరెడ్డి పాల్గొననున్నారు.

తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

» న్యూజెర్సీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



హైదరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్ర వ్యవహరిస్తారని సీఎం రేవంత్ ప్రకటించారు. సోమవారం న్యూజెర్సీలో తెలంగాణ ప్రవాసుల సభలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. కొద్దిరోజుల్లో ఆనంద్ మహీంద్ర బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. తెలంగాణ యువతను ప్రపంచంలోనే ఉత్తమ నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటైన స్కిల్ యూనివర్సిటీకి అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖుడినే చైర్మన్‌గా నియమిస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఆనంద్ మహీంద్ర ఇటీవల హైదరాబాద్‌లో సీఎంని కలిసిన సందర్భంలోనూ స్కిల్ యూనివర్సిటీపై చర్చలు జరిపారు.

ఆ 4 వైద్య కళాశాలలపై ఎన్‌ఎంసీకి మరోసారి అప్పీల్

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) నుంచి అనుమతులు రాని నాలుగు కొత్త వైద్య కళాశాలలపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లింది. మొత్తం 8 కళాశాలలకు దరఖాస్తు చేయగా నాలుగింటికే గతవారం ఎన్ఎంసీ లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌వోపీ) ఇచ్చింది. ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి వైద్య విద్య ప్రవేశాలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీలకు అనుమతులు ఇవ్వలేదు. వీటి ఎల్‌వోపీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రెండోమారు అప్పీల్ చేసింది. ఈ కాలేజీల్లో లోపాలను నిర్ణీత సమయంలోగా సరిచేస్తామని ఎన్ఎంసీకి తెలిపింది. ఈ నెల 13లోగా దరఖాస్తు ప్రక్రియ ముగియనుంది. ఆలోగా అనుమతులు వస్తే విద్యార్థులు ఆ కొత్త కాలేజీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది.

సీఐపై కన్నవారి ఫిర్యాదు

» ఆస్తిలో వాటా ఎక్కువే ఇచ్చినా మరింత ఇవ్వాలంటూ వేధిస్తున్నాడని ఆవేదన

ఖిల్లాఘణపురం, ఆగస్టు 5: ఓ పోలీసు ఉన్నతాధికారిపై ఆయన తల్లిదండ్రులే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్తిలో మరింత వాటా ఇవ్వాలంటూ తమను కష్టాలు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోపణలెదుర్కొంటున్న ఆ అధికారి రాచకొండ మల్టీజోన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ నాగేశ్వర్ రెడ్డి!! ఫిర్యాదు చేసింది ఆయన తల్లిదండ్రులు రఘునాథ్ రెడ్డి, బొజ్జమ్మ. ఈ దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికొచ్చి నాగేశ్వర్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. రఘునాథ్ రెడ్డి పేరిట 18 ఎకరాలు, తల్లి బొజ్జమ్మ పేరు మీద 12 ఎకరాల భూమి ఉండేది. సీఐ నాగేశ్వర్ రెడ్డి ఆస్తిలో ఎక్కువ వాటా 20 ఎకరాలు ఇవ్వాలని గొడవ చేయడంతో పెద్ద మనుషుల సమక్షంలో నాగేశ్వర్ రెడ్డికి 15 ఎకరాలు, యాదిరెడ్డికి 11 1/2 ఎకరాలు, ఇద్దరు కూతుళ్లకు కలిపి ఒకటిన్నర ఎకరాలు 2024 జనవరి 2వ తేదీన రిజిస్ట్రేషన్ చేశారు. వృద్ధాప్యంలో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో 2 ఎకరాలు తమ పేరు మీదే ఉంచుకున్నారు. అదనంగా మరో 5 ఎకరాలు ఇవ్వాలని తమ్ముడు యాదిరెడ్డిని సీఐ నాగేశ్వర్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.. గతంలో తమపైనా రెండుసార్లు దాడి చేశాడని, ఆ ఆవేదనతో చనిపోవాలనుకున్నామని చెప్పారు. తమకు రక్షణ కల్పించాలని డీజీపీని కోరారు.

స్కిల్ వర్సిటీ రోడ్డు నిర్మాణంపై దృష్టి

కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి 200 ఫీట్ల వెడల్పుతో 18 కిలోమీటర్ల రహదారి

» ఇబ్రహీంపట్నం, కందుకూరుల్లో 297 ఎకరాల సేకరణకు నిర్ణయం



ఇబ్రహీంపట్నం/కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట-బేగరికంచ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి కొంగరకలాన్ ఔటర్ రింగు రోడ్డు నుంచి నేరుగా వేయనున్న రోడ్డు కోసం భూసేకరణ ప్రక్రియపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. 18 కి.మీ. మేర 200 ఫీట్ల వెడల్పుతో 8 లేన్ల రహదారి వేయనున్నారు. ఆరు లేన్ల ప్రధాన రహదారి, రెండు వైపులా సర్వీస్ రోడ్లను నిర్మించనున్నారు. ఇందుకు ఇబ్రహీంపట్నం, కందుకూరు మండలాల్లో 297.12 ఎకరాలను సేకరించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో 66.35 ఎకరాలు, ఎలిమినేడులో 36.17 ఎకరాలు(ఇది పూర్తిగా అటవీ ప్రాంతం) సేకరించనున్నారు. కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో 54.39 ఎకరాలు, రాచులూరులో 20.29ఎకరాలు, గుమ్మడవెల్లిలో 49.32(ఇందులో కొంత ఫారెస్టు భూములున్నాయి) ఎకరాలు, పంజగూడలో 19.19ఎకరాలు, మీర్ఖాన్‌పేట్‌లో 49 ఎకరాలు రహదారి కోసం అవసరమని అధికారులు గుర్తించారు. పంజాగూడ, మీర్ఖాన్‌పేటలకు సంబంధించి అవసరమైన భూములు ఇప్పటికే టీజీఐఐసీ ఆధీనంలో ఉన్నాయి. మొత్తంగా 50 ఎకరాలు ప్రభుత్వ భూములు, 50 ఎకరాలు అటవీ భూములు పోను మరిన్ని పట్టా భూములను సేకరించాల్సి ఉంది. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయ సందర్శనకు వెళ్లిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక.. ఆర్డీవో అనంతరెడ్డితో ఈ విషయంపై చర్చించారు. వీలైనంత మేర పట్టా భూములు తక్కువ ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచనలు చేశారు.

వర్సిటీ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్..

స్కిల్ యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ప్రముఖ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. సోమవారం కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, బెంగళూరుకు చెందిన ప్రముఖ నిర్మాణ కంపెనీ ప్రతినిధులు మీర్ఖాన్‌పేట, బేగరికంచ గ్రామాల్లో వర్సిటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో గుట్టలు, రాళ్లను తొలగించి చదును చేయాలని నిర్ణయించారు. పనులు ఎలా మొదలుపెట్టాలనే దానిపై అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి వచ్చేలోగా నివేదికలు సిద్ధం చేసేలా అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. సీఎం రాగానే ఆయన అనుమతితో పనులు మొదలు పెట్టేందుకు కృషి చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ నేతలకు అవగాహన లేదు

» కాళేశ్వరంలో నీరు నిల్వ వద్దన్నది ఎన్‌డీఎస్‌ఏనే: విజయరమణారావు

» కులగణన బిల్లు పెట్టాలి: వీహెచ్

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీరు నిల్వ చేయవద్దంటూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) స్పష్టం చేసిన సంగతి బీఆర్‌ఎస్ నేతలకు తెలియదా అని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రశ్నించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్.. కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారంటూ ధ్వజమెత్తారు. సోమవారం సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. రూ.లక్ష కోట్లు అడ్డంగా దోచి కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలిపోయిందన్నారు. ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని దోచిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాగా, పార్లమెంట్‌లో బీసీ కుల గణన బిల్లు పెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్ చేశారు. బీసీ కులానికి చెందిన వ్యక్తి ప్రధాని అయ్యారని నిర్మలా సీతారామన్ చెబుతున్నారని, కానీ బీసీలకు పదేళ్లుగా ఆయన చేసిందేమీ లేదన్నారు. దేశంలో కులగణన జరగాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్‌పై నమ్మకం లేకనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. వారిని ఆపేందుకు కేటీఆర్, హరీశ్‌రావులు చేస్తున్న ప్రయత్నాలు చూస్తుంటే నవ్వు వస్తోందని వ్యాఖ్యానించారు. 'ఆనాడు టీడీఎల్పీని, సీఎల్పీని బీఆర్‌ఎస్‌ఎల్పీలో విలీనం చేసుకున్నప్పుడు కేసీఆర్, కేటీఆర్‌కు సిగ్గనిపించలేదా? రాజకీయాల్లో వారికొక న్యాయం.. ఇతరులకు ఓ న్యాయమా?' అని నిలదీశారు. కేసీఆర్ అవినీతి వల్లనే ప్రజలపై అప్పుల భారం పడిందని టీపీసీసీ అధికార ప్రతినిధి మృత్యుంజయం అన్నారు.

మా రుణాలు మాఫీ కాలేదు!

» సూర్యాపేట, నిజామాబాద్ జిల్లాల్లో రైతుల ఆందోళన

మునగాల రూరల్, కోటగిరి, ఆగస్టు 5: రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ... అర్హులైన తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో చెప్పాలని ఆయా ప్రాంతాల రైతులు సోమవారం బ్యాంకుల ముందు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని రేపాల కెనరాబ్యాంకు ఎదుట కొంతమంది రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ పురుగుల మందు డబ్బాలతో ఆందోళన చేశారు. సమస్య పరిష్కరిస్తామని బ్రాంచ్ మేనేజర్ చెప్పినప్పటికీ.. అక్కడి నుంచి కోదాడలోని ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే పద్మావతిని కలిసి తమ గోడు విన్నవించారు. బ్యాంకు మేనేజర్‌తో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే... సాంకేతిక లోపాలుంటే సరిచేయాలని ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని కల్లూర్‌లోని కెనరా బ్యాంకు ఎదుట రైతులు ధర్నా చేశారు. అర్హత సాధించని రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపించి సమస్యను పరిష్కరిస్తామని ఏవో శ్రీనివాసరావు హామీ ఇవ్వడంతో శాంతించారు.

కేసీఆర్‌కు భూపాలపల్లి కోర్టు తాఖీదులు

మేడిగడ్డ వైఫల్యంపై పిటిషన్.. సెప్టెంబరు 5న హాజరుకావాలన్న కోర్టు.. మరో ఆరుగురికీ నోటీసులు



భూపాలపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుల వైఫల్యంపై భూపాలపల్లి జిల్లా కోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. బ్యారేజీలో జరిగిన నష్టంపై ప్రైవేటు పిటిషన్‌ను విచారించిన భూపాలపల్లి ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు తాఖీదులు జారీ చేసింది. వీరితో పాటు మరో ఆరుగురు కూడా సెప్టెంబరు 5న వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ ఆదేశాలిచ్చింది. ఈ నోటీసులను జిల్లా కోర్టు గత నెల 30న రిజిస్టర్ పోస్టు ద్వారా వారికి పంపింది. రూ.లక్ష కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు 10వ బ్లాకులోని పిల్లర్లు కుంగిపోయి పనికిరాకుండా పోవడానికి ప్రధానంగా ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న అవకతవకలు, పదేపదే డిజైన్లలో మార్పులు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం లాంటి అంశాలే కారణమని.. ఇందుకు బాధ్యులను గుర్తించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి 2023 అక్టోబరు 25న భూపాలపల్లి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధ్యులను గుర్తించాక వారిని విచారించాలని కోరుతూ జిల్లా అదనపు ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో అప్పటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ సంస్థలను కూడా విచారించాలని కోరగా అప్పట్లో ఈ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీనిని రాజలింగమూర్తి హైకోర్టులో సవాలు చేశారు. జిల్లా కోర్టులోనే రివిజన్ పిటిషన్‌ను దాఖలు చేయాల్సిందిగా హైకోర్టు సూచించడంతో తిరిగి పిటిషన్ వేశారు. దీనిని స్వీకరించిన కోర్టు తాజాగా నోటీసులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాన కారకులని, రూ.లక్ష కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కావడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్దేశిత లక్ష్యాలు నెరవేరకుండా పోయాయని, బ్యారేజీ నిర్మాణం సందర్భంగా పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరిగిందని, నాసిరకం పనులతో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కేంద్ర విచారణ సంస్థలు కూడా ఇదే విషయాన్ని వెల్లడించినట్లు పిటిషనర్ చెబుతున్నారు. ఇందుకు బాధ్యులైన కేసీఆర్‌తో పాటు హరీశ్ రావు, నాటి నీటిపారుదల శాఖ కార్యదర్శి రజత్‌కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, అప్పటి చీఫ్ ఇంజనీర్లు హరిరామ్, శ్రీధర్, నిర్మాణ సంస్థల బాధ్యులు ఎల్‌అండ్‌టీ సంస్థకు చెందిన జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్, మెగా సంస్థకు చెందిన యజమాని కృష్ణారెడ్డిని విచారించాలంటూ పిటిషనర్ కోరగా.. సెప్టెంబరు 5న వీరంతా హాజరు కావాలంటూ కోర్టు నోటీసులు జారీ చేసింది.

ఇసుక తరలింపునకూ ఓ యాప్!

- వాట్సాప్ తరహాలో యాప్‌ను తీసుకొచ్చే యోచన
- ఐటీ కంపెనీతో అధికారుల సమాలోచనలు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక తరలింపులో అక్రమాలను అరికట్టేందుకు సరికొత్త విధానాన్ని అనుసరించాలని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ) యోచిస్తోంది. ఇసుక రీచ్‌ల నిర్వహణ, తరలింపు, పర్యవేక్షణ, ఇసుక అమ్మకాలు.. ఇలా అన్నింటినీ ఒకే వేదికగా మానిటరింగ్ చేసేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను గానీ, యాప్‌ను గానీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్, కార్పొరేషన్ ఆపరేషన్స్ జీఎం రాజశేఖర్‌రెడ్డి రెండు రోజుల క్రితం పుర్వ్యా టెక్నాలజీ సర్వీసెస్ సంస్థతో సమావేశమై చర్చలు జరిపారు. ప్రస్తుతం ఇసుక తరలింపునకు లారీ యజమానులు ప్రైవేట్ నెట్ సెంటర్లలో బాట్ సాఫ్ట్‌వేర్ ద్వారా అనుమతులు పొందుతుండగా.. ఈ విధానానికి చెక్‌పెట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు పుర్వ్యా టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయించడమో, వాట్సాప్ తరహాలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడమో చేయాలని యోచిస్తున్నారు. దీని ద్వారానే ఇసుక తరలింపు, బుకింగ్ వంటివి నిర్వహించాలని భావిస్తున్నారు.

వేములవాడలో బ్రేక్ దర్శనం అమలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం బ్రేక్ దర్శనం అమలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా భక్తుల తాకిడి పెరగనుండడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి బ్రేక్ దర్శనం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. యాదాద్రి, తిరుపతి దేవస్థానం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. భక్తులకు ఒక్కరికి రూ.300 టికెట్‌తో ప్రత్యేక దర్శనం అమలు చేస్తున్నామని, టికెట్‌పై 100 గ్రాముల లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. రోజులో రెండుసార్లు బ్రేక్ దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 10:15 నుంచి 11:15 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ప్రత్యేక దర్శనం ఉంటుంది.

ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచారం

ఆసిఫాబాద్, ఆగస్టు 5 : కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని గుండి, గోవిందాపూర్ గ్రామాల సమీపంలో సోమవారం పులి అడుగులను గ్రామస్థులు గుర్తించారు. వ్యవసాయ భూముల్లో పులి అడుగులు కనిపించడంతో రైతులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, ఏఎస్సై రాములు పులి అడుగులను పరిశీలించారు. పులి మండలంలోని గుండి గ్రామం మీదుగా గోవిందాపూర్ వరకు సంచరించినట్లు అడుగుల ద్వారా గుర్తించారు. కొంతకాలంగా అంకుశాపూర్ గ్రామపరిధిలోని కెనాల్ ప్రాంతంలో కనిపిస్తున్న పులి జిల్లాకేంద్రం వైపు వచ్చిందా లేదా కొత్త పులి జిల్లాకు వచ్చిందా అనే కోణంలో అధికారులు పరిశీలిస్తున్నారు.

నాలుగు కొలువులు సాధించిన పేద యువతి


తులసి

కట్టంగూరు, ఆగస్టు 5: ప్రతిభను ఏ ఆటంకం ఆపలేదని, కష్టపడి పడి చదివితే అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది ఆ నిరుపేద యువతి. నాలుగు ఉద్యోగాలకు ఎంపికై పేదరికం ప్రతిభకు అడ్డుకాదనడానికి ఉదాహరణగా నిలిచింది. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం కలిమెర చింతల వెంకన్న-లక్ష్మీ దంపతులకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కూలీ పనులు చేస్తూనే పిల్లలను పోషిస్తూ చదివించుకున్నారు. వారి చిన్న కూతురు తులసి.. ఇటీవల వెల్లడైన గ్రూప్- 4 ఫలితాల్లో అర్హత సాధించింది. అలాగే పాలిటెక్నిక్ అధ్యాపక ఉద్యోగంతో పాటు ఆగస్టులో ఏఈఈ ఉద్యోగానికి, ఏప్రిల్‌లో ఏఈ ఉద్యోగానికి ఎంపికైంది. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన తులసి ప్రస్తుతం మెయిన్స్‌కు సిద్ధమవుతోంది. గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యమని ఆమె చెబుతున్నారు.

గ్రూప్-1 మెయిన్స్ కోసం టీ-శాట్ పాఠాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష రాసే అభ్యర్థులకు టీ-శాట్ ప్రత్యేక పాఠాలు ప్రసారం చేయనుందని ఆ సంస్థ సీఈవో బోదపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. టీ-శాట్.. మెయిన్స్ అభ్యర్థుల కోసం 750 ఎపిసోడ్లను సిద్ధం చేసిందని ఆయన వెల్లడించారు. పాఠ్యాంశాలు ఆగస్టు 6 నుంచి అక్టోబర్ 19 వరకు ప్రసారమయ్యే విధంగా షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. అరగంట నిడివి గల పాఠ్యాంశాలు రోజుకు ఐదు గంటల చొప్పున 10 ఏపిసోడ్లు 75 రోజుల పాటు టీ-శాట్ నెట్‌వర్క్ చానళ్లలో ప్రసారమవుతాయని చెప్పారు. టీ-శాట్ నిపుణ చానల్‌లో ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తిరిగి మరుసటి రోజు ఉదయం 5 నుంచి 10 గంటల వరకు విద్యాచానల్‌లో ప్రసారం చేస్తామని తెలిపారు.

14,077 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్

- జూలై 29 నుంచి క్రమంగా పెరుగుదల

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు గృహ వినియోగం గణనీయంగా పెరగడంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పరుగులు పెడుతోంది. ఖరీఫ్‌లో తొలిసారి భారీ డిమాండ్ నెలకొంది. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో వ్యవసాయ పంపుసెట్ల వినియోగం పెరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. దాంతో సోమవారం ఉదయం 7.47 గంటల సమయంలో 14,077 మెగావాట్లుగా డిమాండ్ రికార్డయిందని అధికారులు వెల్లడించారు. గతేడాది ఇదే సమయంలో రాష్ట్ర డిమాండ్ 12,170 మెగావాట్లు మాత్రమే. విద్యుత్ డిమాండ్ క్రమంగా పెరుగుతుండటం గమనార్హం. జూలై 28న 11,647 మెగావాట్లు ఉండగా 29న 13,181 మెగావాట్లుగా రికార్డయింది. ఈ నెల 4న 13,456 మెగావాట్లుగా ఉండగా.. సోమవారం 14,077 మెగావాట్లుగా నమోదయింది. 2023 ఆగస్టు 4న రాష్ట్ర విద్యుత్ వినియోగం 246 మిలియన్ యూనిట్లుగా ఉండగా.. ఈ నెల 4న 268 మిలియన్ యూనిట్లుగా ఉంది. డిమాండ్ అంతకంతకు పెరుగుతుండగా దాన్ని తీర్చడంలో జల విద్యుత్ ఉత్పాదన కీలక పాత్రను పోషిస్తోంది. ఈ నెల 4న రాష్ట్రంలోని వివిధ జలవిద్యుత్ కేంద్రాల్లో 32.39 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రాష్ట్ర అవసరాలు తీర్చారు.

యూనిట్‌కు రూ.1.60 అదనపు సర్‌చార్జీ

- టీజీఈఆర్‌సీలో డిస్కమ్‌ల పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌ల నుంచి కుదుర్చుకున్న ఒప్పందాలను కాదని, బహిరంగ విపణి(ఓపెన్‌యాక్సెస్)లో విద్యుత్‌ను కొనుగోలు చేసే హెచ్‌టీ(హైటెన్షన్) వినియోగదారుల నుంచి 2024-25గాను రెండో అర్ధ వార్షికంలో అదనపు సర్‌చార్జీలు వసూలు చేయనున్నారు. యూనిట్‌కు రూ.1.60 చొప్పున అదనపు సర్‌చార్జీగా వసూలు చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఈ మేరకు పిటిషన్లను తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)లో దాఖలు చేశాయి. దీనిపై ఈ నెల 27 వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తూ సోమవారం టీజీఈఆర్‌సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యంతరాలను టీజీఈఆర్‌సీ కార్యాలయంతో పాటు డిస్కమ్‌ల ప్రధాన కార్యాలయాలు ఎస్పీడీసీఎల్(మింట్‌కాంపౌండ్, హైదరాబాద్), ఎన్పీడీసీఎల్(నక్కలగుట్ట, హన్మకొండ)లకు పంపించే అవకాశం ఉంది. అనంతరం సెప్టెంబరు 18న రెడ్ హిల్స్‌లోని టీజీఈఆర్‌సీలో బహిరంగ విచారణ జరుగనుంది.

'మేడిగడ్డ'ను డ్రోన్‌తో వీడియో తీసిన వ్యక్తిపై కేసు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 5: అనుమతి లేకుండా మేడిగడ్డ బ్యారేజీతో పాటు గోదావరి నది ప్రవాహ ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా వీడియో చిత్రీకరించిన ఓ గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. గతనెల 26న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతల బృందం మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు రాగా వారి పర్యటనను, బ్యారేజీ, గోదావరి వరద దృశ్యాలను ఓ వ్యక్తి డ్రోన్ ద్వారా చిత్రీకరించిన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. అది వైరల్ అవ్వడంతో విషయాన్ని ఇరిగేషన్ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ ఘటనపై గతనెల 30న ఇరిగేషన్ ఏఈఈ వలీ మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

రూ.40 కోట్ల ఆర్థిక మోసం కేసు..

బషీద్‌కు ఆర్‌బీఐ అధికారి సహకారం?

- త్వరలో అతణ్ని విచారించే అవకాశం
- తవ్వినకొద్దీ వెలుగులోకి బషీద్ మోసాలు
- 12.50 కోట్ల ప్రాపర్టీ కొంటానని మోసం
- ఆస్తి కొట్టేసి.. ఈ కేసులో ఇరికించిన బషీద్


నిందితుడు బషీద్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ నుంచి అక్రమంగా రూ.40 కోట్లు కొట్టేసిన కేసులో.. ప్రధాన నిందితుడు బషీద్‌కు భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ)లో పనిచేసే ఓ అధికారి సహకారం ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇండస్‌ఇండ్ బ్యాంక్ మేనేజర్ రామస్వామి, డెలివరీ మేనేజర్ రాజేశ్‌ను ఇప్పటికే ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేయగా.. బషీద్‌ను వారికి పరిచయం చేసింది సదరు ఆర్‌బీఐ అధికారి అని గుర్తించారు. "ఆర్‌బీఐలో పనిచేసే అధికారి ద్వారా మాకు బషీద్ పరిచయం అయ్యాడు. బషీద్‌కు సహకరించాలని ఆ అధికారి సూచించారు. అందుకే అతనికి సహకరించాం" అని నిందితులిద్దరూ వాంగ్మూలం ఇవ్వడంతో.. పోలీసులు మూడ్రోజులు ఢిల్లీలో మకాం వేసి, ప్రధాన నిందితుడు, సినీ నిర్మాత బషీద్‌ను అరెస్టు చేశారు. నిందితులను కోర్టు అనుమతితో పోలీసు కస్టడీకి తీసుకుని, విచారించనున్నట్లు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. కస్టడీలో ముఖాముఖి విచారిస్తే.. ఆర్‌బీఐ అధికారి పాత్ర బయటపడుతుందని అన్నారు. రూ.40 కోట్ల మోసంలో బషీద్ ఉదయ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తిని అడ్డంగా బుక్ చేసి, అతని ఆస్తిని కొట్టేయడమే కాకుండా.. బాధితుడిని కూడా ఈ కేసులో ఇరికించినట్లు పోలీసులు గుర్తించారు. ఉదయ్‌కుమార్‌రెడ్డికి జూబ్లీహిల్స్, యాప్రాల్‌లో రూ.12.50 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. ఆయన వాటిని అమ్మకానికి పెట్టారు. విషయం తెలుసుకున్న బషీద్.. ఆ ఆస్తులను కొనుగోలు చేస్తానని నమ్మబలికాడు. అయితే.. ఇండస్ ఇండ్ బ్యాంకులో ఖాతా తెరిస్తే.. లావాదేవీలు సులభమవుతాయని చెప్పాడు. దానికి ఉదయ్‌కుమార్‌రెడ్డి అంగీకరించడంతో.. బ్యాంకు అధికారులను పిలిపించి, ఖాతా తెరిపించాడు. ఆ తర్వాత ఖాతా ఆన్‌లైన్ యాక్సెస్‌ను తీసుకున్న బషీద్.. "నాకు రూ.40 కోట్ల డబ్బు రావాల్సి ఉంది. వాటి బదిలీకి మీ ఖాతాను వాడుకుంటాను. మీకు రావాల్సిన రూ.12.50కోట్లు అందులో ఉంచి, మిగతావి వేరే ఖాతాలకు బదిలీ చేసుకుంటాను" అని చెప్పాడు. దాంతో ఉదయ్‌కుమార్‌రెడ్డి సరేనన్నారు. ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ నుంచి కొల్లగొట్టిన రూ.40 కోట్లను ఉదయ్‌కుమార్‌రెడ్డి ఖాతాకు బదిలీ చేశారు. ఆ డబ్బును చూపి, ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆస్తులను బషీద్ తన పేరిట రిజిస్టర్ చేయించుకున్నాడు. ఆ తర్వాత రూ.40 కోట్లను వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశాడు. అయితే.. మోసం జరిగిన విషయాన్ని గుర్తించిన ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ అధికారులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. తొలుత బుక్కయింది ఉదయ్‌కుమార్‌రెడ్డి. పోలీసులు అతణ్ని ప్రశ్నించగా.. రూ.12.50 కోట్లకు తన ఆస్తులను అమ్మానని, బషీద్ తన ఖాతాను వాడుకున్నాడని చెప్పారు. బషీద్ అరెస్టయ్యాక ఈ ఆస్తుల విషయంలో ప్లేటు ఫిరాయించడం గమనార్హం. "నేను ఉదయ్‌కుమార్‌రెడ్డి ఖాతాను డబ్బు బదిలీకి వాడుకున్నది నిజమే. అయితే.. ఉదయ్‌కుమార్ రెడ్డికి రూ.12.50కోట్ల నగదు ఇచ్చి ఆస్తులు కొన్నాను" అని చెబుతున్నట్లు తెలిసింది. బషీద్ బదిలీ చేసిన పలు ఖాతాలను గుర్తించిన పోలీసులు.. వాటిల్లోని రూ.37 కోట్లను ఫ్రీజ్ చేశారు.

బడి శుభ్రంగా.. ఆవరణ పచ్చగా!

పాఠశాలల నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు.. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నెలకు రూ.3-20వేల దాకా చెల్లింపు

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా నిర్వహణ



హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటును విడుదల చేసింది. ఈ గ్రాంటు కింద వచ్చే మొత్తంతో పాఠశాలల నిర్వహణలో భాగంగా అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల స్కూళ్లతో పాటు, మోడల్ స్కూళ్లలో గదులు, మురుగుదొడ్ల శుభ్రత, ఆవరణలోని మొక్కలకు నీళ్లు పోయడం, బడి పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి పనులను నిర్వహిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ)ల ద్వారా ఈ నిధులను వినియోగిస్తారు. ప్రస్తుతం ఈ పనులను పంచాయితీరాజ్, మున్సిపల్ విభాగాలు పర్యవేక్షిస్తున్నాయి. ఈ శాఖల ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ పనులు సవ్యంగా జరగడం లేదనే ఆందోళన చాలాకాలం నుంచి ఉంది. పాఠశాలలకే ప్రత్యేక నిధులను కేటాయించడం ద్వారా ఈ సమస్య పరిష్కారం అవుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పాఠశాల పరిశుభ్రత అనేది చాలా ముఖ్యమైన అంశమని భావించిన ప్రభుత్వం ఈ బాధ్యతలను ఈ కమిటీలకు అప్పగించింది. కాగా ఇప్పటికే ఇస్తున్న 'సమగ్ర శిక్ష కంపోజిట్ స్కూల్ గ్రాంటు'కు అదనంగా ఈ గ్రాంటును చెల్లించనున్నారు. విద్యా సంవత్సరంలోని 10 నెలల పాటు ఈ నిధులను చెల్లించనున్నారు. నిధుల వినియోగంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఖాతా నుంచి మొత్తాన్ని డ్రా చేస్తున్నప్పుడు, ఎక్కడా ఏ వ్యక్తి పేరును పేర్కొనవసరం లేదని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ పనుల కోసం ఉద్దేశించిన వ్యక్తులకు ఈ నిధులను నేరుగా ఇవ్వడానికి వీలుగా వెసులుబాటును కల్పించారు. ఈ పనుల కోసం పూర్తి సమయం లేదా పార్ట్ టైమ్ పద్ధతిలో కార్మికులను నియమించుకోవచ్చు. ఈ గ్రాంటును జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నుంచి విడుదల చేయనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు మూడు నెలల ముందుగానే ఈ నిధులను విడుదల చేస్తారు. కాగా, ఈ గ్రాంటను ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి నెలకు రూ.3వేల నుంచి రూ.20వేల దాకా ఇస్తారు.

ప్రభుత్వం మంజూరు చేసిన స్కూల్ గ్రాంట్ వివరాలు (రూ.ల్లో)

విద్యార్థులు	గ్రాంటు
1 నుంచి 30	3,000
31 నుంచి 100	6,000
101 నుంచి 250	8,000
251 నుంచి 500	12,000
501 నుంచి 750	15,000
750కి పైబడి	20,000

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయల పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న పరీక్షలు ముగిశాయి. రాష్ట్రంలో 11062 టీచర్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టుల భర్తీలో భాగంగా గత నెల 18వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు సోమవారంతో ముగిశాయి. కాగా ఈ పోస్టుల కోసం మొత్తం 2,79,957 మంది అభ్యర్థులు దరఖాస్తులను చేసుకున్నారు. ఇందులో 2,45,263 మంది (87.61%) అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

అక్టోబరు 31 వరకు స్కాలర్ షిప్ దరఖాస్తులు

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ కోసం అక్టోబరు 31వ తేదీ వరక దరఖాస్తులను సమర్పించుకోవచ్చని విద్యా శాఖ అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నౌహీరాకు యూఏఈలో ఆస్తులు!

- తాజా సోదాల్లో గుర్తించిన ఈడీ అధికారులు
- కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో ఉన్న రూ.70 కోట్ల ఆస్తులు స్వాధీనం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు అధిక లాభాల పేరుతో లక్షలాది మంది డిపాజిటర్ల నుంచి రూ.వేల కోట్లు కొట్టేసిన కేసులో హీరా సంస్థల అధినేత్రి నౌహీరా షేక్‌కు సంబంధించిన ఆస్తులను స్వాధీనం చేసుకునే పరంపర కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ఈడీ అధికారులు తాజాగా మరిన్ని స్థిర, చరాస్తులు, లెక్కలో చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. హీరా గ్రూప్ సంస్థల ఎండీ నౌహీరా షేక్‌కు సంబంధించిన ఐదు ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపి రూ.90 లక్షల నగదు, బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్ కార్లు, 9 టొయోటా ఫార్చునర్లు, మహీంద్రా స్కార్పియో సహా 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నౌహీరాతోపాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో ఉన్న రూ.45 కోట్ల విలువైన 13 ఆస్తుల పత్రాలు, బినామీల పేరిట ఉన్న రూ.25 కోట్ల విలువైన 11 ఆస్తుల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ రేటు ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ మరింత ఎక్కువగా ఉంటుందని ఈడీ అధికారులు తెలిపారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే ఏడాదికి 36 శాతం లాభాలు వస్తాయని నమ్మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లోని లక్షలాది మంది డిపాజిటర్ల నుంచి రూ.వేల కోట్లు కాజేసిన నౌహీరా వాటిని విదేశాలకు మళ్లించేందుకు సమకూర్చుకున్న పలు పత్రాలు, డిజిటల్ ఆధారాలు సోదాల్లో స్వాధీనం చేసుకున్నారు. భారత్‌లో కొల్లగొట్టిన నగదుతో యూఏఈలో స్థిర, చరాస్తులు కొన్నట్టు ఈడీ అధికారులు గుర్తించారు. గత శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు జరిపిన సోదాలకు సంబంధించిన వివరాలను ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సోమవారం వెల్లడించారు. కాగా, నౌహీరా షేక్ అండ్ కో మరో కొత్త మోసానికి తెరతీసే కుట్రను ఈడీ అధికారులు భగ్నం చేశారు. కొత్తగా నిధుల సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై సిద్ధం చేసుకున్న పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.వేల కోట్ల నిధుల గోల్‌మాల్ కేసులో ఈడీ ఇప్పటికే నౌహీరా షేక్‌కు సంబంధించిన సుమారు రూ.400 కోట్ల విలువైన స్థిర, చరాస్తులు అటాచ్ చేసింది.

ఎక్సైజ్ సిబ్బంది నుంచి తప్పించుకోబోయి..

- నాలుగో అంతస్తు నుంచి పడ్డ ఆటోడ్రైవర్
- తీవ్ర గాయాలు.. చికిత్స పొందుతూ మృతి
- గంజాయి తాగిన తనను పట్టుకునేందుకే వచ్చారన్న భయంతోనే పరుగులు
- సైదాబాద్‌లో ఘటన

సైదాబాద్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ఓ అవగాహన కార్యక్రమం కోసం బస్తీలోకి పోలీసులు రావడం చూసి.. తననే పట్టుకునేందుకు వచ్చారని భయపడ్డాడో ఆటోడ్రైవర్! అంతే.. పరుగు లంఘించుకున్నాడు. అసలే పోలీసులు కదా..? డౌటొచ్చేసింది. ఎందుకు పారిపోతున్నాడో తెలుసుకునేందుకు అతడిని అనుసరించారు. చూస్తుండగానే ఓ భవనంపై ఎక్కేసిన ఆ ఆటో డ్రైవర్ అక్కడి నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. సైదాబాద్ పరిధిలోని సింగరేణి వాంబే కాలనీలో ఈ ఘటన జరిగింది. మృతుడు అదే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఖలీం పాషా(28). శనివారం మధ్యాహ్నం ఖలీం పాషా ఇంటి సమీపంలో కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో అతడు గంజాయి మత్తులో ఉన్నట్లు సమాచారం. ఎక్సైజ్ పోలీసులు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు అక్కడికి వచ్చారు. వారిని చూసిన ఖలీం భాషా, భయంతో పరుగెత్తి సమీపంలోని బిల్డింగ్ ఎక్కాడు. ఖలీంపాషా ఎందుకు పరుగులు తీశాడో అర్థం కాని పోలీసులు అతడిని పట్టుకునేందుకు ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను భవనంపైకి పంపారు. ఆ కానిస్టేబుల్ తనను పట్టుకుంటాడన్న ఆందోళనతో ఖలీం పాషా నాలుగో అంతస్తు నుంచి డ్రైనేజీ పైప్ లైన్ పట్టుకుని కిందకు దిగేందుకు యత్నించాడు. పట్టు తప్పడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా సింగరేణి కాలనీలో విచ్చలవిడిగా కొనసాగుతున్న గంజాయి అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చంపాపేట ప్రధాన రహదారిపై మహిళలు బైఠాయించారు ఫలితంగా అక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ప్లాస్టిక్ సర్జరీతో బాలుడికి చెవి అమరిక

- బీబీనగర్ ఎయిమ్స్ వైద్యుల ఘనత

బీబీనగర్, ఆగస్టు 5: చెవి లేకుండా జన్మించిన ఓ బాలుడికి యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేసి చెవిని అమర్చారు. 11 సంవత్సరాల వయసు గల పిల్లవాడు మైక్రోషియా వల్ల పుట్టినప్పటి నుంచి చెవి లేకుండా ఇబ్బంది పడుతున్నాడు. అనేకమంది వైద్యులకు చూపించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు చివరి ప్రయత్నంగా ఇటీవల ఎయిమ్స్ వైద్యులను సంప్రదించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం డైరెక్టర్ వికాస్ భాటియా, మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ అరోరా పర్యవేక్షణలో ప్లాస్టిక్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మూల రోహిత్ బాబు నేతృత్వంలో ఆఫ్ బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్‌మెంట్ వైద్యులు ఆరు గంటలు శ్రమించి శస్త్రచికిత్సను పూర్తి చేశారు. ఎముక మృదులాస్థిని పక్కటెముక నుంచి తీసి చెవి ఆకారంలో చెక్కి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా చెవిని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు.

పెళ్లికి వేళాయె..

(మొదటి పేజీ తరువాయి)



ఉండటంతో అక్టోబరు 13 దాకా ముహూర్తాలే లేవు. దీంతో 7-28 తేదీల మధ్య తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆగస్టు 7న శుభ ముహూర్తాలు మొదలవనుండగా.. పెళ్లిళ్లు మాత్రం 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 28వ తేదీల్లో జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26న చైత్రమాసంతో పాటు శుక్ర, గురు మూఢాలు మొదలయ్యాయి. తర్వాత వైశాఖ, జేష్ఠ, ఆషాఢ (మే, జూన్, జూలై)మాసాలు కావడంతో ముహూర్తాలు లేవు. అంటే.. ఈ ఏడాది ఏప్రిల్ 26 నుంచి వివాహాలకు అనువైన ముహూర్తాలు లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లోని ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్ వ్యాపారాలకు పెద్దగా వ్యాపారం లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ పెళ్లి ముహూర్తాలు రావడంతో బంగారం వ్యాపారుల నుంచి మొదలు కేటరింగ్, డెకరేషన్ దాకా సంబంధిత విభాగాలకు ఆర్థికంగా ఊతం లభించనుంది. ఒకే నెలలో వరుసగా ముహూర్తాలు ఉండటంతో పురోహితులకూ డిమాండ్ ఏర్పడింది. మంచి ఫంక్షన్ హాళ్లు, డీజేల ఎంపికకూ పెళ్లి కుటుంబాల వారు పోటీపడుతున్నారు. ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న వారంతా ఫంక్షన్ హాళ్లు, డెకరేషన్స్ బుక్ చేసుకున్నారని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కొత్త, కొత్త రకాల వంటలు చేసే నైపుణ్యం ఉన్న వంటవారిని కూడా ముందుగానే బుక్ చేసుకుంటున్నారని ఓ వంటమనిషి చెప్పారు. అయితే అక్టోబరు 13 దాకా ఆగితే అక్కడి నుంచి వచ్చే ఉగాది దాకా పెళ్లి ముహూర్తాలే ఉన్నాయి. కాగా ప్రస్తుతం ఆగస్టులో దాదాపు 10రోజుల పాటు మంచి ముహూర్తాలున్నా.. వాటిలో 11, 18తేదీల్లో వివాహాలు ఎక్కువగా జరగనున్నాయి. 11వ తేదీ ఆదివారం, స్వాతి నక్షత్రం, సప్తమి రావడంతో ఇది చాలా విశేషమైన రోజుగా పరిగణిస్తారు. 18వ తేదీ కూడా ఆదివారం, శ్రవణ నక్షత్రం, చతుర్దశితో పాటు పౌర్ణమి రావడంతో విశిష్టమైన రోజుగా పండితులు చెబుతుండడంతో ఈ రోజున ఉండే ముహూర్తానికి కూడా మరింత డిమాండ్ ఉంది. అయితే ఈనెల 9న, ఆగస్టు 28న కూడా పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంఘ సమాఖ్య సభ్యులు తాటికొండ. సీతారామశాస్త్రి తెలిపారు.

చెరువుల ఆక్రమణల పరిశీలన

- క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చెరువుల ఆక్రమణల గుర్తింపునకు హైడ్రా రంగంలోకి దిగింది. జలాశయాల వాస్తవ విస్తీర్ణం.. ప్రస్తుతం ఎన్ని ఎకరాల్లో ఉంది..? ఎంతమేర ఆక్రమణకు గురైంది..? అనేది గుర్తించేందుకు సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు సంస్థ పరిధి ఉన్న నేపథ్యంలో ప్రాంతాల వారీగా పర్యటనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. చెరువులను పరిశీలించడంతోపాటు స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం యాప్రాల్, అమీన్‌పూర్ ప్రాంతాల్లో చెరువులను రంగనాథ్ పరిశీలించారు. చెరువు పరిధిలో ఉన్న నిర్మాణాలపై స్థానికులతో మాట్లాడగా.. అవన్నీ అక్రమంగా నిర్మించినవేనని తెలిపారు. హైడ్రా పరిధిలోని చెరువుల్లో అక్రమ నిర్మాణాలు జరిగినట్టు ఫిర్యాదులు వస్తే వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు రంగనాథ్ చెప్పారు. రెండు వారాల్లో ఆయా నిర్మాణాలపై అధికారులు నివేదిక ఇస్తారని, దాని ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. చెరువు ఆక్రమణకు గురైనట్టు నిర్ధారణ అయితే కూల్చివేస్తామని ఆయన తెలిపారు.

పెద్దవాగు పునరుద్ధరణకు 'డ్రిప్'ను సంప్రదించండి

- తెలంగాణ ప్రభుత్వానికి గోదావరి బోర్డు చైర్మన్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దవాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు(డ్రిప్) సహాయం తీసుకోవాలని గోదావరి బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్ ముకేష్‌కుమార్ సిన్హా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఇటీవలి భారీ వర్షాలతో పూర్వ ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుపై సోమవారం జలసౌధలో తెలుగు రాష్ట్రాల అధికారులతో బోర్డు చైర్మన్ ఎంకే సిన్హా, టెక్నికల్ మెంబర్ కనోడియా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్దవాగు దెబ్బతినడానికి కారణాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనుల వివరాలను సిన్హా ఆరా తీశారు. పెద్దవాగుకు వరద పెరుగుతున్నందున స్పిల్‌వే సామర్థ్యం పెంచుకోవాలని, దీనికోసం డ్రిప్‌లో చేరాలని సూచించారు. డ్రిప్ సహాయం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రాజెక్టు కాలువలున్నందున ఏ రాష్ట్రంలోని కాలువలను ఆ రాష్ట్రం బాగుచేసుకోవాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఆయకట్టు అభివృద్ధి, నీటి నిర్వహణ(క్యాడ్‌కామ్)లో సహాయం కోసం అభ్యర్థించాలని తెలుగు రాష్ట్రాలకు సూచించారు. కాగా పెద్దవాగు తాత్కాలిక మరమ్మతులకు దాదాపు రూ.3.5కోట్లు అవసరమవుతాయని అధికారులు తెలిపారు.

2 ప్యాకేజీలుగా కొడంగల్ ఎత్తిపోతలు

- మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు
- ఈనెల 9న టెండర్లు.. బడ్జెట్‌లో రూ.610 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రెండు ప్యాకేజీలుగా విడగొట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఈనెల 9వ తేదీన టెండర్లు పిలవనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలు తీర్చడానికి వీలుగా రెండు దశల్లో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించింది. తొలుత ఈ పథకం కింద ఉన్న చెరువుల నిల్వ సామర్థ్యాన్ని 0.9 టీఎంసీలతో ప్రతిపాదించగా తాజాగా 4 టీఎంసీలకు పెంచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్ రెడ్డి ఈ లిఫ్టు పనులకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. తాజా ప్రతిపాదనల ప్రకారం భూత్పూరు జలాశయం నుంచి కనుకుర్తి వరకు మూడు చోట్ల నీటిని లిఫ్ట్ చేయాలని, మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకటో ప్యాకేజీని తొలి దశలో భూత్పురు జలాశయం నుంచి ఉట్కూరుచెరువు దాకా, రెండో ప్యాకేజీలో జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువు దాకా నీటిని పంపింగ్ చేసే పనులను చేర్చారు. ఈ క్రమంలో ఉట్కూరు, జయమ్మ, కనుకుర్తి చెరువుల ఆధునికీకరణ, నీటి నిల్వ పెంచడానికి వీలుగా ఈ మొదటి దశ పనులకు రూ.2945 కోట్లు వెచ్చించనున్నారు. రెండో దశలో ఏడు చెరువులు (జాజాపూర్, దౌలతాబాద్, బొమ్మరాసిపేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హస్నాబాద్, కొడంగల్) సామర్థ్యాన్ని పెంచుతారు. గ్రావిటీ కాల్వలు, ఆయకట్టుకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం చేపడుతారు. దీనికి రూ.1404.50 కోట్లు అవుతుందని అంచనా వేశారు. మొత్తం లక్ష ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం ద్వారా సాగునీటిని అందిస్తారు. అలాగే 0.38 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటిని అందించనున్నారు. అందుకు అవసరమైన అప్రోచ్ చానళ్లు, టన్నెళ్లు, పంప్ హౌజ్, డెలివరీ మెయిన్స్, సిస్టర్న్లు నిర్మిస్తారు. దాంతో ఈ పథకం నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడానికి వీలుగా పనుల్లో వేగం పెంచనున్నారు. దీని నిర్మాణ అంచనా రూ.4,350 కోట్లుగా వేశారు. పథకంలో మొత్తం 36 కిలోమీటర్ల మేర ప్రెషర్ మెయిన్‌లు (టన్నెల్‌కు బదులుగా పైపులు) వాడాలని నిర్ణయించారు. రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన భూత్పూరు జలాశయం నుంచి నీటిని తరలించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ పథకానికి 2024-25 బడ్జెట్‌లో రూ.610 కోట్లను కేటాయించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 6 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

కాళోజీ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్



ఎంబీబీఎస్, బీడీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)- అనుబంధ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ యూజీ 2024 స్కోర్, వెబ్ ఆప్షన్స్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు తెలంగాణ పరిధిలో చదువుకున్నవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ(బోటనీ, జువాలజీ)/బయోటెక్నాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; ఓసీ దివ్యాంగులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు తప్పనిసరి.
- నీట్ యూజీ 2024 కటాఫ్: మొత్తం 720 మార్కులకుగాను జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 162; దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 127; ఓసీ దివ్యాంగులకు 144 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. లేనిపక్షంలో కౌన్సెలింగ్‌కు అనుమతించరు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.3500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2900
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 13
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్ యూజీ 2024 ర్యాంక్ కార్డ్; పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్‌లు; ఆరు నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్‌లు; టీసీ; కులం, ఆదాయం, నివాసం, ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రాలు; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో; అభ్యర్థి సంతకం.
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in, https://tsmedadm.tsche.in

ఎండీఎస్

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(కేఎన్ఆర్‌యూహెచ్ఎస్)-ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ డెంటల్ కళాశాలలు, ఆర్మీ డెంటల్ కాలేజీల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. నీట్ ఎండీఎస్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. కళాశాలలు, సీట్ల వివరాలను వెబ్ ఆప్షన్స్ నాటికి ప్రకటిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: తెలంగాణ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన డెంటల్ కళాశాల నుంచి బీడీఎస్/తత్సమాన డిగ్రీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ)/స్టేట్ డెంటల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. నీట్-ఎండీఎస్ 2024లో అర్హత పొంది ఉండాలి.

- నీట్ ఎండీఎస్ 2024 కటాఫ్: మొత్తం 800 మార్కులకుగాను జనరల్ అభ్యర్థులకు 263; ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 230; ఓసీ దివ్యాంగులకు 246 మార్కులను కటాఫ్ స్కోర్‌గా నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** నీట్-ఎండీఎస్ 2024 అడ్మిట్ కార్డ్, స్కోర్ కార్డ్; అభ్యర్థి ఫొటో; బీడీఎస్ డిగ్రీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లు; ఆధార్ కార్డ్; కేటగిరీ సర్టిఫికెట్; ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్; డెం టల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** knruhs.telangana.gov.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. మొత్తం 170 సీట్లు ఉన్నాయి.



స్పెషలైజేషన్లు-సీట్లు: ఇంగ్లీష్ 6, తెలుగు 19, ఉర్దూ 3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్ 8, హిస్టరీ 8, పొలిటికల్ సైన్స్ 10, సోషియాలజీ 20, ఆంత్రోపాలజీ 9, ఎడ్యుకేషన్ 2, రీజనల్ స్టడీస్ 5, ఇండియన్ డయాస్పొరా 2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ 4, జెండర్ స్టడీస్ 5, ఎకనామిక్స్ 28, డ్యాన్స్ 3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్ 1, కమ్యూనికేషన్ 3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్స్-ఆప్టోమెట్రీ 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 14
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 10 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(రాత పరీక్ష) తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 8
- **ఇంటర్వ్యూలు:** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఇంటర్వ్యూలో ఎంపికైనవారి జాబితా విడుదల:** డిసెంబరు 2
- **కౌన్సెలింగ్:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ఆర్మీ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్

ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)- బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిని మహిళలకు ఉద్దేశించారు. కోర్సు వ్యవధి నాలుగేళ్లు. నీట్ యూజీ 2024 స్కోర్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్), సైకలాజికల్ అసెస్‌మెంట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 220 సీట్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆర్మీ ఆధ్వర్యంలో ఉన్న ఆరు కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. శిక్షణ సమయంలో ఉచిత రేషన్, ఉచిత వసతి, యూనిఫామ్ అలవెన్స్, ప్రతి నెల స్టయి పెండ్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. కోర్సు పూర్తయిన తరవాత మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో పర్మనెంట్/షార్ట్ సర్వీస్ కమిషన్ స్థాయి అధికారులుగా చేరవచ్చు.

ఆర్మీ నర్సింగ్ కళాశాలలు-సీట్లు: ఏఎఫ్ఎంసీ పుణె-40, సీహెచ్(ఈసీ) కోల్‌కతా-30, ఐఎన్‌హెచ్ఎస్ అశ్విని-40, ఏహెచ్ (ఆర్అండ్ఆర్) న్యూఢిల్లీ-30, సీహెచ్(సీసీ) లక్నో-40, సీహెచ్(ఏఫ్) బెంగళూరు-40.

అర్హత వివరాలు: అవివాహిత/డైవోర్స్‌డ్/లీగల్లీ సెపరేటెడ్ మహిళలు, వితంతువులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్ యూజీ 2024 స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులు 1999 అక్టోబరు 1 నుంచి 2007 సెప్టెంబరు 30 మధ్య జన్మించి ఉండాలి. కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. పద్దెనిమిదేళ్ల లోపు వయసు ఉన్న వారిని రెండు సెంటీమీటర్లు తక్కువగా ఉన్నప్పటికీ అనుమతిస్తారు. ఎన్‌సీసీ-సీ అర్హత ఉన్నవారు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలి.



ఎంపిక: అభ్యర్థులను నీట్ యూజీ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లీష్) నిర్వహిస్తారు. ఇందులో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం అర్ధ గంట. ఇందులో అర్హత పొందినవారిని సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. వీటిలో ఇంటర్ స్థాయి కోర్ సబ్జెక్టుల నుంచి; హాబీస్; జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. క్రీడల్లో పాల్గొన్న అనుభవం ఉన్నవారికి అదనపు వెయిటేజీ ఉంటుంది. తరవాత ఢిల్లీ బేస్ హాస్పిటల్ స్పెషల్ మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పై స్కోర్లన్నింటినీ పరిగణనలోకి తీసుకొని మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 7
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్లు/మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్ పీవో/ఎంటీ- XIV) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 4,455 పోస్టులు భర్తీ చేయనున్నారు.

- సీఆర్‌పీ ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రెయినీ - XIV

ఖాళీలు: 4,455(ఎస్సీ-675, ఎస్టీ-332, ఓబీసీ-1185, ఈడబ్ల్యూఎస్-435, యూఆర్-1846)

ఖాళీలున్న ప్రభుత్వరంగ బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

బ్యాంకుల వారీగా ఖాళీలు

1. బ్యాంక్ ఆఫ్ బరోడా: **ఎన్ఆర్**
2. బ్యాంక్ ఆఫ్ ఇండియా: **885**
3. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర: **ఎన్ఆర్**
4. కెనరా బ్యాంక్: **750**
5. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: **2000**
6. ఇండియన్ బ్యాంక్: **ఎన్ఆర్**
7. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్: **260**
8. పంజాబ్ నేషనల్ బ్యాంక్: **200**
9. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్: **360**
10. యూకో బ్యాంక్: **ఎన్ఆర్**
11. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా: **ఎన్ఆర్**

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై అభ్యర్థులు అర్హులు

ఖాళీలు 4455



వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; ఇతరులు రూ.850 చెల్లించాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్ రాత పరీక్షలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, ఏలూరు, గుంటూరు/విజయవాడ, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్.

తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ పరీక్ష కేంద్రాలు: గుంటూరు/విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్, కరీంనగర్.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టెస్ట్): ఈ పరీక్షను 100 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35 ప్రశ్నలు (35 మార్కులు), రీజనింగ్ నుంచి 35 ప్రశ్నలు(35 మార్కులు) ఇస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్న పత్రం ఉంటుంది. ఐబీపీఎస్ నిర్దేశించిన కటాఫ్ మార్కుల మేరకు అర్హత సాధించిన వారిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్ ఎగ్జామినేషన్(ఆబ్జెక్టివ్/డిస్క్రిప్టివ్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్న పత్రంలో మొత్తం 155 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షను ఇంగ్లీష్/హిందీ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) ఇస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే): 2 ప్రశ్నలు ఇస్తారు. 25 మార్కులు కేటాయించారు. ఈ పరీక్షకు నిర్దేశించిన సమయం 30 నిమిషాలు.

ముఖ్య సమాచారం:

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ:** ఆగస్టు 21
- **ప్రీ-ఎగ్జామ్ ట్రెయినింగ్:** 2024 సెప్టెంబరు
- **ప్రిలిమినరీ పరీక్ష కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** 2024 అక్టోబరు
- **ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు:** 2024 అక్టోబరు/నవంబరు
- **మెయిన్ ఎగ్జామ్ కాల్‌లెటర్ డౌన్‌లోడ్:** 2024 నవంబరు
- **మెయిన్ ఎగ్జామ్ ఫలితాలు:** 2024 డిసెంబరు/2025 జనవరి
- **ఇంటర్వ్యూలు:** 2025 జనవరి/ఫిబ్రవరి
- **తుది నియామకాలు:** 2024 ఏప్రిల్
- **వెబ్‌సైట్:** https://ibps.in/

Institute of Banking Personnel Selection

ప్రిలిమ్స్ సిలబస్

రీజనింగ్: లాజికల్ రీజనింగ్, ఆల్ఫాన్యూమరిక్ సిరీస్, ర్యాంకింగ్/డైరెక్షన్/ఆల్ఫాబెట్ టెస్ట్, డేటా సఫిషియెన్సీ, ఇనిక్వాలిటీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్, పజిల్, ట్యాబులేషన్, సిల్లాగిజమ్, బ్లడ్ రిలేషన్స్, ఇన్‌పుట్-ఔట్‌పుట్, కోడింగ్- డికోడింగ్

క్వాంటిటేటివ్ ఎబిలిటీ: సింప్లిఫికేషన్, ప్రాఫిట్స్ అండ్ లాస్, మిక్చర్స్ అండ్ అలిగేషన్స్, సింపుల్ ఇంటరెస్ట్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్ అండ్ సర్డ్స్ అండ్ ఇండిసెస్, వర్క్ అండ్ టైమ్, టైమ్ అండ్ డిస్టెన్స్, మెన్సురేషన్- సిలిండర్, కోన్ స్ఫేర్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, రేషియో అండ్ ప్రొపర్షన్ పర్సంటేజ్, నంబర్ సిస్టమ్స్, సీక్వెన్స్ అండ్ సిరీస్, పర్ముటేషన్, కాంబినేషన్ అండ్ ప్రొబాబిలిటీ.

ఇంగ్లీష్ లాంగ్వేజ్: రీడింగ్ కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్ట్, ప్యారా జంబుల్స్, వర్డ్ యూసేజ్, వర్డ్ స్వాప్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఎర్రర్ డిటెక్షన్, ఎర్రర్ స్పాటింగ్, ప్యారాగ్రాఫ్ కంప్లీషన్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్, మిసిలీనియస్.


లిటిల్స్



కాకి-పిచ్చుక

అడవిలో ఉండే ఒక కాకికి తాను మిగతా పక్షులకన్నా ఎత్తులో వేగంగా ఎగరగలననే పొగరు, అతి విశ్వాసం ఉండేవి. ఒక రోజు చిన్న పిచ్చుక ఒకటి నెమ్మదిగా ఎగురుకుంటూ కాకి గూడు దగ్గరగా వెళుతుంది. కాకి దాన్ని చూసి, నీకు కనీసం అందంగా వేగంగా ఎగరడం కూడా రానట్లు ఉన్నది కదా. ఏదో పురుగు గెంతినట్టు ఎగురుతున్నావు నన్ను చూసి, ఎలా ఎగరాలో నేర్చుకుందువులే అంటూ ఎగతాళిగా మాట్లాడింది. ఆ మాటలకు చిన్న పిచ్చుక నొచ్చుకున్నా, ఎవరి శక్తి, ఎవరి పద్ధతి వారిది, అందరూ నీలాగే ఉండాలంటే ఎలా? అని వెళ్లిపోయింది. కానీ కాకి అక్కడితో ఆగలేదు పిచ్చుకను అదేపనిగా ఎగతాళి చేస్తూనే ఉంది. ఇదంతా చూసిన తోటి పక్షులు ఇతర జంతువులు అన్నీ కాకితో ఇలా అన్నాయి. 'మీ ఇద్దరిలో ఎవరు బాగా ఎగరగలరో తేల్చుకోడానికి ఒక పోటీ పెడదాం. మీ ఇద్దరిలో ఎవరైతే ఆ దట్టమైన ఊడలున్న మర్రి చెట్టును ముందుగా చుట్టి వస్తారో వారే పోటీలో విజేత అన్నాయి జంతువులన్నీ. కాకి తన మీద తనకు గల అతి నమ్మకంతో ముందూ వెనుక చూసుకోకుండా వేగంగా ఎగిరిపోయి, దట్టంగా చిక్కుగా ఉన్న ఆ మర్రి ఊడల్లో తన రెక్కలు చిక్కుకుని అలాగే కదలకుండా ఉండిపోయింది. చిన్న రెక్కలు, చిన్న శరీరం ఉన్న పిచ్చుక తేలికగా ఆ గుబురు ఊడల మధ్య నుంచి ఎగురుతూ, కాకి కంటే ముందే చెట్టును చుట్టి వచ్చి, పోటీలో గెలిచింది. ఎపుడూ ఎవరిశక్తి సామర్థ్యాలను తక్కువ చేసి అవమానించి మాట్లాడకూడదు.

సరైన నీడ ఏది?



10 తేడాలను కనుక్కోండి



దారి కనుక్కోండి



ఎన్ని కుక్కలు ఉన్నాయి?



డైలీ సుడోకు - 376

	4				1
	6	3			
6		2			
			2		3
			4	5	
5				1	

సుడోకు - 375 సమాధానం

7	8	1	4	5	3	6	2	9
4	3	9	2	6	7	8	5	1
6	2	5	8	9	1	7	3	4
5	1	6	7	4	8	3	9	2
2	9	3	6	1	5	4	8	7
8	4	7	9	3	2	1	6	5
9	5	4	1	8	6	2	7	3
3	7	8	5	2	4	9	1	6
1	6	2	3	7	9	5	4	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.